
వీరయ్య చౌదరి భార్య, కుమారుడిని పరామర్శిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రులు అనిత, స్వామి


వీరయ్య చౌదరి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి ఆనం, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, మాజీ ఎమ్మెల్యే గరటయ్య

వీరయ్యకు కన్నీటి వీడ్కోలు

- స్వగ్రామంలో అంత్యక్రియలు
- నివాళులర్పించిన సీఎం చంద్రబాబు
- కుటుంబ సభ్యులకు పరామర్శ
- హంతకులు ఎక్కడ ఉన్నా శిక్ష తప్పదని హెచ్చరిక
- పాల్గొన్న మంత్రులు, తరలివచ్చిన టీడీపీ శ్రేణులు
- జనసంద్రంగా మారిన అమ్మనబ్రోలు
- నిలకడగా ఈదర హరిబాబు ఆరోగ్యం


వీరయ్య చౌదరి అంతిమయాత్ర

ఒంగోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో మంగళవారం రాత్రి దారుణ హత్యకు గురైన టీడీపీ ముఖ్యనేత, నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరికి టీడీపీ శ్రేణులు, ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. బుధవారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు స్వగ్రామమైన అమ్మనబ్రోలులో జరిగాయి. స్వయంగా టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చి వీరయ్యచౌదరి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో హెలికాప్టర్‌లో జిల్లాకు సీఎం చేరుకున్నారు. చదలవాడ సమీపంలోని హెలిప్యాడ్ వద్ద దిగి అక్కడి నుంచి కాన్వాయ్‌లో అమ్మనబ్రోలు చేరారు. స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ప్రాథమికంగా హత్యకు సంబంధించిన అంశాలను బస్సులో సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముందుగానే అక్కడకు చేరిన మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులను కూడా హత్య గురించి చంద్రబాబు వాకబు చేశారు. పోలీసు అధికారులతో మాట్లాడి పలు విషయాలను తెలుసుకున్నారు. అనంతరం నేరుగా వీరయ్యచౌదరి నివాసానికి చేరుకొని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. వీరయ్య భార్య, కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని

మిగతా 6వ పేజీలో

నిలకడగా హరిబాబు ఆరోగ్యం

వీరయ్యచౌదరి దారుణ హత్యతో షాక్‌కు లోనై గుండెపోటుకు గురైన ఆయన మేనమామ, జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉంది. మంగళవారం రాత్రి రిమ్స్ వద్ద వీరయ్యచౌదరి మృతదేహాన్ని చూసి బోరున విలపించిన హరిబాబు ఆ వెంటనే అనారోగ్యానికి గురయ్యారు. ప్రైవేటు వైద్యశాలకు తరలించగా గుండెపోటు అని నిర్ధారించిన వైద్యులు తక్షణ చికిత్స చేశారు. దీంతో ఆరోగ్యం మెరుగుపడుతుండగా మరోసారి కూడా గుండెపోటు రావడంతో ఆందోళన నెలకొంది. వైద్యులు సీపీఆర్ చేసి ఐసీయూలో వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉంది.

అండగా నిలుద్దాం

- వీరయ్య చౌదరి కుటుంబానికి బాసటగా ఉందాం
- హంతకులపై చట్టపరమైన చర్యలు
- మాగుంట కార్యాలయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల భేటీ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీపీ వీరయ్యచౌదరి హత్యకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలతోపాటు అతని కుటుంబానికి అండగా నిలవాలని మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు నిర్ణయించినట్లు సమాచారం. స్థానిక మాగుంట కార్యాలయంలో బుధవారం ఉదయం మంత్రులు, శాసనసభ్యులు, ఇన్‌చార్జిలు భేటీ అయ్యారు. వాస్తవంగా ఒంగోలులో బుధవారం జిల్లా సమీక్షామండలి (డీఆర్సీ) సమావేశం జరగాల్సి ఉంది. అందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు కూడా చేశారు. అయితే మంగళవారం రాత్రి వీరయ్య చౌదరి ఆయన కార్యాలయంలోనే దారుణ హత్యకు గురికావడంతో ఆ సమావేశాన్ని వాయిదా వేశారు. మంగళవారం రాత్రి రిమ్స్‌లో వీరయ్య మృతదేహాన్ని


ఒంగోలులోని ఎంపీ కార్యాలయంలో సమావేశమైన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, మారిటైం బోర్డు చైర్మన్

మంత్రులు, ఎమ్మెల్యేలు సందర్శించారు. బుధవారం ఒంగోలుకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంమంత్రి అనిత, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామిలు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో భేటీ అయ్యారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఏలూరి సాంబశివరావు, ఎంఎం కొండయ్య, దర్శి, వైపాలెం ఇన్‌చార్జిలు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబు, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరయ్య హత్యపైనే వారు ప్రధానంగా చర్చించుకున్నట్లు సమాచారం.

వీరయ్య హత్య కేసుపై సీఎం సమీక్ష

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత వీరయ్య చౌదరి భౌతికకాయాన్ని సందర్శించేందుకు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు వచ్చారు. ఈ సందర్భంగా చదలవాడ హెలిప్యాడ్ వద్ద ఉన్నతాధికారులతో ఆయన కొద్దిసేపు సమీక్ష నిర్వహించారు. కేసు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను త్వరతగతిన పట్టుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎంవో చీఫ్ సెక్రటరీ ప్రద్యుమ్న, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్‌చంద్ర లడ్హా, లాఅండ్ ఆర్డర్ డీజీ మోహన్‌రెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్ పాల్గొన్నారు.

అదుపులో అనుమానితులు

వీరయ్య హత్య కేసులో దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు

- పొన్నూరు వద్ద 9 మందిని పట్టుకున్నట్లు సమాచారం
- విచారణలో సాంకేతిక పరిజ్ఞానం కీలకం
- రేషన్ బియ్యం డాన్ పనేనని అనుమానం


వీరయ్య (ఫైల్)

వివరాలు 7వ పేజీలో


గిద్దలూరులో టపాసులు కాలుస్తున్న జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు

ప్రతిభ చాటారు

పదిలో మెరుగైన ఫలితాలు

బాలికలదే పైచేయి

- జిల్లాలో 85.43 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రంలో 9వ స్థానం

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. 85.43 శాతం ఉత్తీర్ణత సాధించి శభాష్ అనిపించారు. రాష్ట్రంలో 9వ స్థానంలో నిలిచారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం, రాష్ట్ర స్థాయి స్థానం దిగజారింది. అయితే రాష్ట్ర సగటు ఉత్తీర్ణతతో పోలిస్తే జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులతో జిల్లాకు మంచి గుర్తింపు తెచ్చారు. ప్రథమ శ్రేణి ఉత్తీర్ణతలోనూ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు.

జిల్లాలో నాలుగు సంవత్సరాలుగా పదో తరగతి ఫలితాలు ఇలా

సంవత్సరం	హాజరైనవారు	ఉత్తీర్ణులు	శాతం	రాష్ట్రస్థానం
2022	41,061	32,131	78.30	1
2023	28,718	21,177	73.74	12
2024	29,195	26,630	91.21	7
2025	29,386	25,103	85.43	9

ఒంగోలు విద్య, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 10వ తరగతి పరీక్షలకు 29,386 మంది హాజరు కాగా 25,103 మంది పాసయ్యారు. 85.43 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రస్థాయి ఉత్తీర్ణత సగటున 81.14శాతం కాగా, జిల్లా విద్యార్థులు 4.29శాతం అధికంగా పాసయ్యారు. రాష్ట్రంలో 9వ స్థానంలో నిలిచారు. ఫలితాల్లో బాలికలు భళా అనిపించారు. వారు 87.02శాతం మంది ఉత్తీర్ణులు కాగా బాలురు 3.20శాతం తక్కువగా 83.87శాతం మంది పాసయ్యారు. బాలికలు 14,506 మంది పరీక్షకు హాజరుకాగా

మిగతా 6వ పేజీలో

హంస వాహనంపై చెన్నయ్య

ముగిసిన బ్రహ్మోత్సవాలు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు హంస వాహనంపై ప్రజాపతి అలంకారంలో దర్శనమిచ్చారు. నాలుగు మాడవీధుల్లో విహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. ఇంతటితో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అనంతరం పూర్ణాహుతి, ధ్వజావరోహణ, మంగళహారతులు నిర్వహించారు. 4 రోజులపాటు వసంతోత్సవాలు, అనంతరం ఊంజల్ సేవ నిర్వహించనున్నట్లు ఉత్సవ సేవా సంఘం అధ్యక్షుడు యక్కలి కాశీవిశ్వనాథం, ఆలయ ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు.




క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలించే పనిలో దర్శి సీఐ రామారావు

కూలీల ఆటో బోల్తా

- మహిళ మృతి
- ఏడుగురికి తీవ్ర గాయాలు

7

ఓపెన్ ఫలితాల్లో ఢమాల్

- పదిలో 7.43 శాతం ఉత్తీర్ణత
- ఇంటర్‌లో 14.91 శాతం
- రాష్ట్రంలో అట్టడుగున జిల్లా

7

మే 19 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

వీరయ్యచౌదరికి కన్నీటి వీడ్కోలు

(5వ పేజీ తరువాయి)

వారిని ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి వీరయ్య చౌదరి చేసిన సేవలను కొనియాడారు. ఇలా క్రూరంగా ఆయన్ను హత్య చేయడం తనను కలిచివేసిందన్నారు. ఇలాంటి హత్యా రాజకీయాలతో గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం వణికిపోయిందన్నారు. టీడీపీ పాలనలో అలాంటి పరిస్థితికి తావులేదన్నారు. హంతకులు ఎక్కడ ఉన్నా పట్టుకొని కఠినంగా శిక్షించి వీరయ్యచౌదరి ఆత్మకు శాంతి చేకూర్చుతామన్నారు.

మధ్యాహ్నం పోస్టుమార్టం పూర్తి

ఒంగోలులో మంగళవారం రాత్రి హత్య అనంతరం వీరయ్యచౌదరి మృతదేహాన్ని స్థానిక రిమ్స్ మార్చురీలో ఉంచగా బుధవారం 12గంటల ప్రాంతంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఆ సమయంలో రాష్ట్రమంత్రులు వంగలపూడి అనిత, ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఎమ్మెల్యేలు బీఎన్ విజయ్‌కుమార్, దామచర్ల జనార్దన్, అశోక్‌రెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ తదితరులు అస్పత్రికి చేరుకున్నారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన అమ్మనబ్రోలు తరలించారు. తొలుత ఎంపీ మాగుంట కార్యాలయంలో వారు భేటీ అయి వీరయ్య హత్య, తదంతర పరిణామాలపై చర్చించారు. అలాగే బుధవారం జరగాల్సిన డీఆర్సీ సమావేశాన్ని రద్దు చేసుకొని అమ్మనబ్రోలు వెళ్లి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

అమ్మనబ్రోలుకు తరలివచ్చిన టీడీపీ శ్రేణులు, అభిమానులు

అమ్మనబ్రోలుకు వీరయ్య చౌదరి భౌతికకాయం మధ్యాహ్న సమయంలో చేరగా వేలాదిగా టీడీపీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. దీంతో గ్రామం జనసంద్రంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చిన సమయంలోనూ జనంతో కిటకిటలాడింది. కడసారి తమ నాయకుడిని చూసేందుకు ప్రజానీకం తరలిరావడంతోపాటు అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతిమయాత్రలో రాష్ట్రమంత్రులు, టీడీపీ కీలక నేతలతోపాటు వీరయ్య చౌదరి సమీప బంధువైన పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందీశ్వరి ఈ ఘటనపై ఆరా తీశారు. మోహన్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవడంతోపాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

‘పది’లో ప్రతిభ చాటారు

(5వ పేజీ తరువాయి)

12,623 మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలో సగటున బాలికలు 84.09శాతం మంది ఉత్తీర్ణులు కాగా జిల్లా బాలికలు 3శాతం మంది అదనంగా సాధించారు. బాలురు 14,880 మంది పరీక్షకు హాజరు కాగా 12,480 మంది పాసై 83.87శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో బాలుర ఉత్తీర్ణత సగటు 78.35శాతం కాగా జిల్లాలో 5.5శాతం మంది అధికంగా పాసయ్యారు.

మార్కుల సాధనలో మేటి

జిల్లా విద్యార్థులు మార్కుల సాధనలోను మేటిగా నిలిచారు. 21,661 మంది ప్రథమ శ్రేణిలో, 2,520 మంది ద్వితీయ శ్రేణిలో పాసయ్యారు. కేవలం 872 మంది మాత్రమే తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ప్రథమశ్రేణి ఉత్తీర్ణతలో విశాఖ జిల్లా విద్యార్థులు రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలవగా మన జిల్లా విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచి మెరిశారు.

96 పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాలోని 96 పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. మొత్తం 608 పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 96 స్కూళ్లలో పరీక్ష రాసిన విద్యార్థులందరూ పాసయ్యారు. వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలు అగ్రస్థానంలో నిలిచాయి. ఆ తర్వాత స్థానంలో జిల్లా పరిషత్ హైస్కూళ్లు ఉన్నాయి. 54 ప్రైవేటు పాఠశాలలు, 25 జడ్పీ హైస్కూళ్లు ఐదు కేజీబీవీలు, ఏపీ సాంఘిక సంక్షేమ, బీసీ సాంఘిక సంక్షేమ గురుకులాలు మూడేసి, ఏపీ మోడల్ స్కూళ్లు, ఎయిడెడ్ స్కూళ్లు రెండేసి, ఏపీ రెసిడెన్షియల్, ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు ఒక్కొక్కటి వందశాతం ఉత్తీర్ణత సాధించి అగ్రభాగాన నిలిచాయి.

యాజమాన్యాల వారీగా ఉత్తీర్ణత

ఎయిడెడ్‌లో 444 మందికి 326 మంది ఉత్తీర్ణులై 73.42శాతం సాధించారు. ఏపీ మోడల్ స్కూళ్లలో 444 మందికి 404మంది (90.99శాతం) పాసయ్యారు. ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లలో 208 మందికి 203 మంది పాసై 97.6శాతం సాధించారు. ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌లో 857 మందికి 813 మంది (94.87శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఏపీడబ్ల్యూఆర్‌ఎస్‌లో 54 మందికి 25 మంది (46.3శాతం) పాసయ్యారు. ఏపీటీడబ్ల్యూఎస్‌లో 289 మందికి 210 మంది ఉత్తీర్ణులై 72శాతం సాధించారు. బీసీడబ్ల్యూఆర్‌ఎస్ 218 మందికి 211 మంది (96.79శాతం) పాసయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1,887 మందికి 1,198 మంది పాసై 63.49శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

కేజీబీవీల్లో 1,017 మందికి 880 మంది (86.53శాతం) పాసయ్యారు.

మునిసిపల్ స్కూళ్లలో 561 మందికి 432 మంది (77.01శాతం) ఉత్తీర్ణులయ్యారు.

జడ్పీ హైస్కూళ్లలో 11,894 మందికి 9,597 మంది (80.69శాతం) పాసయ్యారు.

ప్రైవేటులో 11,513 మందికి 10,804 మంది (93.84శాతం) ఉత్తీర్ణులయ్యారు.

మొత్తం 29,386 మందికి 25,103 మంది పాసై 85.43శాతం ఉత్తీర్ణత సాధించారు.

హంతకులను వదలం

● నేను వీరయ్య కోసం వచ్చానంటే అర్థం చేసుకోండి ● నిందితుల జాడ తెలిస్తే 9121104784కి తెలపండి ● సీఎం చంద్రబాబు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ‘ముప్పవరపు వీరయ్య చౌదరిని అతి కిరాతకంగా అంతమొందించారు. హంతకులను ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టే ప్రసక్తి లేదు’ అని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నిన్న ఒంగోలులోని తన కార్యాలయంలో దారుణ హత్యకు గురైన టీడీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి మృతదేహానికి ఆయన స్వగ్రామం అమ్మనబ్రోలులో సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం మీడియాతో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమానికి అహర్నిశలు పాటుపడిన వ్యక్తి వీరయ్య అన్నారు. ‘యువగళం పాదయాత్రలో వంద రోజుల పాటు యువనేత నారా లోకేష్‌తో వెన్నంటే ఉండి నడిచారు. చీరాల, సంతనూతలపాడు నియోజకవర్గంలో పార్టీకి అత్యధిక మెజారిటీ తీసుకురావడంలో వీరయ్య చౌదరి కీలకంగా వ్యవహరించారు. అలాంటి గొప్ప వ్యక్తిని క్రూరంగా అంతమొందిన తీరు చూస్తుంటే అత్యంత బాధాకరంగా ఉంది. శరీరంపై 49 కత్తిపోట్లు ఉన్నాయి. రాష్ట్రంలో ఇలాంటి క్రూరులు ఉండటం పట్ల బాధేస్తోంది. మంచితనం, సమర్థత కలిగిన నాయకుడిని పార్టీ కోల్పోయింది. గత ఐదేళ్ల పాలనలో హత్యా రాజకీయాలతో రాష్ట్రం వణికిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అలాంటి వాటికి చెక్ పెట్టాం. రాష్ట్రం ప్రశాంతంగా ఉన్న సమయంలో వీరయ్య చౌదరి దారుణ హత్యతో ఉలికిపాటుకు గురిచేసింది. ఆ విషయాన్ని నేను జీర్ణించుకోలేక పోతున్నాను. తక్షణమే 12 ప్రత్యేక పోలీసు బృందాలతో దర్యాప్తును వేగవంతం చేశాం. సీసీ టీవీ దృశ్యాలను పరిశీలించాం. రాజకీయ, వ్యాపార, ఆర్థిక లావాదేవీల కోణాల్లోనూ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. ఎంతటి తెలివైన వారైనా సరే వదిలేది లేదు. వీరయ్య రాజకీయ ఎదుగుదలను జీర్ణించుకోలేక అంతమొందిచారు. అంచెలంచెలుగా ఎదుగుతూ రాజకీయ భవిష్యత్ ఉన్న నాయకుడు, పిలిస్తే పలికే నాయకుడు వీరయ్య. నేను వీరయ్య కోసం అమ్మనబ్రోలు వచ్చానంటే అర్థం చేసుకోండి. హత్యా రాజకీయాలు, క్రూరమైన హత్యలు చేసేవారు కాలగర్భంలో కలిసిపోక తప్పదు. వీరయ్య కుటుంబసభ్యులు ఎంతో అమాయకులు. వారికి రాజకీయాలు తెలియవు. వీరయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది. అన్నివిధాల ఆదుకొంటాం. భవిష్యత్‌లో తమ సొంత కుటుంబ సభ్యులుగా వారిని చూసుకొంటాం. నేర రాజకీయాలు చేసే వారిని తుది ముట్టిస్తాం. హత్యకు పాల్పడిన వ్యక్తుల సమాచారం తెలిస్తే 9121104784 టోల్ ఫ్రీ నంబరుకు తెలియపరచాలి. సమాచారం చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. ఇంత దుర్మార్గంగా, పాశవికంగా హత్యకు పాల్పడిన వ్యక్తులు సమాజంలో, భూమిమీద ఉండేందుకు అర్హులు కాదు’ అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. తొలుత వీరయ్య చౌదరి మృతదేహానికి హోంమంత్రి తానేటి అనిత, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్, ఏలూరి సాంబశివరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వీరయ్య చౌదరి భౌతిక కాయానికి టీడీపీ జెండా కప్పుతున్న మంత్రి ఆనం

సర్పంచ్, పూర్వ పంచాయతీ కార్యదర్శిపై క్రిమినల్ కేసులు

» 7 రోజుల్లో అపరాధ వడ్డీతో జమ చేయాలి

» కలెక్టర్ ఆదేశం

» ఆ ఇద్దరిపై బిగిసిన ఉచ్చు

అద్దంకి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన అద్దంకి మండలం చినకొత్తపల్లి సర్పంచ్ గుజ్జుల మల్లిక, అప్పటి పంచాయతీ కార్యదర్శి కె. ఈశ్వరరెడ్డిపై ఉచ్చు బిగిచింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చినకొత్తపల్లి పంచాయతీ పరిధిలో సుమారు రూ.40లక్షలతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌ల నిర్మాణ పనులు జరిగాయి. ఇందుకు సంబంధించి మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.15,74,283 విలువైన మెటీరియల్‌ను టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్ సమకూర్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిధులు విడుదల కాగా, ఆ మొత్తాన్ని మురళీమోహన్‌దాస్‌కు కాకుండా పంచాయతీ సర్పంచ్ మల్లిక సోదరుడు అయిన చంద్రగిరి వీరారెడ్డికి చెల్లించేందుకు బ్యాంక్ నుంచి పంచాయతీ సర్పంచ్, అప్పటి పంచాయతీ కార్యదర్శి (ప్రస్తుతం సంతమాగులూరు మండలం పాత మాగులూరు పంచాయతీ కార్యదర్శి) డబ్బులు డ్రా చేశారు. ఈ నేపథ్యంలో మానం మురళీమోహన్‌దాస్ అప్పటి నుంచి పోరాటం చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మరలా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు కదలి విచారణ చేపట్టారు. వివిధ స్థాయిలలో జరిగిన విచారణ లో నిబంధనలకు విరుద్ధంగా బ్యాంక్ నుంచి డబ్బులు డ్రా చేసి చంద్రగిరి వీరారెడ్డికి చెల్లించినట్లు నిర్ధారణ అయింది. ఇప్పటికే సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయగా, పునరుద్ధరించాలని సర్పంచ్ మల్లిక కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసుకోగా నిరాకరించారు.

వారం రోజుల్లో అపరాధ వడ్డీతో చెల్లించాలని ఆదేశాలు

- క్రిమినల్ కేసు నమోదుకు చర్యలు

మెటీరియల్ కాంపోనెంట్ కింద చెల్లించాల్సిన రూ.15,74,283తో పాటు అపరాధ వడ్డీతో సహా వారంరోజులలో పంచాయతీ ఖాతాకు జమచేయాలని కలెక్టర్ వెంటమురళి ఉత్తర్వులు ఇచ్చినట్లు ఎంపీడీవో శింగయ్య తెలిపారు. నిధులు దుర్వినియోగం రుజువు అయిన నేపథ్యంలో సర్పంచ్ మల్లిక, అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిపై క్రిమినల్ కేసుల నమోదుకు చర్యలు చేపట్టాలని చీరాల డీఎల్‌పీవోను కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిని సస్పెండ్ చేస్తూ గతంలో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు ఇచ్చారు. అయితే సస్పెండ్ చేసే అధికారం జిల్లా పంచాయతీ అధికారికి లేదని పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈనేపథ్యంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు రుజువు అయినందున ఎందుకు చర్యలు తీసుకోకూడదో 10 రోజులలోపు సంజాయిషీ ఇవ్వాలని కలెక్టర్ అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డికి నోటీసులు ఇచ్చారు. అటు క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశాలు, ఇటు అపరాధ వడ్డీతో మొత్తం డబ్బులు పంచాయతీ ఖాతాకు జమచేయాలని కలెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చిన నేపథ్యంలో సర్పంచ్, అప్పటి పంచాయతీ కార్యదర్శిపై పూర్తిస్థాయిలో ఉచ్చు బిగిసినట్లు అయింది.



చినకొత్తపల్లి గ్రామ సచివాలయ భవనం

రూ.5 లక్షలు చోరీ

● మేనల్లుడి పెళ్లికి బంగారు కొనేందుకు డ్రా చేసిన నగదుతో పరార్ ● కేసు నమోదు

అద్దంకి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటి వద్ద నుంచి తెచ్చిన రూ.2లక్షలతో పాటు బ్యాంక్ నుంచి డ్రా చేసిన మరో రూ.3లక్షల నగదును మోటార్‌సైకిల్ ట్యాంక్ కవర్‌లో ఉంచగా, దొంగలు అపహరించుకు పో యారు. ఈ ఘటన అద్దంకి పట్టణంలోని పాతబస్టాండ్ సెంటర్‌లో బుధవా రం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బల్లికురవ మండలం కూకట్లపల్లికి చెందిన చాగంటి దానసూరబాబు తన మేనల్లుడు పెళ్లి కోసం బంగారం కొనుగోలు చేసేందుకు బుధవారం అద్దంకి వచ్చారు. ఇంటి వద్ద నుంచి రూ.2లక్షలు తీసుకురాగా, అద్దంకి పట్టణంలోని ఎస్‌బీఐ (ఏడీబీ)లో నుంచి రూ.3లక్షల నగదు డ్రా చేశారు. మొత్తం నగదు ను హ్యాండ్ క్యాష్ బ్యాగ్‌లో పెట్టుకొని పాతబస్టాండ్‌లో టిఫిన్ చేస్తున్నారు. అదే సమయంలో మోటార్‌సైకిల్‌పై ఇద్దరు యువకులు వచ్చి నగదు ఉన్న క్యాష్ బాగ్‌ను తీసుకొని మేదరమెట్ల వైపు వెళ్లిపోయారు. బాధితుడు దానసూరబాబు అరుస్తూ వెంబడించినప్పటికీ దొంగలు వేగంగా మోటార్‌సైకిల్‌పై వెళ్లిపోయారు. పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో సీఐ సుబ్బరాజు వెంటనే బ్యాంక్‌కు వెళ్లి నగదు లావాదేవీలు, సీసీ ఫుటేజ్‌ని పరిశీలించారు. రూ.3లక్షల నగదును డ్రా చేసినట్లు గుర్తించి ఆ మేరకు చోరీ జరిగినట్లు కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి బాధితుడు నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణ పరిధిలో నామ్ రోడ్డు వెంబడి ఉన్న సీసీ కెమెరాలలో ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. బ్యాంక్‌లో నగదు డ్రా చేసేటప్పటి నుంచి దానసూరబాబును దొంగలు గమనిస్తూ వెంబడించి చోరీకి పాల్పడినట్లు తెలుస్తుంది.

అవిశ్వాసానికి సిద్ధం

» ఎట్టకేలకు కలెక్టర్‌కు తీర్మానం అందజేత

» చక్రం తిప్పిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై ఎట్టకేలకు ఎమ్మెల్యే కొండయ్య వర్గం అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్ వెంకటమురళికి అందజేసింది. ఈ విషయం ముందు నుంచే ఆంధ్రజ్యోతి చెప్తునూ ఉంది. అయితే రెండు మాసాలుగా నలుగుతున్న ఈ అంశానికి బుధవారంతో తెరపడింది. పలు మార్లు బల నిరూపణ విషయంలో ఎమ్మెల్యే కొండయ్య ఏమాత్రం తొణక కుండా, జాగ్రత్తగా అడుగులు వేశారు. ఈక్రమంలో మునిసిపాలిటీపై తనదైన శైలిలో పట్టు సాధించారు. ప్రత్యర్థుల ప్రయత్నాలను తిప్పికొడుతూ అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టర్ వారిని బలంతపు ప్రయోగాలపై సూటిగా ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే అవిశ్వాసానికి వెళ్లిన కౌన్సిలర్లు సానుకూలంగా స్పందిచడంతో తదుపరి ప్రక్రియకు ఆర్డీవో ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిసింది. అయితే మ్యాజిక్ ఫిగర్ ఛేదించిన అనంతరం వారిని ఎమ్మెల్యే ఆస్థానంలోకి మరల్చినట్లు సమాచారం.



అద్దంకిలోని 175 సంవత్సరాల నాటి తహసీల్దార్ కార్యాలయం

నాటి కట్టడం కనుమరుగే

175 ఏళ్ల నాటి తహసీల్దార్ కార్యాలయ భవనం తొలగింపు

అద్దంకి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలోని మరో పురాతన భవనం కనుమరుగు కానుంది. సుమారు 175 ఏళ్ల కిందటి తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని తొలగిస్తున్నారు. 1850 ప్రాంతంలో అప్పటి నెల్లూరు జిల్లా పరిధిలోని అద్దంకి కేంద్రంగా తాలూకా ఏర్పడింది. అప్పట్లో పెంకులతో తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం జరిగింది. సుమారు 15 సంవత్సరాల క్రితం వరకు ఇదే భవనంలో తహసీల్దార్ కార్యాలయం కొనసాగింది. కొత్తభవనం నిర్మాణంతో అక్కడ నుంచి మార్పు చేశారు. దీంతో ఖాళీగా ఉంది. మున్సిపల్ కార్యాలయ భవనం నిర్మాణానికి తొలుత పరిశీలన చేసి నప్పటికీ స్థలం సరిపోదన్న ఉద్దేశంతో ఉపసంహరించుకున్నారు. కొత్తగా పట్టణానికి రెండు ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లు మంజూరైన నేపథ్యంలో ఒకటి ఎస్‌ఎస్‌పీ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్నారు. రెండవది పాత తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని తొలగించి ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు సిద్ధం కావడంతో ఎక్స్‌కవేటర్‌తో పాత తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని తొలగించే పనులు ప్రారంభించారు. త్వరలో 15 ఏళ్ల నాటి భవనం పూర్తిగా కనుమరుగు కానుంది.



తహసీల్దార్ కార్యాలయాన్ని తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్



తలుపులు తీయని సచివాలయాన్ని చూస్తున్న ఎంపీడీవో ప్రభాకరశర్మ

తలుపులు తీయని తలకొండపాడు సచివాలయం

● ఉద్యోగులకు షోకాజు నోటీసులిచ్చిన ఎంపీడీవో

పీసీపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సమయపాలన పాటించకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సచివాలయాల తలుపులు కూడా తీయని సచివాలయ ఉద్యోగులపై పీసీపల్లి ఎంపీడీవో ప్రభాకరశర్మ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంపీడీవో ప్రభాకరశర్మ బుధవారం ఉదయం 11 సమయంలో తలకొండపాడు సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీకి వెళ్లారు. అప్పటికీ సచివాలయ తలుపులు కూడా తెరవకుండా తాళం వేసి ఉండడాన్ని గుర్తించారు. వెంటనే సంబంధిత ఉద్యోగులకు ఫోన్‌చేసి ఎక్కడ ఉన్నారని వివరణ అడిగారు. ఈ సమయంలో వాళ్లు పొంతనలేని సమాధానం చెప్పారు. విధి నిర్వహణలో సమయపాలన పాటించకుండా వ్యవహరించడంతో పాటు విధులకు డుమ్మా కొట్టిన సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది మొత్తానికి సంజాయిషీ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఇలా అయితే ప్రమాదాలు జరగవా?

చెట్లు తొలగించకుండానే కొత్త కరెంట్ స్తంభాలు, లైన్‌ల ఏర్పాటు



చినకొత్తపల్లి రోడ్డు వెంబడి తాటి చెట్లను ఆనుకొని వేసిన స్తంభాలు, విద్యుత్ లైన్‌లు

అద్దంకి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోవడం అనే సామెత విద్యుత్ శాఖకు అక్షరాల వర్తిస్తుంది. పట్టణాలు, గ్రామాలు, వ్యవసాయం, పరి శ్రమలకు నాణ్యమైన విద్యుత్‌ను వేరు వేరుగా అందించేందుకు పెద్ద ఎత్తున కొత్తగా విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అయితే కొత్త విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేసే సమయంలో చిన్న పాటి శ్రద్ధ చూపితే భవిష్యత్‌లో పెద్ద ప్రమాదాలు జరగకుండా ఉండే అవకాశం ఉంది. అయితే నిర్మాణ పనులు చేసే కాంట్రాక్టర్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరించటం, పర్యవేక్షణ అధికారులు పట్టించుకోవకపోవడంతో కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్‌లతో పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అత్యధిక శాతం విద్యుత్ స్తంభాలు ఆయా రోడ్ల అంచునే ఏర్పాటు చేయటం జరిగింది. అదే సమయంలో చినకొత్తపల్లి నుండి కొత్తరెడ్డిపాలెం వైపు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్ తాటిచెట్ల అంచునే ఏర్పాటు చేయడంతో విద్యుత్ తీగలు తాటి చెట్ల ఆకులలో కలిసిపోయాయి. ఇలా ఉండటం వల్ల ఒక లైన్ నుండి మరొక లైన్‌కు విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా పనులు జరిగే సమయంలో అధికారులు ఖచ్చితంగా పర్యవేక్షణ చేసే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

టీడీపీ నేత హత్య దుర్మార్గ చర్య

● ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యంలో కొందరు మానవత్వాన్ని మరిచి, దుర్మార్గాలకు ఒడిగడుతూ పాశవిక దాడులకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. చీరాల నియోజకవర్గ మాజీ ఎన్నికల పరిశీలకుడు, సంతనూతల పాడు నియోజకవర్గం టీడీపీ నేత, పార్టీ అధికార ప్రతినిధి ముప్పవరపు వీరయ్య చౌదరిపై గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడిచేసి హత్య చేయడాన్ని ఎమ్మెల్యే కొండయ్య ఖండించారు. దీనిపై ఆయన స్పందిస్తూ వీర య్య చౌదరి మృతి పార్టీకి, ప్రజలకు తీరని లోటని అన్నారు. వీరయ్య చౌదరితో అనుబంధం ఉందని, స్నేహభావం ఉన్న వ్యక్తి అని కొం డయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈనేపథ్యంలో నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్‌తో కలిసి వీరయ్య అంతిమ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి

మేదరమెట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పొగాకు పండించిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం మేదరమెట్లలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లబర్లీ, వైట్ బర్లీ, వర్జీనియా పొగాకును సాగు చేసిన రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారన్నారు. నల్లబర్లీ పొగాకు ఇంత వరకు కొనుగోలు కాలేదన్నారు. గత రెండు సంవత్సరాల్లో పొగాకు ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు పొగాకు సాగును పెంచారన్నారు. ఈ సంవత్సరం ధరలు పూర్తిగా తగ్గించడంతో పాటు కొనుగోళ్లు మందగించాయన్నారు. గిట్టుబాటు ధరకు పొగాకు కొనుగోలు చేయ్యాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే మే 5న రైతులతో సీఎం కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతామన్నారు. ఆయనతోపాటు సంఘ ఉపాధ్య క్షుడు హనుమారెడ్డి తెలిపారు.



ఎక్స్‌కవేటర్‌తో ధ్వజస్తంభాన్ని నిలబెడుతున్న గ్రామస్థులు

వైభవంగా అంకమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ

● ధ్వజస్తంభం ఆవిష్కరణ

ముండ్లమూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కెల్లంపల్లి గ్రామంలో కోటి రూపాయల విరాళాలతో నూతనంగా నిర్మించిన అంకమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం 8:05 గంటలకు ఆలయం ముందు వేద పండితులు ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు ధ్వజ స్తంభంలో నవ ధాన్యాలు వేసి పూజలు నిర్వహించారు. 11 గంటల సమయంలో ఆలయంలో అంకమ్మ తల్లిని ప్రతిష్ఠించారు. అనంతరం వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కెల్లంపల్లితో పాటు బసవాపురం, ఉల్లగల్లు, ముప్పరాజువారిపాలెం, పసుపుగల్లు, వేములబండ, చింతలపూడి, శ్రీనివాస నగర్, జగత్ నగర్, నందమూరి నగర్, లంబాడి తండాతో పాటు పల్నాడు జిల్లా నూజెండ్ల, వినుకొండ, దర్శి మండలం, తాళ్ళూరు, ఒంగోలు, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, చెన్నై ప్రాంతాలకు చెందిన భక్తులు వచ్చి అంకమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.

● పూజలను నిర్వహించిన బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి, ఒంగోలుకు చెందిన క్విస్ కాలేజ్ చైర్మన్ నిడమానూరి నాగేశ్వరరావు పూజలు నిర్వహించారు.

పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

ముండ్లమూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెళ్లలో రూ.60 లక్షల విరాళాలతో పోలేరమ్మ, గంగమ్మ తల్లి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ బుధవారం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివ ప్రసాద రెడ్డి, ఎంపీపీ సునీత బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆలయంలో ప్రతిష్ఠించిన పోలేరమ్మ

పామును తప్పించబోయి

కాలువలో పడి వ్యక్తి మృతి

తాళ్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : దర్శి నుంచి చీమకుర్తి వెళుతూ తూర్పుగంగవరం గ్రామ శివారు మలుపు వద్ద రోడ్డుపై వస్తున్న పామును తప్పించబోయి కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనపై బుధవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు... దర్శి మండలం చవటపాలేనికి చెందిన జమ్ములదిన్నె మోషే(37) బుధవారంరాత్రి 7 గంటల సమయంలో మోటార్‌సైకిల్‌పై దర్శి నుంచి తూర్పుగంగవరం మీదుగా చీమకుర్తికి వెళుతున్నాడు. తూర్పు గంగవరం శివారు మలుపు వచ్చే సరికి పాముురోడ్డుపై వెళుతుండగా వేగాన్ని నిరోధించలేక పక్కకు వెళుతూ అక్కడున్న కాలువలో పడిపోయాడు. తలకు బలమైన గాయం కావటంతో మోషే అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు ఏఎస్సై వి.మోహన్‌రావు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఓపెన్ ఫలితాల్లో ఢమాల్

● పదిలో 7.43 శాతం ● ఇంటర్‌లో 14.91 శాతం

రాష్ట్రంలో అట్టడుగున జిల్లా



ఒంగోలు విద్య, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ ఇంటర్మీడియేట్, పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా దారుణంగా పతనమైంది. చరిత్రలో గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యార్థులు అతి తక్కువ ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రస్థాయిలో అట్టడుగు స్థానాలకు పరిమితమయ్యారు. ఓపెన్ స్కూలు ఇంటర్మీడియెట్‌లో 14.91 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 26వ స్థానంలో నిలవగా పదవ తరగతి ఫలితాల్లో మరీ తక్కువగా కేవలం 7.43 శాతంతో రాష్ట్రంలో 21వ స్థానంలో నిలిచారు.

ఓపెన్ ఇంటర్మీడియేట్‌లో... జిల్లాలో ఇంటర్మీడియేట్ పరీక్షలకు 3,668 మంది విద్యార్థులు హాజరుకాగా కేవలం 847 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 14.91శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 26వ స్థానంలో జిల్లా నిలిచింది. రాష్ట్రంలో సగటున 53.12శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా జిల్లాలో 38.21 శాతం తక్కువగా ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ఉత్తీర్ణతలో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు. బాలురు 12.57 శాతం మంది ఉత్తీర్ణులు కాగా బాలికలు ఆరుశాతం అదనంగా 18.67శాతం మంది పాసయ్యారు. బాలురు రాష్ట్రంలో సగటున 50.26శాతం మంది ఉత్తీర్ణులు కాగా జిల్లాలో 38శాతం తక్కువగా, బాలికలు రాష్ట్రంలో 57.26 శాతం మంది ఉత్తీర్ణులు కాగా జిల్లాలో 39శాతం మంది తక్కువగా ఉత్తీర్ణులయ్యారు. బాలురు 2,259 మందికిగాను 284 మంది, బాలికలు 1409 మందికి గాను 263 మంది పాసయ్యారు. గత ఏడాది 50.07శాతం మంది ఉత్తీర్ణులు కాగా ఈ ఏడాది కేవలం 14.91 శాతం మంది మాత్రమే పాసయ్యారు.

10వ తరగతిలో మరీ ఘోరం

జిల్లాలో ఓపెన్ స్కూలు సొసైటీ చరిత్రలో ఇంత ఘోరమైన ఫలితాలు గతంలో ఎన్నడూ రాలేదు. జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు 1,184 మంది హాజరుకాగా కేవలం 88 మంది మాత్రమే పాసయ్యారు. 7.43శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో జిల్లా 21వ స్థానంలో నిలిచింది. గత ఏడాది 49.44 శాతం మంది ఉత్తీర్ణులు కాగా ఈ ఏడాది 42 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు కేవలం 6.47శాతం మంది ఉత్తీర్ణులు కాగా బాలికలు 8.67శాతం మంది పాసయ్యారు. బాలురు 665 మంది పరీక్షకు హాజరు కాగా 43 మంది, బాలికలు 519 మంది హాజరు కాగా 45 మంది పాసయ్యారు.

జిల్లాలో గత ఐదేళ్లలో ఓపెన్ ఇంటర్ ఫలితాలు ఇలా

ఏడాది	రాసినవారు	పాసైనవారు	ఉత్తీర్ణత శాతం
2020	10548	10548	100
2021	5269	5269	100
2022	4817	2839	58.94
2023	4646	2653	57.10
2024	4950	2483	50.07
2025	3668	547	14.91

పదవ తరగతి ఫలితాలు

ఏడాది	రాసినవారు	పాసైనవారు	ఉత్తీర్ణత శాతం
2020	7831	7832	100
2021	4581	4581	100
2022	2945	929	31.54
2023	1583	788	49.78
2024	1529	756	49.44
2025	1184	88	7.43

మే 19 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు మే 19 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ పరీక్షకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 24 నుంచి 30 వరకు, రూ.50 అపరాధ రుసుంతో మే1 నుంచి 18వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. విద్యార్థులు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. విద్యార్థులు మార్కుల రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈనెల 24 నుంచి మే 1 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. రీకౌంటింగ్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ.వెయ్యి ఫీజు చెల్లించాలన్నారు. రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి జవాబు పత్రం జెరాక్స్ అభ్యర్థికి పంపుతారు.

● ఓపెన్ పరీక్షలు 19 నుంచి

ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ పదవ తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 24 వరకు జరుగుతాయి. పదవ తరగతి పరీక్షా కేంద్రాల్లోనే ఓపెన్ స్కూలు విద్యార్థులు కూడా పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఓపెన్ ఇంటర్మీడియేట్ విద్యార్థులకు ప్రత్యేకంగా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. పరీక్ష ఫీజు ఈనెల 26 నుంచి మే 5 వరకు చెల్లించవచ్చు. ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు మే 26 నుంచి 30 వరకు జరుగుతాయని డీఈవో తెలిపారు. ఓపెన్ స్కూలు విద్యార్థులకు కూడా జవాబు పత్రాలు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు అవకావం కల్పించారు. రీ కౌంటింగ్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ.200, రీ వెరిఫికేషన్‌కు రూ.వెయ్యి ఫీజు చెల్లించాలి. ఈనెల 26 నుంచి మే 5 వరకు దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం కల్పించారు.

మిర్చి కూలీల ఆటో బోల్తా

● మహిళ మృతి ● ఏడుగురికి తీవ్ర గాయాలు

ముండ్లమూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉల్లగల్లు వద్ద అద్దంకి-దర్శి ప్రధాన రహదారిపై బుధవారం ఉదయం 6 గంటల సమయంలో మిర్చి కోసేందుకు వెళ్తున్న కూలీల ఆటో బోల్తా పడింది. అందులో ఉన్న మహిళా కూలీ లంకోజనపల్లి గ్రామానికి చెందిన బండి చారమ్మ(54) అక్కడికక్కడే మృతి చెందింది. మిగతా కూలీల్లో గురవయ్య, అనూజమ్మ, కృపమ్మ, వెంకట లక్ష్మి, ఏసమ్మ, వెంకట రమణ, రీపిక తీవ్రంగా గాయపడ్డారు. మిర్చి కోసేందుకు ఆటోలో 15 మంది కూలీలు మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం వెళ్తున్నారు. ఆ సమయంలో విజయవాడ వైపు నుంచి కర్నూలు వైపు కారు రావటం, వాహనాల వేగాన్ని తగ్గించేందుకు పోలీసులు రోడ్డుపై ఉంచిన రిమ్ములను తప్పించబోవడంలో ఆటో బోల్తా పడింది. ప్రమాద సమయంలో దర్శి సీఐ వై.రామారావు నాగులప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వస్తుండటంతో బందోబస్తుకు వెళ్తున్నారు. సీఐ రామారావు వెంటనే అంబులెన్స్‌ను పిలిపించి గాయపడిన వారిని దర్శి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి వెళ్లారు. చారమ్మ మృతదేహాన్ని ముండ్లమూరు పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఏఎస్‌ఐ వెంకటేశ్వరరెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనాస్థలంలో మృతిచెందిన చారమ్మ



గాయపడిన గురవయ్య



గాయపడిన వెంకట రమణ

170 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

దొనకొండ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దొనకొండలోని ఒక అద్దె ఇంట్లో సివిల్‌సప్లయి శాఖ సరఫరా చేసిన సంచులతోనే అక్రమంగా నిల్వ ఉంచిన 170 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రమైన దొనకొండ నుంచి బాధాపురం వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఓ ఇంట్లో ఈ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారు. దొనకొండకు చెందిన మాదాల రాము తన ఇంటిని మాడిశెట్టి నారాయణ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. ఆ ఇంట్లో నారాయణ అక్రమంగా సేకరించుకున్న రేషన్ బియాన్ని విక్రయించి సొమ్ము చేసుకునేందుకు నిల్వచేసి ఉంచాడు. సమాచారం మేరకు విజిలెన్స్ సీఐ సీహెచ్ రవిబాబు, ఎస్‌ఐ నాగేశ్వరరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాధాకృష్ణ ఆ ఇంటి వద్దకు చేరుకున్నారు. ఇల్లు అద్దెకు తీసుకున్న మాడిశెట్టి నారాయణ, ఇల్లు అద్దెకు ఇచ్చిన రాము ఇద్దరు అందుబాటులో లేకపోవటంతో గ్రామ వీఆర్వోలు, వీఆర్‌ఏ రాజేశ్వరి, ఇంటి యజమాని రాము బంధువు సుశీల సమక్షంలో ఇంటి తలుపులు తీసి లోపల నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని గుర్తించారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని స్థానిక సివిల్‌సప్లయి గోడౌన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు నిమిత్తం దొనకొండ ఎస్‌ఐకు అప్పగించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

అదుపులో అనుమానితులు

ఒంగోలు క్రైం,ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంచలనం రేపిన తెలుగుదేశం పార్టీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య కేసులో హంతకులు ఎవరు అనేది మిస్టరీగా మారింది. టీడీపీలో చురుకైన నేత కావడం, దారుణంగా అతని కార్యాలయంలోనే విచక్షణా రహితంగా కత్తులతో 49 పోట్లు పొడవడం గగుర్పాటుకు గురిచేసింది. హత్య జరిగి 24 గంటలు గడిచినా పోలీసులకు ఎలాంటి క్లూ దొరకలేదు. దీంతో తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది.



వీరయ్య చౌదరి భౌతికకాయం

దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు

వీరయ్య చౌదరి హత్య కేసుపై నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు చదలవాడలో హెలీప్యాడ్ వద్ద అధికారులతో సమీక్ష చేశారు. హోంమంత్రి రోజంతా ఒంగోలులో బస చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. అన్ని కోణాలలో దర్యాప్తు చేస్తున్నారు. వీరయ్య చౌదరితో ఎవరికి వివాదాలు ఉన్నాయి, వ్యాపార లావాదేవీలు, పాతకక్షలు ఉన్నాయా.. అనే కోణంలో దర్యాప్తు ముందుకు సాగుతోంది. ఇప్పటికే దర్యాప్తు బృందాలు అనుమానితులను తీసుకొచ్చి విచారించి పంపిస్తున్నారు. ముఖ్యంగా భూ వివాదాలకు సంబంధించి లోతుగా విచారిస్తున్నారు. వీరయ్యచౌదరి కొనుగోలు చేసిన భూములకు సంబంధించి వివాదాలు ఉన్నాయా.. ఉంటే దాని వెనుక ఎవరు ఉన్నారు అనే కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు..

నిందితుల కదలికల సీసీ పుటేజీ సేకరణ కోసం ఓ పోలీసు బృందం పనిచేస్తోంది. హత్య జరిగిన ప్రాంతంలో సేకరించిన పుటేజీ ఆధారంగా దుండగులు ఓ బైక్, స్కూటీని వినియోగించి పరారయ్యారు. వారు పద్మ టవర్స్ వద్ద నుంచి పాత బైపాస్ మీదుగా వెళ్లి మంగమ్మకాలేజీ సర్కిల్‌కు వెళ్లకుండా వెంకటేశ్వర కాలనీ వైపు వెళ్లినట్లు గుర్తించారు. అంతేకాదు వారు మంగళవారం సాయంత్రం 5 గంటలకు వీరయ్యచౌదరి నివాసం ఉండే రాజీవ్ నగర్ ఎక్స్‌టెన్షన్‌లో నలుగురు దుండగులు రెండు వాహనాలపై ఆ ప్రాంతంలో తిరిగినట్లు గుర్తించారు. అక్కడ నుంచి సీసీ పుటేజీ లభించలేదు. అయితే ప్రస్తుతం దొరికిన పుటేజీలో వారు వినియోగించిన వాహనాల నంబర్లు కనిపించలేదు. అదేక్రమంలో మనుషులను గుర్తించలేకపోయినట్లు అధికారుల సమాచారం.

● సాంకేతిక పరిజ్ఞానంతో వీరయ్య చౌదరి హత్య కేసు దర్యాప్తు

అనుమానితులపై దృష్టి

ఈ కేసులో అనుమానితులుగా ఉన్న వారిని పోలీసులు విచారిస్తున్నారు. ఇప్పటికే కొంత మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈక్రమంలో ఉప్పుగుండూరుకు చెందిన గత ప్రభుత్వంలో రేషన్ మాఫియాను నడిపిన రౌడీషీటర్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అతని సెల్‌ఫోన్ ఆధారంగా విచారణ ప్రారంభించారు. హత్య జరిగిన వెంటనే ఒంగోలు నుంచి పరారుకావడంతో పోలీసులు అతనిపై దృష్టిసారించినట్లు సమాచారం. దొరకకుండా మంగళవారం రాత్రి అంతా మూడు కార్లు, మూడు బైకులు మారుతూ తిరగడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అతనికి వీరయ్య చౌదరికి మధ్య ఉన్న వివాదాలను పరిగణనలోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

వీరయ్య చౌదరి కార్యాలయం వద్ద రెక్కీ

దుండగులు పక్కా ప్రణాళికతో రెక్కీ నిర్వహించి హత్య చేసినట్లు తెలుస్తోంది. పద్మ టవర్ పక్కన గల భవనంలో వీరయ్యచౌదరి కార్యాలయం ఉంది. హత్యకు ముందు మూడు రోజులుగా ఓ యువకుడు రెక్కీ నిర్వహించినట్లు తెలిసింది. ఆ యువకుడిని అక్కడ ఉన్న ఓ వ్యక్తి ప్రశ్నించగా తాను వేరే వారి కోసం ఇక్కడ ఉన్నానని తెలిపినట్లు సమాచారం. అదేక్రమంలో వీరయ్య చౌదరి ఇంటి చుట్టూ చక్కర్లు కొట్టడం కూడా పక్కా ప్రణాళికలో భాగమే అని చెప్పవచ్చు. ఇప్పటికి పోలీసుల చేతిలో ఎలాంటి కీలక ఆధారం లేదనే చెప్పాలి. హత్య కేసులో నిందితులను ఇంతవరకు గుర్తించలేదు.

రేషన్ మాఫియా డాన్ పనేనా?

హత్య జరిగిన తర్వాత పరారీ

పోలీసులకు దొరకకుండా ప్రణాళిక

అతనికి సహకరించిన తొమ్మిది

మందిని విచారిస్తున్న పోలీసులు

ఒంగోలుక్రైం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వీరయ్యచౌదరి హత్య కేసులో గతంలో రేషన్ మాఫియా డాన్‌గా వ్యవహరించిన వ్యక్తి ప్రధాన సూత్రధారి అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. అతను రౌడీషీటర్ కూడా.. అయితే అతను పోలీసులకు దొరకకుండా నాలుగు కార్లు ఓ బైక్‌పై రోజంతా తిరగడంతో అనుమానాలు బలపడ్డాయి. దీంతో వెంటాడిన పోలీసులకు దొరకకుండా ముప్పతిప్పలు పెట్టాడు. అతను ఒంగోలులో బయలుదేరి బాపట్ల జిల్లా వెదుళ్ళపల్లి, మంగళగిరి నుంచి మేదరమెట్లలో తిరిగినట్లు పోలీసుల వద్ద ఆధారాలు ఉన్నాయి. అంతేకాదు. వీరయ్యచౌదరి హత్య జరిగిన 7.30 సమయంలో ఒంగోలులోని ఎన్టీఆర్ పార్కు సమీపంలో అతని ఫోన్‌సిగ్నల్ చూపించింది. అనంతరం ఉప్పుగుండూరు వెళ్లి తన ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. తరువాత వెదుళ్లపల్లిలోని ఓ రైస్‌మిల్లు ఓనర్ సహాయం కోరి అతని ఫోన్ వినయోగించినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. అంతేకాదు ఒకచోట ఉండలేదు. ఇలా వాహనాలు మారి తిరగడానికి కారణం ఏమిటి అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. దీంతో అతనికి సహకరించిన రైసుమిల్లు యజమాని సుధీర్‌తోపాటుగా అక్కడ పనిచేస్తున్న పొన్నూరుకు చెందిన షేక్ అమీర్, పరిటాల గోపి, అశోక్‌కుమార్‌లతో పాటుగా మరో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంతేకాదు అతను ప్రయాణించిన నాలుగు కార్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు పెడుతున్న వత్తిడిని తట్టుకోలేక రౌడీషీటర్ నేరుగా పోలీసులకు ఫోన్ చేసి ఒంగోలు డీఎస్పీ కార్యాలయంలో లొంగిపోయాడు. దీంతో అతనిని పోలీసులు విచారిస్తున్నారు. ఎస్పీ ఏఆర్.దామోదర్ రాత్రి పొద్దుపోయే వరకు విచారించినట్లు తెలిసింది. అయితే ఈ కేసులో ఇంకా ఎలాంటి సమాచారం రాలేదని తెలుస్తోంది.



వీరయ్య చౌదరి పార్థీవదేహం వద్ద ఈదర మోహన్



వీరయ్య చౌదరి భౌతిక కాయాన్ని చూసేందుకు అమ్మనబ్రోలుకు చేరిన జనం

ఉగ్రదాడిలో మృతులకు 'జనసేన' నివాళి

● ఒంగోలులో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన

ఒంగోలు(రూరల్), ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం వద్ద తీవ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు జనసేన పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఒంగోలులోని ఆర్టీసీ డిపో దగ్గర నుంచి అద్దంకి బస్టాండు వరదకు కొవ్వొత్తులు వెలిగించి నిరసన ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా మృతులకు నివాళులర్పించారు. ఉగ్రవాదుల దాడిని ఖండించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, నాయకులు కంది రవిశంకర్, చిట్టెం ప్రసాద్, చనపతి రాంబాబు, కళ్యాణ్ ముత్యాల, రాయిని రమేష్, కృష్ణ పెన్నా, బొందిల శ్రీదేవి, పిల్లి రాజేష్, పల్ల ప్రమీల, దండే అనిల్, గోవింద్ కోమలి, ఆకుపాటి ఉష, బొందిల మధు, ఉంగరాల వాసు, తోట శబరి,తిరుమల శెట్టి నాని, ఉష, దండే సతీష్, షేక్ ముంతాజ్, ఈదుపల్లి మణి, అల్లూరి శ్రీహరి, నరసింహారావు, ఉంగరాల సాయి, ఏలూరి వెంకటేష్, ఆనంద్‌నాయుడు, కిరణ్ శనగల, శివ, రాజేష్, అనూష, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న రియాజ్, రవిశంకర్ తదితరులు

వైసీపీ ఆధ్వర్యంలో..

పహల్గాం వద్ద తీవ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి వైసీపీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఒంగోలులోని బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద గల గాంధీ విగ్రహం వద్ద మృతులకు నివాళులర్పించి అనంతరం క్యాండిల్స్‌తో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి రవిబాబు, నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో శ్రీహర్షిణి విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని శ్రీ హర్షిణి డిగ్రీ విద్యార్థులు మొదటి సెమిస్టర్ ఫలితాల్లో ఏకేయూ యూనివర్సిటీ మొదటి ర్యాంకులు సాధించారు. బీసీఏ విభాగంలో కె.సంధ్య 8.88 గ్రేడ్ పాయింట్లతో మొదటి స్థానంలో నిలువగా వి.కృష్ణ లాస్య 8.82తో ద్వితీయ స్థానం, సీహెచ్.అశ్విని 8.60 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచారు. బీఎస్సీ కంప్యూటర్‌విభాగంలో ఎస్.అమూల్య 8.75, డి.ఉదయ్‌కౌశిక్ 8.64, డి.విక్టోరియా 8.61, అలాగే బీకాం కంప్యూటర్స్‌లో డి.మానస 8.67, డి.దివ్య 8.30, డి.వైష్ణవి 8.28, బీఎస్సీ ఆక్వాకల్చర్ విభాగంలో కె.లావణ్య 7.88, ఎస్.నాగమణి 7.21, పి.ధనూష్ 7.14 గ్రేడ్ పాయింట్లు సాధించారు. బీఎస్సీ కెమిస్ట్రీలో జి.లేఖన 8.08, జి.నిత్య 7.90, ఎ.వెంకటజ్యోతి 7.16, బీబీఏ విభాగంలో కె.వెంకటలక్ష్మి 7.70, వైస్పందన 7.14, ఎం.మోహనమహతి 7.10, బీఎస్సీ జువాలజీలో బి.రామాంజనేయులు 8.53, పి.శ్రీలక్ష్మి 8.48, బిమోజేష్ 8.46, బీఎస్సీ మ్యాథమేటిక్స్‌లో విప్రవల్లిక 8.50, ఎం.మందిరారెడ్డి 8.21, పి.హర్షిణి 8.09, బీఎస్సీ బోటని విభాగంలో ఆర్.లక్ష్మీగంగోత్రి 8.27, ఎం.కృప 7.88, కె.జయలక్ష్మి 7.32 పాయింట్లు సాధించారు. ఇక బీఏ విభాగంలో బి.అభిషేక్ 7.97, కె.ఇందు 7.72, కె.జోసెఫ్‌రత్నకుమార్ 7.55 గ్రేడ్ పాయింట్లు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక కళాశాలలో చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా కేవలం డిగ్రీ మాత్రమే కాకుండా క్యాంపస్ ప్లేస్‌మెంట్‌ను కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అత్యధిక పాయింట్లు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డీన్ దాది అంజనేయులు, ఈజీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, ఏవో ర్యాంకర్ శ్రీనివాసరావు, క్యాంపస్ ఇన్‌చార్జి ధిరీష్, ప్రతాప్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు

అశ్రునయనాలతో వీరయ్యచౌదరి అంతిమ యాత్ర

● భారీగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): దారుణహత్యకు గురైన టీడీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి అంతిమయాత్ర అమ్మనబ్రోలులో అశేష జనవాహిని నడుమ అశ్రునయనాలతో బుధవారం సాగింది. ఒంగోలు జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం వీరయ్యచౌదరి మృతదేహాన్ని స్వగ్రామం అమ్మనబ్రోలు తరలించారు. దారి పొడవునా గ్రామాల్లోని టీడీపీ శ్రేణులు, వీరయ్యచౌదరి అభిమానులు, సన్నిహితులు చివరి చూపు చూసి కన్నీటి వీడ్కోలు పలికారు. అమ్మనబ్రోలు రైల్వేగేటు వద్దకు రాగానే యువకులు మోటార్‌సైకిల్ ర్యాలీగా అంబులెన్స్‌ను ఇంటి వద్దకు తోడ్కొని వెళ్లారు. పలు గ్రామాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు, అభిమానులు పెద్ద ఎత్తున చేరుకొని నివాళులర్పించారు. అంతిమయాత్రలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు బీఎన్.విజయ్‌కుమార్, దామచర్ల జనార్దన్, ఎంఎం.కొండయ్య, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మనబ్రోలుకు తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

మద్దిపాడు: టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి అంత్యక్రియలకు మద్దిపాడు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు బుధవారం అమ్మనబ్రోలు తరలి వెళ్లారు. అక్కడ వీరయ్య మృతదేహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయంత్‌బాబు మాట్లాడుతూ వీరయ్యచౌదరి హత్యకు పాల్పడిన దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు.

వీరయ్యచౌదరి హత్యపై దిగ్భ్రాంతి

ఒంగోలు కలెక్టరేట్: టీడీపీ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి దారుణ హత్యను సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రశాంతంగా ఉన్న ఒంగోలు నగరంలో జరిగిన ఈ హత్య జిల్లా ప్రజలను భయాందోళనకు గురిచేసిందన్నారు. హత్యకు పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

దారి తప్పిపోయిన పిల్లలు

● స్కూలుకు చేర్చిన పోలీసులు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పాఠశాల నుంచి దారి తప్పిపోయిన ముగ్గురు పిల్లలను పోలీసులు గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఒంగోలు నగరంలోని సూర్యనికేతన్ స్కూలులో మూడవ తరగతి చదువుతున్న ముగ్గురు పిల్లలు పాఠశాల నుంచి బయటకు వచ్చారు. సుమారు మూడు గంటల పాటు పిల్లలు కనిపించలేదు. దీంతో అప్రమత్తమైన పాఠశాల యాజమాన్యం టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు సీఐ మేడా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పిల్లల కోసం పోలీసులు వెతుకుతుండగా అగ్రహారం రైల్వే గేటు సమీపంలో కనిపించారు. దీంతో వారిని తమ రక్షణలోకి తీసుకుని స్కూలు యాజమాన్యానికి అప్పగింతతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

యానాది కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అన్ని విధాలుగా వెనుకబడిన యానాదుల సంక్షేమం కోసం యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని యానాది సంఘాల మహాకూటమి నాయకులు కోరారు. స్థానిక రామ్‌నగర్‌లోని మాగుంట కార్యాలయంలో బుధవారం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఎస్టీ వర్గీకరణ, యానాది కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు ప్రిమిటివ్ ట్రైబల్ జాబితాలో యానాదులను చేర్చాలని కోరారు. కార్యక్రమంలో మహాకూటమి రాష్ట్ర ప్రధానకార్యదర్శి రావూరి శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి చలంచర్ల ప్రసాద్, మాణికల వెంకటేశ్వర్లు, చేవూరి రవణమ్మ, ఇండ్ల సుజాత, చేవూరు వెంకటేశ్వర్లు, ఇండ్ల శ్రీనివాసరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ రొయ్యల చెరువులను తొలగిస్తాం'

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు(రూరల్), ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): ముదిగొండ వాగులో అక్రమంగా నిర్మించిన రొయ్యల చెరువులను తొలగిస్తామని ఒంగోలు డివిజన్ నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ముదిగొండకు ముప్పు శీర్షికతో కథనం ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైంది. దీనిపై నీటిపారుదలశాఖ అధికారులు స్పందించారు. అక్రమంగా ఏర్పాటు చేసిన రొయ్యల చెరువులను పరిశీలించామని, నోటీసులు జారీ చేసి జీవో నెంబరు 188ప్రకారం వాటిని తొలగిస్తామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సత్తా

● ఉత్తీర్ణతలో బాలికలదే పైచేయి

మర్రిపూడి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. బాలురకన్నా బాలికలు అధిక శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. కాకర్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన యు.నిహారికి 586, తులసి 581, ఎం.ప్రత్యూష 574 మార్కులు సాధించి మండలంలోనే మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. మొత్తం 296 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 295 (99.6శాతం) మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో రంగయ్య తెలిపారు. 231మంది ప్రథమ శ్రేణిలో పాసయ్యారన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఎంఈవో రంగయ్య, ఉపాధ్యాయులు బీడీ.కిషోర్, రెబ్బా వెంకటేశ్వర్లు, విద్యాకమిటీ చైర్మన్ సాయిబాబు, ఏపీటీఫ్ రాష్ట్ర నాయకుడు కె.శ్రీనివాసులు అభినందించారు.

డీఆర్‌ఆర్‌ఎం స్కూలులో..

ఒంగోలు విద్య: ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూలు విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటారు. కె.కుందనితారెడ్డి 584 మార్కులు, సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. పాఠశాలలో 109 మంది పరీక్షకు హాజరు కాగా 85 మంది పాసయ్యారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం పి.వెంకట్రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

బండ్లమిట్ట పాఠశాలలో..

స్థానిక బండ్లమిట్టలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. కోవ్వైరి అక్షర 591, షేక్ కౌసరు 590 మార్కులతో పాఠశాలలో ప్రథమ, ద్వితీయస్థానంలో నిలిచారు. విద్యార్థులను హెచ్‌ఎం జి. కృష్ణకుమారి అభినందించారు.

ఎస్ఎన్‌పాడు మండలంలో..

సంతనూతలపాడు: టెన్త్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 89శాతం, ప్రైవేట్ స్కూళ్లలో 90శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వెంకారెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 380 మందికి 334 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేట్ స్కూళ్లలో 527మందికి 479 మంది పాస్ అయ్యారు. గంగవరంలోని హనుమంతరావు హైస్కూల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. ఎం.ప్రసన్నలక్ష్మి 592, ఎన్‌వీ.చంద్రలేఖ 589, త్రివేణి 581, కార్తీక్ 580 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ బి.హనుమంతరావు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఎస్ఎన్‌పాడు హైస్కూల్ విద్యార్థి రిషిత 568 మార్కులు సాధించడంతో ఎంఈవో వెంకారెడ్డి, హెచ్‌ఎం ప్రమోద అభినందించారు.

కొండపి మండలంలో..

కొండపి: పదో తరగతి పరీక్షల్లో మండలంలోని విద్యార్థులు 94శాతం ఉత్తీర్ణత సాధించారు. 12 ప్రభుత్వ హైస్కూల్స్ నుంచి 553 మంది పరీక్షలు రాయగా 515 మంది పాసైనట్లు ఎంఈవో-2 పి.రామారావు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులను ఎంఈవో-1 కె.సురేఖ సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ రవికుమార్, సీడీపీవో మాధవీలత, కొండపి హైస్కూల్ హెచ్‌ఎం సుబ్బారావు పాల్గొన్నారు. పెరిదేపి గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీత కుమార్తె యోషిత కృష్ణ అత్యధికంగా 596 మార్కులు సాధించింది.


కాకర్లలో విద్యార్థినులను అభినందిస్తున్న ఎంఈవో రంగయ్య, ఉపాధ్యాయులు

జరుగుమల్లి మండలంలో..

మండలంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల నుంచి 316 మంది పరీక్షలు రాయగా 308 (97.46శాతం) మంది పాస్ అయ్యారని ఎంఈవో బి. నాగేంద్రవదన్ తెలిపారు. ఎనిమిది మంది ఫెయిల్ అయినట్లు చెప్పారు.

పొన్నలూరు మండలంలో..

మండలంలోని పది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 368 విద్యార్థులు పరీక్షలు రాయగా 343 మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో రవిచంద్ర తెలిపారు.

సింగరాయకొండ మండలంలో..

సింగరాయకొండ: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సత్తా చాటారు. మూలగుంటపాడు పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎస్‌కే.అంజూపర్వీన్ 590మార్కులు సాధించింది. సింగరాయకొండ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్‌కే.రియారిజ్వానా 584 మార్కులు, పాకల జడ్పీ హైస్కూల్‌కు చెందిన నాగధనుష్ 583 మార్కులు, బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని బి.కిరణ్మయి 576, ఊళ్లపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని గొల్లపోతు జాహ్నవి 576 మార్కులు సాధించారు. మొత్తం ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో 437 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 336 మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో కత్తి శ్రీనివాసులు తెలిపారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇనమనమెళ్లూరులోని నేతాజీ స్కూలుకు చెందిన మోరబోయిన అజయ్‌కుమార్ 584 మార్కులతో మండల ప్రథమ స్థానం సాధించగా, పెద్దకొత్తపల్లి జడ్పీ హైస్కూలుకు చెందిన కె.దీప్తి 582, నేతాజీ స్కూల్‌కు చెందిన నైనాల చంద్రకాంత్ 581 మార్కులు సాధించారు. అలాగే లింగంగుంట జడ్పీ హైస్కూలుకు చెందిన సీహెచ్.సుశాంత్ కుమార్ 575, మద్దిపాడు నారాయణ స్కూలుకు చెందిన జి.గాయత్రి రత్నమాల 575, ఇనమనమెళ్లూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన జి.శ్రీభవ్య 562 మార్కులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

నాగులుప్పలపాడు: పదోతరగతి ఫలితాల్లో అమ్మనబ్రోలు గురుకుల పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్లు ప్రిన్సిపాల్ మాధవి బుధవారం తెలిపారు. పాఠశాల నుంచి 76 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరు కాగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు.

టెన్త్ ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలల హవా

ఒంగోలు విద్య, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఒంగోలు నగరంలోని ప్రైవేటు పాఠశాలల తమ సత్తా చాటాయి. రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి తమ ప్రాబల్యం చాటాయి. విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడంతో పాఠశాలల్లో బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు తినిపించారు. పాఠశాలల్లో విద్యార్థుల కేరింతలతో పండుగ వాతావరణం నెలకొంది.

ఆంధ్రా హైస్కూలు విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసరావు

స్థానిక సత్యనారాయణపురంలోని ఆంధ్రా హైస్కూలు విద్యార్థులు పదో తరగతిలో సంచలన ఫలితాలు సాధించారు. పీవీ.హర్షిణి 597మార్కులు, ఎస్‌కే.సుహన 590, ఎస్‌కే.ఆలియాయాస్మిన్ 589, ఎస్.భార్గవ్‌రెడ్డి 587, వై.రోహిత్‌కుమార్ 587, సీహెచ్.అస్మిత్ 584, జె.శ్రీను 580 మార్కులు సాధించారు. 550పైగా 20మంది, 500లకు పైగా మార్కులను 48 మంది విద్యార్థులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూలు కరస్పాండెంట్ బి.శ్రీనివాసరావు, డైరెక్టర్ బి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

సత్తా చాటిన గౌతమ్ మోడల్ స్కూలు



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల అభివాదం

గౌతమ్ మోడల్ స్కూలు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులతో మెరిశారు. పాఠశాల విద్యార్థి బి.వేదకౌశిల్‌రెడ్డి 594, ఆర్.చైతన్యసిద్ధార్థ 590, టి.వెంకటనాగసాయిచరణ్ 590 మార్కులతో ప్రథమ, ద్వితీయ. తృతీయ స్థానాల్లో నిలిచారు. 30 మందికి 550పైగా, 55 మందికి 500పైగా మార్కులు సాధించారు. విద్యార్థులు సగటున 523మార్కులు పొందారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఎం.కొండయ్య, ప్రిన్సిపాల్ ఎం.పద్మజ, డీన్‌లు పి.రామారావు, వినుఅలెక్స్‌లు అభినందించారు.

వీఎన్‌జీ స్కూలు విజయకేతనం


అభివాదం చేస్తున్న విద్యార్థులు, మాధవరావు

పదో తరగతి ఫలితాల్లో స్థానిక వీఎన్‌జీ స్కూలు విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. జి.చరణ్ 591, సీహెచ్.దీపిక 588, డి.నందిని 588, జి.సహస్ర 585, డి.మానస 581 మార్కులు సాధించారు. 550కిపైగా 15 మంది, 500లకు పైగా మార్కులను 27 మంది విద్యార్థులు పొందారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ మాధవరావు అభినందించారు. ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు.

మాంటిస్సోరి స్కూలులో..

స్థానిక మాంటిస్సోరి విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి సత్తా చాటారు. జీవీఎస్ఎస్.జయంత్‌శర్మ 597 మార్కులు సాధించి ఒంగోలు నగరంలో ప్రథమంగా నిలిచారు. ఎం.వెన్నెలరౌతుక 593, జి.నిఖిల్‌సాయి 592 మార్కు లతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు పాఠశాల చైర్మన్ పి.ప్రకాష్‌బాబు తెలిపారు. పాఠశాలలో ఏడుగురు 590కిపైగా, 14మంది 580కిపైగా, 85మంది 540కిపైగా, 134 మంది 500 మార్కులకు పైగా సాధించారు. విద్యార్థులను ప్రకాష్‌బాబు, కరస్పాండెంట్ శబరినాథ్, ప్రిన్సిపాల్ నూరుద్దీన్, నరేష్‌లు అభినందించారు.


విద్యార్థికి మిఠాయి తినిపిస్తున్న చైర్మన్ ప్రకాష్‌బాబు

బీవీ.సుబ్బయ్య హైస్కూలులో..

ఒంగోలు కలెక్టరేట్: పేర్నమిట్టలోని బీవీసుబ్బయ్య హైస్కూలు విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో విజయకేతనం ఎగుర వేశారు. టి.అనిల్ కుమార్, కె.బ్రహ్మచరణ్ 586, ఎ.బ్రహ్మరెడ్డి 583, ఇ.పూర్ణవంశీ 582 మార్కులు సాధించారు. 500మార్కు లకు పైగా 63మంది విద్యార్థులు పొందారు. స్కూలు సగటు మార్కులు 483.31శాతం. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంటల్ బి.కోటిలింగం, హెచ్‌ఎం వేణుగోపాల్‌రెడ్డి, టీచర్లు అభినందించారు.


అనిల్‌కుమార్, బ్రహ్మచరణ్

శ్రీగీతాంజలి విద్యార్థుల విజయభేరి

స్థానిక వెంకటేశ్వరనగర్‌లోని శ్రీగీతాంజలి ఇంగ్లీషు మీడియం హైస్కూలు విద్యార్థులు పదో తరగతిలో మంచి ఫలితాలను సాధించారు. డి.దీక్షిత 594, ఎం.జయదీప్ 591, ఎం.బాలకృష్ణ 587, వి.దివ్య 587 మార్కులు పొందారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను స్కూలు యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

కేరళ విద్యార్థుల విజయదుందుభి


విద్యార్థినులను అభినందిస్తున్న యాజమాన్యం

స్థానిక కేరళ హైస్కూలు విద్యార్థులు పదో తరగతిలో విజయకేతనం ఎగురవేశారు. కాల్లిపాకుల లక్ష్మీహరిత 592, పొత్తూరి చిన్మయిలక్ష్మి 591, వత్ససాయి వెంకటరుచిత 585, ఆర్విన్‌బజోయ్, మామిళ్ళపల్లి నాగవినోద్ 583, సిరం నవ్యనక్షత్ర 582మార్కులు సాధించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో కరస్పాండెంట్ సబీ.మైఖేల్ మాట్లాడుతూ పరీక్షకు హాజరైన విద్యార్థులలో 51 మంది విద్యార్థులలో 590పైగా మార్కులు ఇద్దరు, 580కిపైగా ఆరుగురు, 550కిపైగా 21 మంది, 500లకు పైగా 40 మంది మార్కులు సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

నిర్మల్ హైస్కూలులో..

స్థానిక నిర్మల్ హైస్కూలు విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. డి.జస్విత 593, బి.హర్షిణి 592, పి.మేఘనమనస్విని 590, ఎస్‌కే.కౌసర్‌జానా 590, కె.భానుతేజ 590 మార్కులు సాధించారు. 580కి పైగా 19మంది, 570కిపైగా 34 మంది, 560కిపైగా 47 మంది, 550పైగా 57 మంది, 540కి పైగా 66 మంది, 500లకు పైగా మార్కులను 88 మంది వి ద్యార్థులు సాధించారు. పరీక్షకు హాజరైన 137 మంది విద్యా ర్థులలో 133 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను స్కూలు డైరెక్టర్ నల్లూరి సురేంద్ర, ప్రిన్సిపాల్ ఎస్.విక్టర్‌పాల్, పద్మజ, ఉపాధ్యా యులు అభినందించారు.


విద్యార్థులతో నిర్వాహకులు

శ్రీచైతన్య స్కూలు విద్యార్థుల సత్తా

ఒంగోలులోని శ్రీచైతన్య స్కూలు విద్యార్థులు పదో తరగతిలో విజయకేతనం ఎగురవేశారు. మోక్షజ్ఞ 596, ధనుష్ 595, దీక్షిత, స్వాతిక్ 594, ఐశ్వర్య 593, లక్ష్మీశృతి 592, ప్రణిత్ 591, రేవంత్ 590 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఆర్ఐ అనిల్‌కుమార్, కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 590 కిపైగా ఎనిమిదిమంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఇటువంటి విజయాలను ఇంకా ఎన్నో సాధించాలని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జోసఫ్ తంబి, హర్షవర్దన్, శేషయ్య, అపర్ణ, శిరీష, డీన్లు బాలసుబ్రహ్మణ్యం, శివ, సాయిరాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుంటూరు ఆక్స్‌ఫర్డ్ ప్రభంజనం


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, యాజమాన్యం

ఒంగోలు (రూరల్): ఒంగోలులోని గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన పదో విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో ప్రభంజనం సృష్టించారు. గగనశ్రీ 597, వసంతసిరి 593, కె.మనస్విని 591 మార్కులు సాధించారు. 50మంది విద్యార్థులు 500 పైగా మార్కులు పొందారు. స్థానిక స్కూలులో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను చైర్మన్ ఫ్రాన్సిస్‌రెడ్డి, డైరెక్టర్ విజయభాస్కరరెడ్డి, ప్రిన్సిపాల్ పద్మావతి అభినందించారు.

కరవది పీహెచ్‌సీ అభివృద్ధికి ఆర్థికసాయం

ఒంగోలు(రూరల్), ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధికి గ్రామానికి చెందిన లింగా లక్ష్మయ్య, చుండూరి అంజనాదేవి ఆర్థికసాయం అందజేశారు. దాతలు ఒక్కొక్కరు రూ.10వేల వంతున బుధవారం స్థానిక ఆసుపత్రిలో డాక్టర్ సుందరప్రసాద్‌కు అందించారు. కార్యక్రమంలో పోలవరపు సీతారామయ్య, లింగా ఆంజనేయులు, చుండూరి హరి పాల్గొన్నారు.


డాక్టర్ సుందర్‌ప్రసాద్‌కు నగదును అందజేస్తున్న దాతలు

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ

సింగరాయకొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా సింగరాయకొండలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కందుకూరు రోడ్డు కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రజా సంఘాలు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల

వైభవంగా గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

● ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుపల్లె గ్రామంలో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మండలపార్టీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చేతుల మీదుగా దేవస్థాన కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కడియం శేషగిరి, టీడీపీ నాయకుడు భైలడుగు బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.


సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

సూర్యప్రభ వాహనంపై వేంకటేశ్వరుడు

కంభం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కంభంలోని శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం శ్రీవేంకటేశ్వరస్వామి సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహనంపై మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.


విద్యార్థులకు బహుమతులు
అందజేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

తర్లుపాడు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుజువ్వలపాడు పాఠశాలలోని మేకలవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తుకు చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ సాధించిన విద్యార్థులకు ఎస్ఎంసీ చైర్మన్ గురవయ్య, వైస్ చైర్మన్ అల్లూరమ్మలు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాశయ్య, వెంకట రంగయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌గా బాధ్యతలు
స్వీకరించిన నారాయణరెడ్డిని సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

పొదిలి నగరపంచాయతీ కమిషనర్‌గా నారాయణరెడ్డి

పొదిలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పొదిలి నగరపంచాయతీ కమిషనర్‌గా పని చేస్తున్న పి. శ్రీనివాసులు బదిలీకాగా ఆయన స్థానంలో కర్నూల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంటుగా పనిచేస్తున్న కెఎల్ నారాయణరెడ్డిని నియమించారు. ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరపంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సిబ్బందిని కోరారు.

డిగ్రీ ఫలితాల్లో సాయిచైతన్య విద్యార్థుల సత్తా

గిద్దలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలలో సాయిచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యధిక శాతం మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ జి.రంగస్వామిరెడ్డి తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్‌లో షేక్ హసీనా బేగం 8.96, షేక్ సనాఅఫ్రిన్ 8.54, బీఎస్సీ బోటనీలో కె.అనూష 8.29, షేక్ ఫర్హాన 8.18, బీఎస్సీ కెమిస్ట్రీలో ఎన్.కవిత 8.71, కల్యాణి 8.38, బీకాం కంప్యూటర్స్‌లో కరిష్మా 8.05, సుమలత 7.65, బీసీఏ శ్రావణి 7.93, భవాని 7.60 పాయింట్లు సాధించినట్లు కరస్పాండెంట్ రంగస్వామిరెడ్డి తెలిపారు.

మద్యం వాహనం బోల్తా

పొదిలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సలకనూతల గ్రామం వద్ద మర్కాపురం నుంచి దర్శి వెళుతున్న మద్యం మినీ లారీ చక్రం వీలు విరిగిపోవడంతో ఓ పక్కకు పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలు అయ్యాయి. ఆసమయంలో రోడ్డుపై పడిన మద్యం బాటిళ్లకోసం స్థానికులు ఎగబడ్డారు.

పొదిలిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు ఎప్పుడో?

మూడేళ్లుగా ముందుకు కదలని వైనం

పొదిలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పొదిలిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు సంవత్సరాల తరబడి కలగానే మిగిలిపోతోంది. పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాలకు నడికూడలిగా ఉంది. ఏడాదిలో సుమారుగా వందల సంఖ్యలో అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. లక్షల్లో ఆస్తినష్టం జరుగుతూనే ఉంటుంది. అయినా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. పొదిలి నగరపంచాయతీ స్థాయికి చేరినా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ముందుకు రావడంలేదు. పట్టణంలో వందలకుపైగా వ్యాపార సముదాయాలు ఉన్నాయి. అంతే కాకుండా పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల్లో సుమారుగా రెండు వేలకుపైగా పొగాకు బ్యారన్‌లు ఉన్నాయి. పొగాకు కాల్పు సమయాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రతి ఏడాది 30, 40 బ్యారన్‌లు ప్రమాదాలకు గురవుతుంటాయి. పొదిలికి చుట్టూ దర్శి, కనిగిరి, మార్కాపురం ప్రాంతాల్లో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. ఏదైనా ఈప్రాంతాల్లో జరగరాని అగ్నిప్రమాదం జరిగితే సమాచారం తెలుసుకొని వచ్చే సరికి పూర్తిగా బుగ్గిపాలు అవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు పొదిలిలో చేస్తే మూడు మండలాల్లో ప్రమాదం జరిగితే 15 నిమిషాల్లో ప్రమాద స్థలానికి చేరుకొని నష్టాన్ని తగ్గించేందుకు వీలుంటుంది. అయితే ఇప్పటి వరకు స్థలం కేటాయింపులో జాప్యం జరుగుతుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. కానీ మూడు సంవత్సరాల క్రితం కంభాలపాడు సచివాలయం సమీపంలో సుమారుగా ఎకరాకుపైగా స్థలం కేటాయించారు. అయినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత స్థానిక శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి చొరవతో మరోసారి స్థలపరిశీలన చేశారు.

అగ్నిమాపక కేంద్రానికి పరిశీలించిన స్థలం ఒంగోలు - గిద్దలూరు ప్రధాన రహదారికి ఆనుకుని ఉంటుంది. మంచి అనువైన ప్రాంతంగా అధికారులు గుర్తించారు. పొదిలిలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో ఏదైనా అనుకోని సంఘటనలు జరిగితే పెద్ద ఎత్తున ఆస్తినష్టపోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని పొదిలిలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

'పది'లో సహ్మితకు 598 మార్కులు

● జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన మార్కాపురం విద్యార్థిని


షాలినీ సహ్మిత

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలోని భాష్యం పాఠశాలలో చదివిన పట్టణానికి చెందిన ఎస్.షాలినీ సహ్మిత పదో తరగతి ఫలితాల్లో 598 మార్కులు సాధించింది. రాష్ట్రంలో 15వ స్థానం, జిల్లాలో ప్రథమ స్థానం పొందింది. షాలినీ సహ్మిత తల్లిదండ్రులు మార్కాపురం పట్టణంలో నివశిస్తున్నారు. తండ్రి ఎస్.శాల్వ మార్కాపురం మండలంలోని గోగులదిన్నె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తల్లి ఎస్.శ్రావణి గృహిణి. చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబర్చిన శాలినీ సమిత 1 నుంచి 5వ తరగతి మార్కాపురంలోని శ్రీచైతన్య పాఠశాల, 6 నుంచి 10వ తరగతి మార్కాపురం భాష్యం పాఠశాలలో చదివింది. తరగతిలో ఎల్లప్పుడూ ఫస్ట్ ర్యాంకులో నిలిచేదని ఉపాధ్యాయులు తెలిపారు. భాష్యం విద్యార్థిని షాలినీ సహ్మిత రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించటం పట్ల ఆపాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

బాంబే ఐఐటీలో చదువుతా - షాలినీ సహ్మిత

తాను ఇంటర్ ఎంపీసీ గ్రూపులో చదువుతానని అనంతరం ముంబాయిలోని ప్రతిష్టాత్మక ఐఐటీ కళాశాలలో సీటు సంపాదించి చదవటం తన లక్ష్యం అని తెలిపారు. మెరుగైన ఫలితాలు రావటానికి ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు రుణపడి ఉంటానని, వారి ఆశయాలను నెరవేర్చటం పిల్లల కర్తవ్యం అని అన్నారు.

పొదిలిలో మిశ్రమ ఫలితాలు

పొదిలి : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మిశ్రమ ఫలితాలు సాధించారు. మండలంలో ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నతపాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉప్పలపాడు జడ్పీహెచ్ఎస్, పొదిలి కేజీబీవీ చెందిన 463 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుగా కాగా 278 మంది ఉత్తీర్ణత సాధించారు.

తర్లుపాడు మండలంలో


589 మార్కులు సాధించిన అశ్లేష

తర్లుపాడు : మండలంలో ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు పరీక్షా ఫలితాలలో సత్తా చాటారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మార్కులు సాధించారు. తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడు ఉన్నత పాఠశాల విద్యార్థిని ముత్తూరి అశ్లేష 589 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించింది. చెన్నారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన గోగిరెడ్డి నీలా 585 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానం సాధించింది. తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శశిప్రియ 577 మార్కులతో తృతీయ స్థానం సాధించింది. మొత్తం 396 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 324 మంది పాసై 82 శాతం ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో సుజాత తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాలలో మార్కాపురం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 254 మంది పరీక్షలకు హాజరు కాగా 228 మంది ఉత్తీర్ణత పొంది 87 శాతంతో అగ్రస్థానంలో నిలిచారని ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన చెప్పల్లి శ్రీహర్ష సాయి 582, కేవీ శివారెడ్డి 568, కాశింవలి 564 మార్కులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా మొదటి స్థానంలో నిలిచిన చెప్పల్లి శ్రీహర్ష సాయి తండ్రి నారాయణను ఘనంగా సన్మానించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు వైవీటీ చంద్రిక 590 మార్కులు సాధించిందని, ఫిరదోస్ 588 మార్కులు సాధించిందని ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి తెలిపారు. పాఠశాలలో 278 మంది బాలికలకు గాను 251 మంది ఉత్తీర్ణతతో 90 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. పట్టణంలోని సాయి బాలాజీ ఉన్నత పాఠశాలకు చెందిన నాగసాయి 595, నవ్యశ్రీ 594, హేమలత 593, మహమ్మద్ ఆసీర్ 572 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్ వలి తెలిపారు. సాయి చైతన్య విద్యార్థులు 37 మందిలో 23 మంది 500 మార్కులకు పైగా సాధించారని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని జీఎంఆర్ పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని కరస్పాండెంట్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. భాష్యం పాఠశాలలో ఏడుగురు విద్యార్థులు 590 మార్కులకు పైగా సాధించారని ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. శ్రీచైతన్య పాఠశాలలో ఐ.ప్రణీత్ 597 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో శర్వాణి ప్రణీత్‌ను అభినందించారు.


విద్యార్థిని అభినందించి తండ్రిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉత్తమ ఫలితాలు సాధించిన బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు

కంభం: పది పరీక్ష ఫలితాలలో కంభం మండలంలోని పలు ప్రభుత్వపాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. కంభం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.కవిత 581 మార్కులు సాధించిన కంభం, అర్ధవీడు, బేస్తవారపేట మండలాల ప్రభుత్వ పాఠశాలల టాపర్‌గా నిలిచింది. షేక్ సుహాన, కె.సుష్మిత 578 , షేక్ నూర్జహాన్ 576 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కె.జయబాబు 556 , యు.వి.భరత్‌కుమార్ 554 , వి.ఎస్.చరణ్‌కుమార్ 531 మార్కులు సాధించారు.

గౌతమ్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

పట్టణంలోని గౌతమ్ పాఠశాల విద్యార్థులు కె.లక్ష్మీకావ్య 595/600 మార్కులు, సి.హెచ్.చందనభార్గవి 593 మార్కులు సాధించారు. వారిని కరస్పాండెంట్ సి.హెచ్.రాంభూపాల్‌రెడ్డి, చైర్మెన్ శ్వేత అభినందించారు.

అర్ధవీడు గురుకుల పాఠశాలలో నూరుశాతం ఉత్తీర్ణత

అర్ధవీడులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణ సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.బలరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 75 మంది విద్యార్థులు హాజరుకాగా మొత్తం ఉత్తీర్ణత సాధించారని, టి.కోటేశ్వరరావు 576 మార్కులు, పి.నరేష్ 570 , ఎస్.జగన్ 558 మార్కులు సాధించినట్లు తెలిపారు.

బాలికోన్నత పాఠశాల హవా

గిద్దలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరులోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినులు ప్రభంజనం సృష్టించారు. ఎం.ఖుషి 593 మార్కులు, కె.కరీష్మా 591 మార్కులతో టాపర్లుగా నిలిచారు. పాఠశాలలో మొత్తం 189 మంది పరీక్షలు రాయగా 167 మంది ఉత్తీర్ణులయ్యారని, 60 మందికి పైగా 500కు పైగా మార్కులను సాధించినట్లు పాఠశాల హెచ్ఎం నాగభూషన్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా రైల్వేస్టేషన్ సెంటర్‌లో టపాసులు కాల్చి ఆనందం పంచుకున్నారు. సూర్య విద్యానికేతన్‌కు చెందిన లక్ష్మీలహరి 593 మార్కులు, పి.రోజ్, హాసినీలు 592 మార్కులు, రామ్‌చరణ్ 590 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. 140 మందికి 138 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. అరుణోదయ పాఠశాలకు చెందిన సాయిదీపక్, సల్మాలు 589 మార్కులు, షేక్ నాయబ్‌రసూల్ 580 మార్కులు, షేక్ మహమ్మద్ షాహిద్ 578 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. నారాయణ పాఠశాలకు చెందిన కె.హాసిని, భువనేష్‌లు 594 మార్కులు, షేక్ సనా 593 మార్కులు, తేజేశ్వర్‌రెడ్డి 592 మార్కులు, అమృత, నితేశ్వర్‌రెడ్డిలు 591 మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రతినిధులు తెలిపారు.

విశ్వభారతి హవా

పట్టణంలోని విశ్వభారతి పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించారు. హాజరైన 99 మందిలో 50 మంది 500కు పైగా, 23 మంది 550కి పైగా మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. జ్యోత్స్న 588 మార్కులు, సాయిసుజిత 586 మార్కులు, తరున్ 583 మార్కులు, మహిత, స్నేహలత, పూజితలు 582 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ బండారు ఆదిలక్ష్మి, కరస్పాండెంట్ రంగస్వామిరెడ్డి తెలిపారు.

నూరుశాతం ఉత్తీర్ణత

రాచర్ల (గిద్దలూరు): రాచర్ల మండలంలోని ఆకవీడు, చోళ్లవీడులలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆకవీడులో 33 మందికి 33 మంది ఉత్తీర్ణత సాధించగా లాస్యప్రియ 593 మార్కులు సాధించినట్లు ఎంఈవో గిరిధరశర్మ తెలిపారు. చోళ్లవీడులో 26 మందికి 26 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. జేపీచెరువు జిల్లాపరిషత్ పాఠశాలలో 97 శాతం, యడవల్లిలో 90శాతం, అనుమలవీడులో 65శాతం, రాచర్లలో 67 శాతం, కస్తూరాబా పాఠశాలలో 60శాతం, మోడల్ హైస్కూలులో 84 శాతం, గురుకుల పాఠశాలలో 84 శాతం, స్పందన పాఠశాలలో 87 శాతం, విజ్ఞాన్‌లో 75శాతం, ఒద్దులవాగుపల్లి ఎయిడెడ్ స్కూలులో 53శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో తెలిపారు.

సత్తా చాటిన గ్రామీణ విద్యార్థిని

పుల్లలచెరువు : మండలంలో మొత్తం 300 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 300 మంది విద్యార్థులు పాసయ్యారు. ముటుకుల సిద్దార్థ పాఠశాలకు చెందిన మర్రివేముల విద్యార్థి గాజుల ఆదిలక్ష్మి 592 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించారు. పుల్లలచెరువు జడ్పీ పాఠశాల విద్యార్థిని కె.గీతా నాగేశ్వరి 576 మార్కులతో రెండవ ర్యాంకు సాధించారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

పెద్ద దోర్నాల,ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పరీక్షా ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కస్తూరిబా బాలికల గురుకుల ఆదర్శ పాఠశాల విద్యార్థులు 32 మంది పరీక్షలు రాయగా 31మంది ఉత్తీర్ణతతో 97శాతం నమోదు చేశారు. ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు 76మందికి 71మంది ఉత్తీర్ణులయి 93శాతం నమోదు చేయగా, రామచంద్రకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 59మందికి గానూ 53మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 190 మందికి 157 మంది ఉత్తీర్ణులయ్యారు.దీంతో 83శాతం నమోదు చేయగా పాఠశాలకు చెందిన షేక్ బషీర్ 600మార్కులకు 588మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. మండలం మొత్తం మీద 584 మంది విద్యార్థులకు 503మంది ఉత్తీర్ణులై 90శాతం నమోదు చేసుకున్నట్లు ఎంఈవో మస్తాన్ నాయక్ తెలిపారు.

సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

ఎర్రగొండపాలెం : 10 వతరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు సత్తాచాటారు. ఎర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి. గాయత్రిసింగ్ 582 మార్కులతో ప్రథమ స్థానం, ఎర్రగొండపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని డి. కల్పన 564 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారని ఎంఈవో పి. ఆంజనేయులు బుధవారం తెలిపారు.ఎర్రగొండపాలెం జడ్పీఉన్నత పాఠశాలలో 63 శాతం, కొలుకుల జడ్పీఉన్నత పాఠశాలలో 54 శాతం, అమానిగుడిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల 58 శాతం, బోయలపల్లి జడ్పీఉన్నత పాఠశాల 65 శాతం, వీరభద్రాపురం జడ్పీఉన్నత పాఠశాల 31 శాతం, గంజివారిపల్లె జడ్పీఉన్నత పాఠశాల 72 శాతం, మురారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 89 శాతం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎర్రగొండపాలెం 51 శాతం, ఆదిమ గిరిజన గురుకుల పాఠశాల 58శాతం, ఆదిమ గిరిజన బాలుర పాఠశాల 29 శాతం, ఎంజేపీ డబ్ల్యూఆర్ఎస్ బాలురు 89 శాతం, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ఎర్రగొండపాలెం 67 శాతం ఉత్తీర్ణత సాధించారు.

భూసార పరీక్షతో నేల పోషక సామర్థ్యం గుర్తింపు

పెద్దారవీడు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షతో నేల యొక్క పోషక సామర్థ్యం గుర్తించవచ్చని ఏవో బుజ్జిబాయ్ అన్నారు. మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు బుధవారం క్షేత్రస్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు నేల యొక్క పోషక సామర్థ్యం తెలుసుకోవడం వలన సాగు చేయాల్సిన పంట స్వభావాన్ని తెలుసుకోవచ్చన్నారు. నేల స్వభావం ఆధారంగా నేలలో ఉన్న పోషకాల లోపాలను గుర్తించి అందుకు అనుగుణంగా ఎరువులు, పురుగుమందులు ఉపయోగించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న బీజేపీ నేతలు

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

● పట్టణంలో బీజేపీ కొవ్వొత్తుల ర్యాలీ

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ యాత్రికులపై ఉగ్రవాదులు దాడి చేసి చంపడాన్ని ఖండిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎ.ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఉక్కు పాదంతో అణచివేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటివి పునరావృతం కాకుండా కఠినంగా శిక్షించాలన్నారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ నారాయణ 370 ఆర్టికల్ రద్దు తరువాత జమ్మూకాశ్మీర్‌లో పర్యాటక రంగం అభివృద్ధి చెందిందని, దానిని జీర్ణించుకోలేక పాకిస్థాన్ ఉగ్రవాదులను ప్రేరేపించి పర్యాటకులను చంపడం పిరికిపంద చర్య అని అన్నారు. ర్యాలీలో హిందూ సంఘాల నాయకులు బాలకృష్ణారెడ్డి, యర్రారెడ్డి, మురళీకృష్ణ, ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకులు కృష్ణారావు, బీజేపీ నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


వెంకటరెడ్డిపల్లిలో పోస్టు కార్డులు
పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకుల బృందం,రైతులు

చిన్నకండ్లేరు అనుసంధానానికి ప్రభుత్వం సహకరించాలి

● ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సీఎంకు పోస్టు కార్డులు

పుల్లలచెరువు,ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి):వెలిగొండ ప్రాజెక్టు ద్వారా తీగలేరును పుల్లలచెరువు చిన్న కండ్లేరుకు అనుసంధానం చేసే పనులకు ప్రభుత్వం సహకరించాలని రైతులు కోరారు. బుధవారం పుల్లలచెరువు మండలంలోని వెంకటరెడ్డి పల్లిలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, తీగలేరును చిన్న కండ్లేరుకు అనుసంధానం చేయాలని రైతులతో కలిసి సంతకాల సేకరణ, పోస్టు కార్డులపై వెలిగొండ పూర్తి చేయాలని రాసి సీఎం చంద్రబాబుకు పంపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జీవీ గురునాథం,రైతు సంఘం నాయకులు జానకీ రఘు, కుందురు కోటిరెడ్డి, అన్నపురెడ్డి శివారెడ్డి,సైదయ్య, రైతులు పాల్గొన్నారు.

28 నుంచి వేసవి శిక్షణ తరగతులు

పెద్దారవీడు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం, విద్యార్థులకు నైపుణ్యాల అభివృద్ధిపై ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకూ వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు స్థానిక గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ శిక్షణ తరగతుల అనంతరం విద్యార్థులకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జేవీవీ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన

గిద్దలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్ప్రింగ్‌బోర్డు పాఠశాల ఆవరణలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పుస్తక వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. తలదించి పుస్తకాన్ని చదివితే ఆ పుస్తకమే తల ఎత్తుకునేలా చేస్తుందని జేవీవీ రాష్ట్ర నాయకులు స్వరూపారెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడం ద్వారా వృత్తి నైపుణ్యాలను పెంచుకోవచ్చని, జీవన నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ జేవీ నారాయణ, డైరెక్టర్ మణిచైతన్య, ప్రిన్సిపాల్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గిద్దలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాచర్ల బస్టాండ్‌లో జనసేన నాయకులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి తీవ్రత పెరుగుతున్నందున ప్రయాణికులు, పాదాచారులు చలివేంద్రాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు శంకర్‌నాయుడు, అలిశెట్టి చిన్న, విజయ్, తిరుమలశెట్టి పాల్గొన్నారు.



దర్శిలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

తీవ్రవాదులను కఠినంగా శిక్షించాలి

దర్శి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : పహల్గాంలో కాల్పులకు పాల్పడి 28 మంది మృతికి కారకులైన తీవ్రవాదులను కఠినంగా శిక్షించాలని, మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని దర్శిలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, హిందువుల ఆధ్వర్యంలో రామాలయం నుంచి పురవీధుల్లో ర్యాలీ సాగింది. గడియారస్తంభం సెంటర్‌లో ర్యాలీని ఉద్దేశించి వక్తలు ప్రసంగిస్తూ హిందువులను అమానుషంగా కాల్చిన తీవ్రవాదులకు ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తీవ్రవాదులను పూర్తిగా మట్టుబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ మాడపాకుల శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి



దర్శిలో ముస్లింల నిరసన

దర్శి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గంలోని ముస్లింలు బుధవారం దర్శి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక గడియారస్తంభం సెంటర్‌లో మానవ హారం నిర్మించారు. కేంద్రప్రభుత్వం ముస్లింల హక్కులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. జాతీయజెండా చేతబూని ర్యాలీలో పాల్గొనటం విశేషం.

దొనకొండలో...

దొనకొండ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా దొనకొండలోని ముస్లింలు బుధవారం జాతీయజెండాలను, నల్ల జెండాలను, ప్లకార్డులను చేతబట్టుకొని నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

పీసీపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : ఫోన్ మాట్లాడుతున్న తనపై దాడి చేశారని పెదయిర్లపాడు పంచాయతీ పాలూరివారిపల్లికి చెందిన పాలూరి మహేంద్ర పోలీసులకు ఫిర్యాదుచేశాడు. బాధితుడు మహేంద్ర తెలిపిన వివరాల మేరకు... మంగళవారంరాత్రి తమ కాలనీలో నరసింహం, చినవెంకటేశ్వర్లు అనే ఇరువర్గాల కుటుంబసభ్యులు ఘర్షణ పడుతున్నారు. తాను ఇంట్లో ఫోన్ మాట్లాడుతుండగా బయట ఎవరో ఘర్షణ పడుతున్నట్లు అరుపులు వినపడడంతో బయటకు వచ్చాను. ఆ సమయంలో వెంకటేశ్వర్లు అతని కుమారుడు రవి నేను ఫొటోలు తీస్తున్నానని భావించి దాడి చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని, గతంలోనూ రెండుసార్లు దాడి చేశారని మహేంద్ర తెలిపాడు.

బాధితులను ఆదుకోవాలి

దర్శి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆటో ప్రమాదంలో మృతిచెందిన మహిళ కుటుంబానికి ప్రభుత్వం పరిహారం అందించాలని, గాయపడిన కూలీలను ఆదుకోవాలని రాష్ట్ర దళిత సేన, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రేమ్ కుమార్, రాచపూడి మోషే తదితరులు కోరారు. ముండ్లమూరు మండలం ఉల్లగల్లు వద్ద కూలీల ఆటో బోల్తాపడి ఒక మహిళ మృతి చెందటంతో పాటు పది మందికి గాయాలైన విషయం తెలిసిందే. దర్శి ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వారు పరామర్శించారు. అలాగే సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యుడు టి రంగారావు, సందు వెంకటేశ్వరరావు పరామర్శించారు.

మద్యం దుకాణాలు మూసివేత

తాళ్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత, మద్యం వ్యాపారి ముప్పవరపు వీరయ్యచౌదరి మృతికి సంతాపంగా మండలంలో తాళ్లూరు, తూర్పుగంగవరం గ్రామాల్లోని 4 మద్యం దుకాణాలను బుధవారం స్వచ్ఛందంగా మూసివేశారు. వీరయ్య చౌదరి మృతి పట్ల పలువురు టీడీపీ నేతలు సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ఎంపీపీ తాటికొండ శ్రీను, మండల టీడీపీ అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, నాయకులు శాగం కొండారెడ్డి, మానం రమేష్ బాబు, మేడగం వెంకటేశ్వరెడ్డి, గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గొల్లపూడి వేణుబాబు, నవులూరి విద్యాసాగర్, వంగపల్లి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పాఠశాలకు ఐరన్ గేటు బహూకరణ

పామూరు ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బాలసుబ్బయ్య నగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అవసరమైన రూ.15 వేల విలువ కలిగిన ఐరన్‌గ్రిల్ గేటును తండ్రి పందిటి శివరామకృష్ణయ్య జ్ఞాపకార్థం కుమారుడు టీడీపీ కనిగిరి నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు, జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పందిటి హరీష్ బుధవారం బహూకరించారు. ఎంఈవో కే కరుణకుమారి, హెచ్‌ఎం చెన్నంశెట్టి పద్మావతి, విశ్రాంత వార్డెన్ సీహెచ్ రంగారావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

కనిగిరి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలో ఈనెల 26వ తేదీన విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు విద్యుత్ డీఈఈ ఉమాకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీజీఆర్‌ఎఫ్ విజయవాడ వారి ఆధ్వర్యంలో శ్రీ ఎన్‌విక్టర్ ఇమ్మానుయేలు (రిటైర్డ్ సీనియర్ జడ్జి) సమక్షంలో అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు వారి వారి దీర్ఘకాలిక విద్యుత్ అపరిష్కృత సమస్యలను నేరుగా అదాలత్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కనిగిరిలో ర్యాలీ

పహల్గాం దాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో నిరసన

కనిగిరి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పహల్గాంలో ఉగ్ర దాడిని ఖండిస్తూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారంరాత్రి కనిగిరిలో కొవ్వొత్తులతో పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక చర్చి సెంటరులో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదం నుంచి కేంద్ర ప్రభుత్వం హిందువులకు రక్షణ కల్పించాలని కోరారు. దేశంలో నివసించే కొంతమంది ఉగ్రవాద అనుయాయులు హిందువుల ప్రాణాల్ని బలిగొంటున్నారని ఆరోపించారు. హిందువులంతా ఒకే తాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. లేదంటే భారత దేశంలో ఒకప్పుడు హిందువులు ఉండేవారనే రోజు వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



పహల్గాం ఉగ్రవాద దాడికి కొవ్వొత్తులతో నిరసన చేస్తున్న హిందువులు

మతం ఆధారంగా కాల్పులు జరపడం దుర్మార్గం

పామూరు ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మతం ఆధారంగా పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు టూరిస్టులపై కాల్పులు జరపడం దుర్మార్గమని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కేవీ రమణయ్య చెప్పారు. తీవ్రవాదులు జరిపిన కాల్పులకు నిరసనగా కొవ్వొత్తులు పట్టుకొని శ్రద్ధాంజలి ర్యాలీని బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఉమ్మడిశెట్టి శ్రీను, జె.చినసుబ్బయ్య, పి. విజయకుమారాచారి, టీడీపీ నాయకులు ఉప్పలపాటి హరిబాబు, ఎస్ సాంబయ్య, పందిటి హరీష్, వీ బాబురావు, జమకాల నరేష్ పాల్గొన్నారు.

వాగుభూమి ఆక్రమణపై రెవెన్యూ అధికారుల సర్వే

ఆంధ్రజ్యోతి కథనంతో స్పందించిన అధికారులు

15సెంట్లు ఆక్రమణను తేల్చిన రెవెన్యూ అధికారులు

కనిగిరి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలో భూ ఆక్రమణలు పెట్రేగిపోయిన నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ మేరకు పట్టణంలోని కొత్తూరు ఆంజనేయస్వామి దేవాలయం వెనుక అరకిలోమీటరు దూరంలో అలుగువాగును కొంత మంది అక్రమార్కులు ఆక్రమించి వెంచర్లు వేశారు. దీంతో ఆంధ్రజ్యోతిలో సోమవారం "వాగుభూమి హంఫట్" అనే కథనం ప్రచురితమైంది. ఈ మేరకు జిల్లా, డివిజన్ స్థాయి అధికారుల ఆదేశాలతో తహసీల్దార్ రవిశంకర్ వాగు భూమిని సర్వే చేపట్టారు. అక్రమంగా వేసిన వెంచర్లలోని హద్దురాళ్లను తొలగించారు. అదేవిధంగా వాగుఆక్రమణ చేస్తూ కట్టిన ప్రహరీ తీసివేయించారు. తహసీల్దార్ నేతృత్వంలో చేపట్టిన సర్వేలో వాగు భూమిని 388/1లోని వాగు భూమిలోని 15సెంట్లు భూమిని 388/2లోని 2 ఎకరాల్లో అక్రమంగా వేసిన వేసిన వెంచర్ నిర్వాహకులు ఆక్రమించినట్లు తహసీల్దార్ రవిశంకర్ తెలిపారు.



గోడను తీసివేయాలని నిర్వాహకులను ఆదేశిస్తున్న తహసీల్దార్ రవిశంకర్

కొత్తపాలెం వెళ్లే మార్గంలో పూడికతీత

తాళ్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కొత్తపాలెం-తాళ్లూరు మార్గంలో సైడు కాలువ పూడిపోయి మురుగు నీరు రోడ్డు అనుకుని ప్రవహిస్తూ బురదమయంగా మారటంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో పూడికతీత పనులు బుధవారం చేపట్టారు. కొత్తపాలెం నుంచి తాళ్లూరుకు వెళ్లే మార్గంలోని చెరువు వంకలోకి మురుగు నీరు ప్రవహిస్తుండగా కాలువ పూడి పోయింది. దీంతో సాయిబాబా గుడి సమీపాన మురుగు నీరు రోడ్డు అనుకుని ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతున్నది.పలువురు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీడీవో దారా హనుమంతరావు ఆదేశానుసారం గ్రామసర్పంచ్ చార్లెస్ సర్జన్, పంచాయతీ కార్యదర్శి ఐ.వి. రమణారెడ్డిలు పంచాయతీ నిధులతో పూడికతీత పనులు చేయించి రోడ్డుపై మురుగు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల శ్రమదానం

సీఎస్‌పురం/పామూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శీలంవారిపల్లిలోని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీయ సేవాపథకం ప్రత్యేక శిబిరం కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామంలో శ్రమదానం కింద రంగులు వేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కమ్యూనిటి హాల్‌కు పెయింట్ వేసి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఇన్చార్జ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పి శ్రీవిద్య పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలలో మెరుగైన ఫలితాలు

పది ఫలితాల్లో సత్తా చాటిన కనిగిరి జీహెచ్ విద్యార్థులు

కనిగిరి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన 81 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 56 మంది ఉత్తీర్ణులయ్యారు. అదేవిధంగా ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో షేక్ ఆయేషా 580 మార్కులు సాధించారు. పరీక్షలు 134 మంది రాయగా వారిలో 108 ఉత్తీర్ణులయ్యారని హెచ్‌ఎం కలవ విజయలక్ష్మీ చెప్పారు. కొత్తఏరువారిపల్లి హైస్కూల్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని హెచ్‌ఎం ముంతాజ్‌బేగం చెప్పారు. ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి ఆనంద్ అధిక మార్కులు రావడంతో ఎంఈవో సంజీవి మిఠాయిలు తినిపించారు.



కనిగిరిలో ఆనంద్‌కు మిఠాయిలు తినిపిస్తున్న ఎంఈవో సంజీవి

దొనకొండలో...

దొనకొండ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దొనకొండ విశ్వభారతి పాఠశాల విద్యార్థి నలదిమ్ము వెంకటసుబ్బారెడ్డి 592 మార్కులు సాధించాడు. కేజీబీవీ విద్యార్థినీ భవానీ 573 మార్కులు సాధించింది. మిగిలిన పాఠశాలలు కూడా గణనీయ ఫలితాలు సాధించారు.

వెలిగండ్లలో...

వెలిగండ్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేవీఎస్‌అండ్‌ఎల్ ప్రైవేటు పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి శంకర్ శెట్టి సృజన్ 600గాను 592 మార్కులు సాధించాడు. వెలిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన రాయల కాశీ జాహ్నవి 587 మార్కులు సాధించారు.

పీసీపల్లిలో 98.17శాతం ఉత్తీర్ణత

పీసీపల్లి, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీతో కలిపి 329మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 323మంది పాసయ్యారు. 98.17 ఉత్తీర్ణత శాతం నమోదైందని ఎంఈవోలు ఆర్.శ్రీనివాసులు, సంజీవిలు చెప్పారు.

పామూరు ప్రభుత్వ పాఠశాలల్లో...

పామూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పామూరు చైతన్య హైస్కూల్‌కు చెందిన షణ్ముక దీప 593 మార్కులతో ప్రథమంగా నిలిచాడు. ఆల్ఫా హైస్కూల్‌కు చెందిన సాయిచేతన్ 592 మార్కులు సాధించారని ప్రధానోపాధ్యాయులు సీహెచ్ జయరామిరెడ్డి తెలిపారు. సేయింట్ మార్క్స్ హైస్కూల్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించగా జయశ్రీ 589 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ జయకుమార్ తెలిపారు.

సీఎస్‌పురంలో ప్రభుత్వ పాఠశాలల్లో 85.26 శాతం

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది 10వ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగిందని ఎంఈవోలు డీవీ సుబ్బారావు, కరుణకుమారి చెప్పారు. కంభాలదిన్నె జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన స్నేహ 588 మార్కులే సాధించింది. ఎల్ఎన్‌పురం హైస్కూల్‌లో షేక్ నీహాన్ 577 మార్కులు సాధించింది. పామూరు కేజీబీవీకు చెందిన నాగప్రణవి 564 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ కటకం సజన తెలిపారు. కాగా సీఎస్‌పురం మండలంలోని పెదరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన బి యశస్వీ 581 మార్కులు సాధించిందని ఎంఈవోలు ప్రసాదరావు, కొండారెడ్డి తెలిపారు.

'ముండ్లమూరు'లో మెరుగైన ఫలితాలు

ముండ్లమూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ముం డ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు 79 మందికి 79 మంది ఉత్తీర్ణత సా ధిం చా రు. వీరిలో బీ కీర్తన 583 మార్కులు సాధించింది. అలాగే ఈదర పాఠశాలకు చెందిన కందిమళ్ళ భవానీ 581 మార్కులు సాధించగా, వేములలో జడ్పీలో 46 మందికి 46 మం ది పాసై నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ ముండ్లమూరు 37 మం ది పరీక్ష రాయగా 36 మంది పాసై 97 శాతం ఉత్తీర్ణత సాధించారు. జెడ్పీహెచ్‌ఎస్ పూరిమెట్లలో 46 మందికి 41 మంది, మారెళ్లలో 73 మందికి 63 మం ది, ఈదరలో 73 మందికి 63 మంది, ఉమామహేశ్వర అగ్రహారం జెడ్పీ పాఠశాలలో 47 మందికి 40 మంది, ముండ్లమూరులో 65 మందికి 50 మంది ఉత్తీర్ణత సాధించారని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కే పూర్ణచంద్రరావు, సునీత, మాధవీలత, సుబ్బారావు, ప్రమోద్‌కుమార్, బాలిశెట్టి శ్రీనివాసరావు, శ్రీనివాసులు, టాన్య తెలిపారు.

'తాళ్లూరు'లో 75 శాతం ఉత్తీర్ణత

తాళ్లూరు, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన హైస్కూళ్లలో పదో తరగతి ఫలితాలలో 75 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో జి.సుబ్బయ్య తెలిపారు. బొద్దికూరపాడు హైస్కూలు విద్యార్థి 570 మార్కులు సాధించారన్నారు. తాళ్లూరు సరస్వతీ హైస్కూల్ విద్యార్థి చల్లా రేవతి 591 మార్కులు, తూర్పుగంగవరం గీతాంజలి స్కూల్ విద్యార్థి కె.ఎం.శివ ప్రసాద్ 590 మార్కులు, ఏబీసీ స్కూల్ విద్యార్థి ఐ.స్నేహితారెడ్డి 587 మార్కులు సాధించారు. శారదా హైస్కూల్‌కు చెందిన షేక్ మాలిక్ 584 మార్కులు, అమెరికా పబ్లిక్‌స్కూల్ విద్యార్థి సీహెచ్ మనోజ్ 581 మార్కులు, గంగా హైస్కూల్ విద్యార్థి 580 మార్కులు సాధించారు.



తాళ్లూరులో చల్లా రేవతిని అభినందిస్తున్న రమణారెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన ఉత్తీర్ణత శాతం

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో కంటే ఉత్తీర్ణత శాతం తగ్గింది. తాళ్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉత్తీర్ణత మండలంలోనే అత్యంత దారుణంగా పడిపోయింది. 48 విద్యార్థులకు కేవలం ఏడుగురు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. బొద్దికూరపాడులో 68మందికి 38మంది, తూర్పుగంగవరం హైస్కూల్‌లో 65మందికి 36 మంది, కేజీబీవీ విద్యాలయంలో 32 మందికి 17 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. మిగిలిన స్కూళ్లలోనూ ఆశించిన ఉత్తీర్ణత శాతం నమోదు కాలేదు.

దర్శి మండలంలో...

దర్శి ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలో 12 ప్రభుత్వ పాఠశాలల్లో 748 మంది పరీక్షలు రాయగా 516 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం మీద 68.98 శాతం ఉత్తీర్ణత సాధించారు. పోతవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కేవీ ప్రదీప్, మోడల్ స్కూల్‌కు చెందిన కె షాలినీ అత్యధికంగా 586 మార్కులు సాధించారు.

'కురిచేడు'లో 71.18 శాతం ఉత్తీర్ణత

కురిచేడు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతిలో పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు 71.18 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ఆర్ వస్రాం నాయక్ తెలిపారు. వెలుతుర్ల కార్తీక్ రెడ్డి అనే ప్రైవేటు పాఠశాల విద్యార్థి 594 మార్కులు సాధించడంతో ఎంఈవో అభినందించారు.

రైతులకు సబ్సిడీ పరికరాల పంపిణీ

అవీఇవీ



రోటావేటర్‌ను అందిస్తున్న వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ

దొనకొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద సబ్సిడీపై మంజూరైన వ్యవసాయ పరికరాలను రైతుసేవా కేంద్రాల వద్ద బుధవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 23 మంది రైతులకు దాదాపు రూ.4.5 లక్షల సబ్సిడీ పరికరాలు అందజేసినట్లు తెలిపారు. బాటరీ స్ప్రేయర్-1, ట్రైవాన్ స్ప్రేయర్లు-5, రోటావేటర్-1, విత్తనం గొర్రు-1, ట్రాక్టర్ గొర్రులు-15 మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రవితేజ, కమల, విన్నిబాబు, అరుణ, రాధిక, రమేష్, సురేంద్ర, లబ్ధిదారులైన రైతులు పాల్గొన్నారు.

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్లు

వెలిగండ్ల, ఏప్రిల్ 23 : (ఆంధ్రజ్యోతి) వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని పశువులకు తాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో నీటి తొట్ల నిర్మాణం చేపట్టిందని ఎంపీడీవో మహబూబ్ బాషా చెప్పారు. బుధవారం మండలంలోని పందువ నాగులవరం పంచాయతీలో నిర్మాణం పూర్తయిన నీటి తొట్లను పరిశీలించారు. ఒక్కో తొట్టి 3వేల లీటర్ల పరిమాణం కలిగి ఉండాలన్నారు. ఈయన వెంట ఏపీవో నాయక్, సిబ్బంది పాల్గొన్నారు



నీటి తొట్టిని పరిశీలిస్తున్న ఎంపీడీవో బాషా

చదువుతోనే భవిష్యత్‌కు బంగారు బాటలు



మాట్లాడుతున్న టీడీపీ అధ్యక్షుడు వెంగయ్య

సీఎస్‌పురం(పామూరు) ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : చదువుతోనే విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చునని టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య చెప్పారు. మండలంలోని ఉప్పలపాడు యూపీ పాఠశాల వార్షికోత్సవం హెచ్‌ఎం ఖాజారహంతుల్లా అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఎంఈవోలు జే ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, తహసీల్దార్ మంజునాథరెడ్డి, టీడీపీ నాయకులు బొబ్బూరి రమేష్, బత్తుల వెంకటాద్రి, ఎస్‌సి మాలకొండయ్య, సీఎస్‌పురం సర్పంచ్ శ్రీరాం పద్మావతి, షేక్ రజ్జబ్‌బాష, స్కూల్ కమిటీ చైర్మన్ కే రసూల్‌రెడ్డి, ఇండ్ల లక్ష్మణ్, బేరి రమణారెడ్డి, ఆండ్ల శ్రీను, డీ శ్రీనివాసులరెడ్డి, జేఎస్ ఆనంద్, నాయబ్‌రసూల్, డీ పున్నమ్మ పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వైభవంగా వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల

దర్శి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పువెంకటాపురంలో బుధవారం శ్రీ వెంకటేశ్వరస్వామి తిరునాళ్ల వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రజలు స్వామివారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవైద్యం సమర్పించారు. టీడీపీ ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పామూరు మండలంలో టీడీపీ కమిటీల నియామకం



సమావేశంలో పాల్గొన్న పువ్వాడి, ఇతర నేతలు

పామూరు, ఏప్రిల్ 23, (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామకమిటీల నియామకం చేపట్టారు. మండలంలోని దాదిరెడ్డిపల్లిలో బుధవారం సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా కల్లూరి తిరుపతయ్య, ఉపాధ్యక్షుడిగా గుర్రం నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా దూపాటి శ్రీనివాసులును ఎన్నుకొన్నారు. అదేవిధంగా వగ్గంపల్లి టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బైరెడ్డి వెంకటేశ్వరరెడ్డి(తుఫాన్), ఉపాధ్యక్షుడిగా రావి సూరయ్య, ప్రధాన కార్యదర్శిగా పాలేటి ఆశీర్వాదంలను ఎన్నుకొన్నారు. అన్ని వర్గాలను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు బైరెడ్డి జయరామిరెడ్డి, యారవ శ్రీనివాసులు, ఏ ప్రభాకర్ చౌదరి, మన్నం రమణయ్య, సయ్యద్ అమీర్ బాబు, ఇర్రి కోటిరెడ్డి, బద్దిపూడి మార్క్, అబ్బూరి శేషయ్య, వింజం మల్లికార్జున, చావా సుబ్బారావు, జి వెంకటేశ్వర్లు, యు సురేష్ పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత (అంచనా)

24-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	27
తెనాలి	39	27
నరసరావుపేట	41	24
బాపట్ల	37	28
రెంటచింతల	42	25


ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అమరావతి పనులను పునఃప్రారంభించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే నెల రెండో తేదీన ప్రధాని హాజరయ్యే సభా ప్రాంగణానికి సంబంధించిన పనులను బుధవారం మంత్రి నారాయణ, ఐజీ త్రిపాఠి పరిశీలించారు. రోడ్ల పనులు అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రం నలుమూలల నుంచి 5 లక్షల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు.



సభా ప్రాంగణం వద్దకు వెళుతున్న మంత్రి నారాయణ, ఐజీ త్రిపాఠి

బిల్లులు.. బాధలు

మూడు జిల్లాల్లో రూ.కోట్లలో పెండింగ్



- పూర్తయిన పనులకు నెలలుగా విడుదల కాని నగదు
- అప్పుల పాలై వడ్డీలు కట్టలేక పోతున్నామని నేతల ఆవేదన
- బిల్లులు వస్తే చాలు.. కొత్త పనుల జోలికి వెళ్లబోమంటున్న నేతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

- పల్నాడు జిల్లాలో 80.49 కోట్లు., బాపట్ల జిల్లాలో రూ.58.18 కోట్లు., గుంటూరు జిల్లాలో రూ.15.79 కోట్లు.. ఇలా బిల్లులు పేరుకుపోయాయి.
- పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సంబంధించి రూ.154.46 కోట్ల బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి.
- పల్నాడు జిల్లాలో 702కు 513, బాపట్ల జిల్లాలో 691కు 539, గుంటూరు జిల్లాలో 383కు 259 మినీ గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. అయితే ముందుగా చెప్పిన విధంగా విడతల వారీగా బిల్లులు చెల్లింపులు జరగడంలేదు. మూడు జిల్లాల్లో రూ.19 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్లు అధికారుల లెక్కలు తెలియజేస్తున్నాయి.
- 2019కి ముందు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో దాదాపు రూ.106 కోట్లు బిల్లుల బకాయిలు ఉన్నట్లు పశు సంవర్ధకశాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి.

మన ప్రభుత్వం వచ్చింది.. పనులు చేస్తే వెంటనే బిల్లులు వస్తాయి.. అని అప్పులు చేసి పనులు చేసిన కూటమి పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నేతలు అప్పుల పాలై అల్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దఎత్తున అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. దీంతో గ్రామ, మండల స్థాయిల్లో నేతలు పెద్దఎత్తున పనులు చేపట్టారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వలు వంటి పనులను పెద్దఎత్తున చేశారు. అయితే పను లు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా, వాటికి సంబంధించి బిల్లులు రావడంలేదు. బిల్లులు ఇప్పించాలని కొన్ని చోట్ల ఎమ్మెల్యే లపై నేతలు ఒత్తిడి తెస్తున్నారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో పనులు ఇస్తాం తీసుకోమంటున్నా ఎవరూ ముందుకు రావడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పార్టీ గెలుపు కోసం ఎంతో శ్రమించాం.. ప్రగతి పనులు చేస్తే కొంత ఆదాయం వస్తుందనే ఆశతో టీడీపీ నేతలు చాలావరకు అప్పులు చేసి మరీ ఉపాధి హామీ పథకం కింద పనులు చేశారు. ఈ బిల్లులు కూడా నెలల తరబడి చెల్లించ డంలేదు. పల్లె పండుగ పథకం ప్రారంభంలో వారం వారం బిల్లుల చెల్లింపులు జరిగాయి. మొదటి రెండు వారాలు చెల్లింపులు సక్రమంగా జరిగాయి. దీంతో బిల్లులు వెంటనే వస్తాయనే ఆశతో పలువురు పెద్దఎత్తున పనులు చేశారు. బిల్లుల చెల్లింపులు నిలిచి పోవడంతో వారు ఖంగుతిన్నారు.

గతంలోనూ.. ఇప్పుడూ ఒకతీరు

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా పార్టీ నేతలు పెద్దఎత్తున పనులు చేపట్టారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆయా బిల్లులను ఆపేసింది. దీంతో చాలామంది అప్పులు పాలయ్యారు. కొందరు కోర్టులను ఆశ్రయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాత బిల్లులు చెల్లిస్తారని పలువురు ఆశపడ్డారు. అయితే పాత బిల్లుల ఊసే ప్రభుత్వం ఎత్తక పోతుండటంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వలె కాకుండా పనులు చేసిన వెంటనే బిల్లులు చెల్లిస్తారనే ఆశతో పనులు పెద్దఎత్తున చేపట్టగా గతంలోని పరిస్థితి ఎదురవడంతో నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు చెల్లింపు విషయంలో పనులు చేసిన నేతలకు ప్రభుత్వం చుక్కలు చూపెడుతోంది. పనులు చేసి అప్పులు పాలయ్యామని వడ్డీలు కట్టలేక పోతున్నామంటూ నేతలు ఎమ్మెల్యేల ఎదుట ఆవేదన వక్తం చేస్తున్నారు. గతంలో, ఇప్పుడు బిల్లులు నిలిచిపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సీసీ రోడ్డు



గోకులం షెడ్

మొక్కజొన్న పేరుతో.. మెక్కేస్తున్నారు..

- అడ్వాన్స్‌డు రైల్వే ర్యాక్ బుకింగ్... ఆపై వసూళ్ల పర్వం
- ర్యాక్‌కు రూ. 3 నుంచి రూ. 4 లక్షల డిమాండ్!
- ఒక్క తెనాలి నుంచే లక్ష టన్నుల మొక్కజొన్నలు రవాణా
- గత వైసీపీ ప్రభుత్వ కాలంలో మొదలయిన వసూళ్లు
- డెల్టాలో అధికార, ప్రతిపక్ష పార్టీ అనుచరుల మధ్య వసూళ్ల వివాదం
- వ్యాపారులకు తలనొప్పిగా మారిన వైనం



తెనాలి రైల్వే స్టేషన్‌లో రైల్వే గూడ్స్ వ్యాగన్‌కు సరకు లోడ్ చేసేందుకు వరుసలో ఉన్న మొక్కజొన్న లారీ

మొక్కజొన్న పండించిన రైతు... వారి దగ్గర నుంచి పంట కొనుగోలు చేసిన వ్యాపారులు... ఇద్దరూ కాదని వీరి మధ్యలో వసూళ్ల రాయుళ్లు. వారికి అధికార పార్టీ నేతల అండదండలు. వెరసి రైల్వే గూడ్స్ వ్యాగన్‌ల వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది. ఆనాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ ప్రభుత్వ కాలంలో వసూళ్ల పర్వానికి తెరలేపితే, నేడు కూటమి నేతల మధ్య అదే అగ్గి రాజేస్తోంది. తమ వారికి వసూలు చేసుకునే అవకాశం కావాలంటే... లేదు మా వారే వసూలు చేసుకుంటారంటూ తెనాలి, బాపట్ల, విజయవాడ, ఏలూరు ప్రాంతాల వ్యాపారుల తరపున నేతలు వత్తిడి చేయటం చూస్తే ఇది మంచి ఆదాయ వనరుగా కనిపిస్తుంది. రూ. లక్షో రూ. 2 లక్షలో కాకుండా రూ. కోటిన్నర ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకుని అధికార పార్టీ నేతలు దందాకు తెరతీశారు. దీంతో ఈ వ్యవహారం కాస్తా ప్రభుత్వ పెద్దల దృష్టికి చేరిపోవటం, మీరెవరూ వద్దని, వ్యాపారుల మధ్యలో వేలుపెడితే ఊరుకునేదిలేదంటూ చివాట్లు పెట్టటం కొసమెరుపు. ఎగుమతి 'సుంకాల' వ్యవహారానికి సంబంధించి వివరాల్లోకి వెళితే...

గుంటూరు, బాపట్ల, తెనాలి, ఏప్రి ల్ 23, (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాలో రబీ కింద మొక్కజొన్న, జొన్న పంటలు సాగవుతున్నాయి. 5.71 లక్షల ఎకరాల విస్తీర్ణంలో 4.5 లక్షల ఎకరాల వరకు మొక్కజొన్న, జొన్న పంటలు సాగవుతుంటే, దిగుబడులు ఈ సంవత్సరం ఆశాజనకంగా నే ఉన్నాయి. అయితే మొక్కజొన్నకు మద్దతు ధరతో పోల్చితే పర్వాలేదనిపించేలా మార్కెట్ రేటు ఉన్నా, తెల్ల జొన్నకు రేటు లేదు. అయితే రైతులు మాత్రం పండించిన పంట ను నిల్వ ఉంచుకునే అవకాశం లేక, ఆ ధైర్యంకూడా చేయలేక వ్యాపారులకే వచ్చిన ధరకు అమ్మేస్తున్నారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉన్న మొత్తం సాగు విస్తీర్ణంలో ప్రస్తుతానికి సగం విస్తీర్ణంలో మొక్కజొన్న, జొన్న కోత పూర్తయితే, మరికొంత విస్తీర్ణం మే, జూన్ నెలల్లో పూర్తవుతుంది. చిన్న వ్యాపారులు ఇప్పటికే మొక్కజొన్న, జొన్న రైతుల నుంచి కొంటున్నారు. అయితే వీటిని ఎగుమతి దారులకు అమ్మకాలు సాగించాల్సి ఉంది. అది జరగాలంటే సరకు ఇతర రాష్ట్రాలకు పంపేందుకు రైల్వే ర్యాక్‌లు అవసరం అవుతుంది. ఇక్కడే అసలు రాజకీయం మొదలవుతోంది.

ర్యాక్‌ల వసూళ్ల రగడ వైసీపీ ప్రభుత్వ కాలం నుంచే...

వ్యాపారులు తాము కొన్న సరకును ఇతర రాష్ట్రాలు, దేశాలకు పంపాలంటే మనకు అనుకూలంగా ఉన్నది రైల్వే రవాణా వ్యవస్థే కీలకం. దీనికోసం రైల్వే ర్యాక్‌లను బుక్ చేసుకోవలసి ఉంటుంది. ఒక్కో ర్యాక్‌లో 2,500 టన్నుల సరకు రవాణా చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇంత మొత్తంలో ఒకే వ్యాపారి కొనలేరు కనుక కొంత మంది వ్యాపారులు కలసి ఒక ర్యాక్ చొప్పున బుక్ చేసుకుని సరకును తమిళనాడు, కర్నాటక వంటి రాష్ట్రాలకు పంపుతారు. అక్కడి ఎగుమతిదారులు ఆ సరకును దింపుకుని ఇతర దేశాలకు ఎగుమతి చేసుకోవటం పరిపాటి. అయితే ఇక్కడే ర్యాక్‌ల లొల్లి మొదలయింది. గూడ్స్ వ్యాగన్‌ల అవసరాన్ని గుర్తించిన కొందరు దళారులు మధ్యలో చేరిపోయారు. గత వైసీపీ ప్రభుత్వ కాలం నుంచి ఈ కొత్త దందాకు తెరలేపారు. వ్యాపారుల స్థానంలో కొందరు దళారులు ముందుగానే ర్యాక్‌లు బుక్‌చేసుకుని పెట్టేస్తారు. వ్యాపారులకు అవసరమైన సమయంలో వాటిని తెప్పించి సరకు లోడ్ చేసుకుని పంపాలంటే (మిగతా 6వ పేజీలో)

పదిలో 12వ స్థానం

- జిల్లాలో 83.96 శాతం ఉత్తీర్ణత
- గత ఏడాది కంటే తగ్గిన ఉత్తీర్ణత
- పదో తరగతి ఫలితాల్లో బాలికలదే పైచేయి



దివ్యశ్రీ (596)



సుహిత (594)

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పాఠశాల విద్యాశాఖ బుధవారం విడుదల చేసి పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 83.96 శాతం ఉత్తీర్ణతతో జిల్లా పన్నెండో స్థానంలో నిలిచింది. గత నెలలో జరిగిన పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 16,182 మంది విద్యార్థులు హాజరు కాగా 13,586 మంది ఉత్తీర్ణత సాధించారు. వారిలో 6,615 మంది బాలురు, 6,971 మంది బాలికలు ఉన్నారు. ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. బాలుర ఉత్తీర్ణతా శాతం 81.24గా ఉండగా, బాలికలది 86.71గా ఉంది. గతేడాది జిల్లా 14వ స్థానంలో నిలిస్తే, ఈసారి రెండు స్థానాలు ఎగబాకి 12 వస్థానంలో నిలవడం గమనార్హం. మొదటి శ్రేణిలో 11,135 మంది, ద్వితీయ శ్రేణిలో 1,743 మంది, మూడో డివిజన్‌లో 708 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో వందశాతం ఫలితాలు సాధించిన పాఠశాలలు ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 58 ఉన్నాయి.

దివ్యశ్రీకి 596 మార్కులు

జిల్లాలోని పందిళ్లపల్లి జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న సజ్జా దివ్యశ్రీ 596 మార్కులు సాధించగా, పెసర్లంక జడ్పీ హైస్కూల్ విద్యార్థిని త్రిపురనేని సుహిత 594 మార్కులతో మెరిసింది. బాపట్లలోని సరస్వతీమెమోరియల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్.జహూరా 593 మార్కులు సాధించింది. విద్యార్థినిని ప్రిన్సిపాల్ ఆవుల వెంకటేశ్వర్లు, బుజ్జమ్మ, శర్మ, మరకతవల్లి, దేవిక తదితరులు సత్కరించారు. ఈపురుపాలెం విద్యార్థిని వూట్ల హిమబిందు, చెరుకూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని నెల్లూరి మహాలక్ష్మీ, శంకవరప్పాడు విద్యార్థి భూపతి తేజశ్వంత్‌లు 592 మార్కులు సాధించారు.

బీసీ వసతిగృహంలో నూరు శాతం..

బాపట్లలోని బీసీ బాలుర వసతిగృహాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ డి.వి.ఎస్.నాగరాజు తెలిపారు. కర్లపాలెం ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ హాస్టల్ మారుబోయన జగదీష్‌రెడ్డి 515, భవానీ శంకర్‌రెడ్డి 515, పుచ్చకాయల వెంకటేశ్వర్లు 506 మార్కులు సాధించారన్నారు.



593 మార్కులు సాధించిన బాపట్ల సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని జహురాను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మత్స్యకార భరోసా.. 13,800 మందికి

అర్హుల జాబితాను నేడు కలెక్టర్ ఆమోదంతో ప్రభుత్వానికి పంపనున్న మత్స్యశాఖ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా పట్టాలెక్కుతుండగా వాటి సరసన మత్స్యకార భరోసా కూడా చేరనుంది. వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు ఇచ్చే పరిహారాన్ని రూ.10,000 నుంచి 20,000కు పెంచి ఇవ్వడానికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. అర్హులైన ఏ ఒక్క మత్స్యకారుడు భృతికి దూరంగా ఉండడానికి వీల్లేదని ప్రభుత్వం ఆదేశించింది. దీనికి అనుగుణంగా గడచిన వారం రోజులుగా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టిన యంత్రాంగం లబ్ధిదారుల జాబితాను కొలిక్కి తెచ్చింది. జాబితాను కలెక్టర్ వెంకటమురళికి మత్స్యశాఖ అధికారులు గురువారం అందించనున్నారు. ఆయన ఆమోదంతో జాబితాను ప్రభుత్వానికి పంపనున్నారు. ఈ నెల 26న పరిహారాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం గతంలోనే ప్రకటించి ఉండడం, భృతి విషయంలో రెట్టింపు అందనుండడంతో గంగపుత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల సంఖ్యలో గత ప్రభుత్వంలో కన్నా వృద్ధి నమోదైంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 13,800 మందికి మత్స్యకార భరోసాకు అర్హులని తేల్చింది. దీనిని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. గత ప్రభుత్వంలో మత్స్యకార భృతి అందుకున్న గంగపుత్రుల సంఖ్య 11,000 లోపుగానే ఉంటూ వస్తోంది. గతేడాది కూడా 10,800 మంది గంగపుత్రులనే భృతికి అర్హులుగా గుర్తించినప్పటికీ అదే సమయంలో ఎన్నికలు రావడంతో అది నిలిచిపోయింది. ఇదిలా ఉంటే గత ప్రభుత్వంలో ఎటువంటి అర్హతలు లేకుండా కేవలం రాజకీయ ఒత్తిళ్లే ప్రామాణికంగా దాదాపు 900 మంది వేట నిషేధ పరిహారం అందుకున్నట్లు యంత్రాంగం గుర్తించి వారిని లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించింది. వీరిలో కొంతమందికి అసలు వేటతోనే సంబంధం లేదని సర్వేలో ధ్రువీకరించారు. అనర్హుల స్థానంలో పెద్దసంఖ్యలో అర్హులకు లబ్ధి చేకూర్చడంతో పాటు గత ప్రభుత్వంతో పోలిస్తే మత్స్యకార భరోసా అందుకుంటున్న వారి సంఖ్య 3,000 వరకు పెరగడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

వీరయ్య హత్యలో.. రేషన్ మాఫియా?

- పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు
- బాపట్ల రైస్‌మిల్ యజమాని సహా చీరాలకు చెందిన మరో ఇద్దరు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయ కుడు ముప్పవరపు వీరయ్యచౌదరి హత్యకు సంబంధించి బాపట్ల జిల్లాలోనూ లింకులు ఉన్నట్లు తెలుస్తోంది. బాపట్ల మండల పరిధిలోని వెదుళ్లపల్లికి చెంది న ఓ రైస్ మిల్లు యజమానిని ఒంగోలు పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ హత్య కేసు ఛేదించే క్రమంలో పోలీ సులు ఒంగోలుకు చెందిన ఇద్దరి అనుమానితుల కాల్‌డేటాపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ హత్య తర్వాత ఒంగోలు రేషన్ మాఫియాలో కీలకంగా ఉండే వ్యక్తి కనిపించకుండా పోయాడు. అతడి కాల్‌డేటాలో బాపట్లలో రేషన్ దందా చేసే రైస్‌మిల్ యజమాని నంబరు ఉన్నట్లు పోలీసులు గుర్తించి అతడ్ని అదుపు లోకి తీసుకుని విచారిస్తున్నారని తెలిసింది. బాపట్ల జిల్లాలో రేషన్ మాఫి యా లో కీలకంగా ఉండే వ్యక్తుల కదలికలపై కూడా మంగళవారం రాత్రి నుంచే పోలీ సులు నిఘా పెట్టారు. చీరాలకు చెందిన మరో ఇద్దరిపై కూడా ఖాకీలు గురిపె ట్టినట్లు సమాచారం. హత్యకు సంబంధించి పోలీసులు అనుమానిస్తున్న ఒంగోలుకు చెందిన వ్యక్తిని బాపట్ల రైస్‌మిల్లు యజమాని ప్రకాశం జిల్లా నాగులు ప్పలపాడు మండలం ఉప్పుగుండూరు నుంచి తన వాహనంలో ఎక్కించుకుని బుధవారం ఉదయం తీసుకెళ్లినట్లు పోలీసు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. కాల్‌డేటాతో పాటు గడచిన మూడు రోజులుగా వారి లొకేషన్‌లు, బ్యాంకు లావా దేవీలు, వారు తిరిగిన ప్రదేశాలు ఇలా ఏ ఒక్క అంశాన్ని వదలకుండా ఖాకీలు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒంగోలు రేషన్ మాఫియాతో పాటు బాపట్ల జిల్లాలో దందా చేసే వ్యక్తుల్లో కూడా పోలీసుల దర్యాప్తు వెన్నులో వణుకు పుట్టిస్తోంది.



కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానాన్ని అందజేస్తున్న కౌన్సిలర్‌లు

అవిశ్వాసానికి సిద్ధం

» ఎట్టకేలకు కలెక్టర్‌కు తీర్మానం అందజేత

» చక్రం తిప్పిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై ఎట్టకేలకు ఎమ్మెల్యే కొండయ్య వర్గం అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్ వెంకటమురళికి అందజేసింది. ఈ విషయం ముందు నుంచే ఆంధ్రజ్యోతి చెప్తునూ ఉంది. అయితే రెండు మాసాలుగా నలుగుతున్న ఈ అంశానికి బుధవారంతో తెరపడింది. పలుమార్లు బల నిరూపణ విషయంలో ఎమ్మెల్యే కొండయ్య ఏమాత్రం తొణక కుండా, జాగ్రత్తగా అడుగులు వేశారు. ఈక్రమంలో మునిసిపాలిటీపై తనదైన శైలిలో పట్టు సాధించారు. ప్రత్యర్థుల ప్రయత్నాలను తిప్పికొడుతూ అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టర్ వారిని బలంతపు ప్రయోగాలపై సూటిగా ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే అవిశ్వాసానికి వెళ్లిన కౌన్సిలర్లు సానుకూలంగా స్పందిచడంతో తదుపరి ప్రక్రియకు ఆర్డీవో ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిసింది. అయితే మ్యాజిక్ ఫిగర్ ఛేదించిన అనంతరం వారిని ఎమ్మెల్యే ఆస్థానంలోకి మరల్చినట్లు సమాచారం.

రైతులకు సబ్సిడీ పరికరాల పంపిణీ



రోటావేటర్‌ను అందిస్తున్న వ్యవసాయాధికారి

దొనకొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద సబ్సిడీపై మంజూరైన వ్యవసాయ పరికరాలను రైతుసేవా కేంద్రాల వద్ద బుధవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 23 మంది రైతులకు దాదాపు రూ.4.5 లక్షల సబ్సిడీ పరికరాలు అందజేసినట్లు తెలిపారు. బాటరీ స్ప్రేయర్-1, డ్రైవాన్ స్ప్రేయర్లు-5, రోటావేటర్-1, విత్తనం గొర్రు-1, ట్రాక్టర్ గొర్రులు-15 మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రవితేజ, కమల, విన్నిబాబు, అరుణ, రాధిక, రమేష్, సురేంద్ర, లబ్ధిదారులైన రైతులు పాల్గొన్నారు.

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్లు



నీటి తొట్టిని పరిశీలిస్తున్న ఎంపీడీవో బాషా

వెలిగండ్ల, ఏప్రిల్ 23 : (ఆంధ్రజ్యోతి) వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని పశువులకు తాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో నీటి తొట్ల నిర్మాణం చేపట్టిందని ఎంపీడీవో మహబూబ్ బాషా చెప్పారు. బుధవారం మండలంలోని పందువ నాగులవరం పంచాయతీలో నిర్మాణం పూర్తయిన నీటి తొట్లను పరిశీలించారు. ఒక్కో తొట్టి 3వేల లీటర్ల పరిమాణం కలిగి ఉండాలన్నారు. ఈయన వెంట ఏపీవో నాయక్, సిబ్బంది పాల్గొన్నారు

మొక్కజొన్న పేరుతో మెక్కేస్తున్నారు

(5వ పేజీ తరువాయి)

వారు కప్పం కట్టాల్సిన పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఒక్కో ర్యాక్‌కు రూ. 2 లక్షల వరకు వసూలు చేస్తూ వచ్చారు. దీని వెనుక అప్పట్లో మార్కెటింగ్ శాఖలో పనిచేస్తున్న ఇద్దరు కిందిస్థాయి ఉద్యోగులు కూడా ఉన్నారనే ప్రచారం ఉంది. వారిని అడ్డుపెట్టుకుని ఒకే వ్యక్తి ర్యాక్‌లు బుక్ చేయటం, ఒకవేళ అతనితో సంబంధం లేకున్నా వ్యాపారులే బుక్ చేసుకున్నా, దానిలో సరకు లోడ్ చేయాలన్నా, ర్యాక్ కదలాలన్నా కప్పం కట్టాల్సిందేననే హుకుం జారీ చేశారు. దీనికి అప్పటి వైసీపీ నేతలు కూడా అండగా నిలిచారనే ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు ఆ కప్పం కంపు కూటమి నేతలకూ పులుముతున్నారు. అడ్వాన్స్‌డ్ ర్యాక్‌ల బుకింగ్‌తో అక్రమ దందాకు రంగంలోకి దిగిన కొందరు వ్యాపారులు కూటమి నేతల పేర్లుచెప్పి మరీ బహిరంగంగానే వసూళ్లకు దిగుతున్నారు. తెలుగుదేశం, జనసేన, నేతల పేర్లు చెప్పి వసూళ్లకు తరలిశారు. ఇవన్నీ మాకు కాదని, నేతలకు కట్టాల్సిందేనంటూ బహిరంగంగానే చెప్పటం కొసమెరుపు.

ర్యాక్‌ల ద్వారా రూ. కోటిన్నర లక్ష్యంగా...

పంట పండించలేదు... పండిచిన రైతుల దగ్గర నుంచి డబ్బుపెట్టి సరకు కొననూలేదు. కేవలం అధికార పార్టీల అండే వారికి దందాకు ఊతంగా మారింది. వైసీపీ ప్రభుత్వ కాలంలో కప్పం వ్యవహారం కంపుకొట్టినా, అధికార పార్టీ నేతలు సంపాదనే లక్ష్యంగా రూ. కోటిన్నర కోసం టార్గెట్ పెట్టుకుని వసూళ్ల దందాకు దిగారనేది వ్యాపారుల ఆరోపణ. ఒక్క తెనాలి నుంచే మొక్కజొన్న, జొన్న లోడుతో ఏటా ఏప్రిల్ నుంచి జూన్ వరకు 35 నుంచి 40 వరకు ర్యాక్‌లు ఇతర రాష్ట్రాలకు వెళ్లటం పరిపాటి. కేవలం దీనిపైనే రూ. కోటిన్నర లక్ష్యంగా పెట్టుకున్నారో! లేక గత వైసీపీ ప్రభుత్వంలో వసూళ్ల రాయుళ్లను మంచివాళ్లను చేద్దామనుకున్నారో కానీ, ఈ ఏడాది ఒక్కో ర్యాక్‌కు తమ సొంత ఎగుమతి సుంకాన్ని రూ. 3 నుంచి రూ. 4లక్షల వరకు పెంచేశారు. ఒకే ఏడాది అంత మొత్తంలో అనధికార వసూళ్లు పెంచేయటంతో వ్యాపారుల్లో నిరసన వ్యక్తమయింది. అదేమని ఎవరైనా అడిగినా ఇవన్నీ మాకు కాదని, పార్టీ నేతలకు పంపాలంటూ ఏలూరు, తెనాలి, బాపట్ల జిల్లాల నుంచి వచ్చిన వ్యాపారులు, వసూలు రాయుళ్లు చెప్పుకురావటం విశేషం. అంటే అన్ని ర్యాక్‌లకు కలిపి రూ. కోటిన్నర వరకు వసూలు టార్గెట్‌గా పెట్టిమరీ వసూలు చేస్తున్నారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిట్లా ఉంటే... ఇక్కడి నేతలు, ఇక్కడి వ్యాపారులు చాలరన్నట్టు ఏకంగా ఏలూరుకు చెందిన నేత పేరుకూడా తెరపైకి ఓ వ్యాపారి తీసుకురావటంతో స్థానిక వ్యాపారులు విస్తుపోతున్నారు. ఇదంతా ఆయా పార్టీల నేతలకు తెలుసో! లేదో! కానీ ఇక్కడ వ్యాపారులు మాత్రం తెనాలి అడ్డాగా కొందరు కూటమి నేతలకు పనికట్టుకుని మరీ చెడ్డపేరు తీసుకొస్తున్నారు. అయితే ఇప్పటికైనా నేతలు మేల్కొని ఈ అక్రమ వసూళ్ల దందాకు తెరదింపుతారో లేదో!.

అన్నదాతల అభ్యున్నతే లక్ష్యం

» రైతులకు అందుబాటులో ఎత్తిపోతల పథకాలు

» ఎమ్మెల్యే ఏలూరి



ఐడీసీ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

పర్చూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. బుధవారం ఏలూరి క్యాంప్ కార్యాలయంలో ఐడీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తెచ్చేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. సకాలంలో ఆరు తడులకు నీరు అందిచడమే తన ముందు ఉన్న లక్ష్యమన్నారు. ఎత్తిపోతల పథకాలను రైతులు వినియోగించుకునేలా భాగస్వామ్యం కల్పిస్తున్నట్లు ఏలూరి వెల్లడించారు. వైసీపీ పాలనలో కనీసం మరమ్మతులు కూడా చేయక మూలనపడ్డాయన్నారు. సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారని ఏలూరి చెప్పారు. సాగర్ టైల్యాండ్ ఆయకట్టుకు నాలుగు నూతన పథకాలకు రూపకల్పన చేశామన్నారు. పథకాల అభివృద్ధికి అంచనాలను ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులకు ఏలూరి సూచించారు. నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు భూములకు సైతం నీరు అందించే విధంగా ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. సమావేశంలో ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాగ్యలక్ష్మి, విశ్రాంత ఇరిగేషన్ ఇంజనీర్ సత్యనారాయణ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపినాథ్, శివరామయ్య పాల్గొన్నారు.

నేడు రోటరీ కళా పరిషత్ నాటిక పోటీలు ప్రారంభం



నాటికల ప్రదర్శన సిద్ధమవుతున్న వేదిక

మార్టూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : శ్రీకారం స్వచ్ఛంద సంస్థ, రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక మద్ది సత్యనారాయణ కంపెనీ ఆవరణలో శ్రీకారం రోటరీ కళా పరిషత్ నాటిక పోటీలను ప్రారంభిస్తున్నట్లు శ్రీకారం సంస్థ కార్యదర్శి జాష్టి అనూరాధ, రోటరీ అధ్యక్షుడు మద్దుమాల కోటేశ్వర రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. మొత్తం 10 నాటికలను ప్రదర్శిస్తారు. గురు, శుక్ర, శనివారాలు నాటికలను ప్రదర్శిస్తారు.ప్రదర్శించిన ప్రతి నాటికకు పారితోషికంతో పాటు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు అందజేస్తారు. దాంతోపాటు వ్యక్తిగత బహుమతులను కళాకారులకు అందచేస్తారు. ఈ నాటిక పోటీలను రోటరీ గవర్నర్ జిల్లా 3150 డాక్టరు కే శరత్‌చౌదరి ప్రారంభిస్తారని, ఆత్మీయ అతిథులుగా వేదిక ఉపాధ్యక్షుడు పీవీ మల్లికార్జునరావు విచ్చేస్తారన్నారు. అదేవిధంగా పోటీలను ప్రారంభిస్తూ రాత్రి మొదటిగా న్యూస్టార్ మోడరన్ థియేటర్ విజయవాడ వారిచే కపిరాజు నాటిక, రెండో ప్రదర్శనగా రసఝురి పొన్నూరు వారిచే గురితప్పినవేట నాటిక, యంగ్ థియేటర్ విజయవాడ వారిచే 27వ మైలురాయి నాటికను ప్రదర్శిస్తారు. చివరగా రోటరీ కళాపరిషత్ సభ్యులతో 50కోట్లు నాటికను ప్రదర్శిస్తారు. ప్రదర్శనల కోసం రంగస్థల కళా వేదికను సిద్ధం చేశారు. అదేవిధంగా నాటికల ప్రదర్శనలను తిలకించిన మహిళలకు ప్రత్యేక బహుమతులుగా చీరలను లాటరీ ద్వారా ఎంపిక చేసిన వారికి నిర్వాహకులు అందజేయనున్నారు.

నాటి కట్టడం కనుమరుగే



అద్దంకిలోని 175 సంవత్సరాల నాటి తహసీల్దార్ కార్యాలయం



తహసీల్దార్ కార్యాలయాన్ని తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

175 ఏళ్ల నాటి తహసీల్దార్ కార్యాలయ భవనం తొలగింపు

అద్దంకి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలోని మరో పురాతన భవనం కనుమరుగు కానుంది. సుమారు 175 ఏళ్ల కిందటి తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని తొలగిస్తున్నారు. 1850 ప్రాంతంలో అప్పటి నెల్లూరు జిల్లా పరిధిలోని అద్దంకి కేంద్రంగా తాలూకా ఏర్పడింది. అప్పట్లో పెంకులతో తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం జరిగింది. సుమారు 15 సంవత్సరాల క్రితం వరకు ఇదే భవనంలో తహసీల్దార్ కార్యాలయం కొనసాగింది. కొత్తభవనం నిర్మాణంతో అక్కడ నుంచి మార్పు చేశారు. దీంతో ఖాళీగా ఉంది. మున్సిపల్ కార్యాలయ భవనం నిర్మాణానికి తొలుత పరిశీలన చేసినప్పటికీ స్థలం సరిపోదన్న ఉద్దేశంతో ఉపసంహరించుకున్నారు. కొత్తగా పట్టణానికి రెండు ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లు మంజూరైన నేపథ్యంలో ఒకటి ఎస్ఎస్‌పీ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్నారు. రెండవది పాత తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని తొలగించి ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు సిద్ధం కావడంతో ఎక్స్‌కవేటర్‌తో పాత తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని తొలగించే పనులు ప్రారంభించారు. త్వరలో 15 ఏళ్ల నాటి భవనం పూర్తిగా కనుమరుగు కానుంది.



విచారిస్తున్న చీరాల డీఎస్పీ మొయిన్

రూ.5లక్షలు చోరీ

» మేనల్లుడి పెళ్లికి బంగారు కొనేందుకు డ్రా చేసిన నగదుతో పరార్

» కేసు నమోదు

అద్దంకి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటి వద్ద నుంచి తెచ్చిన రూ.2లక్షలతో పాటు బ్యాంక్ నుంచి డ్రా చేసిన మరో రూ.3లక్షల నగదును మోటార్‌సైకిల్ ట్యాంక్ కవర్‌లో ఉంచగా, దొంగలు అపహరించుకు పోయారు. ఈ ఘటన అద్దంకి పట్టణంలోని పాతబస్టాండ్ సెంటర్‌లో బుధవారం మధ్యాహ్నాం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బల్లికురవ మండలం కూకట్లపల్లికి చెందిన చాగంటి దానసూరబాబు తన మేనల్లుడు పెళ్లి కోసం బంగారం కొనుగోలు చేసేందుకు బుధవారం అద్దంకి వచ్చారు. ఇంటి వద్ద నుంచి రూ.2లక్షలు తీసుకురాగా, అద్దంకి పట్టణంలోని ఎస్‌బీఐ (ఏడీబీ)లో నుంచి రూ.3లక్షల నగదు డ్రా చేశారు. మొత్తం నగదు ను హ్యాండ్ క్యాష్ బ్యాగ్‌లో పెట్టుకొని పాతబస్టాండ్‌లో టిఫిన్ చేస్తున్నారు. అదే సమయంలో మోటార్‌సైకిల్‌పై ఇద్దరు యువకులు వచ్చి నగదు ఉన్న క్యాష్‌బాగ్‌ను తీసుకొని మేదరమెట్ల వైపు వెళ్లిపోయారు. బాధితుడు దానసూరబాబు అరుస్తూ వెంబడించినప్పటికీ దొంగలు వేగంగా మోటార్‌సైకిల్‌పై వెళ్లిపోయారు. పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో సీఐ సుబ్బరాజు వెంటనే బ్యాంక్‌కు వెళ్లి నగదు లావాదేవీలు, సీసీ ఫుటేజ్‌ని పరిశీలించారు. రూ.3లక్షల నగదును డ్రా చేసినట్లు గుర్తించి ఆ మేరకు చోరీ జరిగినట్లు కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి బాధితుడు నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణ పరిధిలో నామ్ రోడ్డు వెంబడి ఉన్న సీసీ కెమెరాలలో ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. బ్యాంక్‌లో నగదు డ్రా చేసేటప్పటి నుంచి దానసూరబాబును దొంగలు గమనిస్తూ వెంబడించి చోరీకి పాల్పడినట్లు తెలుస్తుంది.

వాగుభూమి ఆక్రమణపై సర్వే

'ఆంధ్రజ్యోతి' కథనంతో స్పందించిన అధికారులు

వాగు భూమి 15సెంట్లు ఆక్రమణ

తేల్చిన రెవెన్యూ అధికారులు



గోడను తీసివేయాలని నిర్వాహకులను ఆదేశిస్తున్న తహసీల్దార్ రవిశంకర్

కనిగిరి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలో భూ ఆక్రమణలు పెట్రేగిపోయిన నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ మేరకు పట్టణంలోని కొత్తూరు ఆంజనేయస్వామి దేవాలయం వెనుక అరకిలోమీటరు దూరంలో అలుగువాగును కొంతమంది అక్రమార్కులు ఆక్రమించి వెంచర్లు వేశారు. దీంతో ఆంధ్రజ్యోతిలో సోమవారం "వాగుభూమి హంఫట్" అనే కథనం ప్రచురితమైంది. ఈ మేరకు జిల్లా, డివిజన్ స్థాయి అధికారుల ఆదేశాలతో తహసీల్దార్ రవిశంకర్ వాగు భూమిని సర్వే చేపట్టారు. అక్రమంగా వేసిన వెంచర్లలోని హద్దురాళ్లను తొలగించారు. అదేవిధంగా వాగుఆక్రమణ చేస్తూ కట్టిన ప్రహరీ తీసివేయించారు. తహసీల్దార్ నేతృత్వంలో చేపట్టిన సర్వే లో వాగు భూమిని 388/1లోని వాగుభూమిలోని 15సెంట్లు భూమిని 388/2 లోని 2 ఎకరాల్లో అక్రమంగా వేసిన వేసిన వెంచర్ నిర్వాహకుల ఆక్రమించినట్లు తహసీల్దార్ రవిశంకర్ తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల

దర్శి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పువెంకటాపురంలో బుధవారం శ్రీ వెంకటేశ్వరస్వామి తిరునాళ్ల వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రజలు స్వామివారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవైద్యం సమర్పించారు. టీడీపీ ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వీరయ్యచౌదరికి కన్నీటి వీడ్కోలు

» స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తి

» నివాళులర్పించిన సీఎం చంద్రబాబు

» కుటుంబ సభ్యులకు పరామర్శ

» హంతకులు ఎక్కడ ఉన్నా శిక్షించి తీరుతామని హెచ్చరిక

» పాల్గొన్న మంత్రులు, తరలివచ్చిన టీడీపీ శ్రేణులు

» జనసంద్రంగా మారిన అమ్మనబ్రోలు

» నిలకడగా ఈదర హరిబాబు ఆరోగ్య పరిస్థితి



వీరయ్య చౌదరి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి ఆనం, ఎంపి మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, మాజీ ఎమ్మెల్యే గరటయ్య

ఒంగోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో గత రాత్రి దారుణ హత్యకు గురైన టీడీపీ ముఖ్యనేత, నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరికి టీడీపీ శ్రేణులు, జనం కన్నీటి వీడ్కోలు పలికారు. బుధవారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలో జరిగాయి. స్వయంగా టీడీపీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమ్మనబ్రోలు వచ్చి వీరయ్యచౌదరి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. హత్య జరిగిన వెంటనే విషయం తెలుసుకొని తీవ్రంగా స్పందించిన సీఎం బుధవారం మధ్యాహ్నాం మూడున్నర గంటల ప్రాంతంలో హెలికాప్టర్‌లో జిల్లాకు వచ్చారు. చదలవాడ సమీపంలోని హెలిప్యాడ్ వద్ద దిగి అక్కడి నుంచి కాన్వాయ్‌లో అమ్మనబ్రోలు చేరారు. స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ప్రాథమికంగా హత్యకు సంబంధించిన అంశాలను బస్సులో సీఎం దృష్టికి తీసుకపోగా, ముందుగానే అక్కడకు చేరిన మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులను కూడా వాకబు చేశారు. అలాగే పోలీస్ అధికారులతో మాట్లాడి పలు విషయాలను తీసుకున్న ఆయన నేరుగా వీరయ్యచౌదరి నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. భార్య, కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని వారిని ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి వీరయ్య చౌదరి చేసిన సేవలను కొనియాడుతూ ఇలా క్రూరంగా ఆయనను హత్య చేయడం తనను కలిచివేసిందన్నారు. ఇలాంటి హత్యా రాజకీయాలతో గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం వణికిపోయిందని, టీడీపీ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితికి తావులేదన్నారు. హంతకులు ఎక్కడ ఉన్నా పట్టి తెచ్చి కఠినంగా శిక్షిస్తామని తద్వారా వీరయ్యచౌదరి ఆత్మకు శాంతి చేకూర్చుతామన్నారు.

మధ్యాహ్నం పోస్టుమార్టం పూర్తి

ఇదిలా ఉండగా గత రాత్రి ఒంగోలులో హత్య అనంతరం వీరయ్య చౌదరి మృతదేహాన్ని స్థానిక రిమ్స్ మార్చురీలో ఉంచగా బుధవారం 12గంటల ప్రాంతంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఆ సమయంలో రాష్ట్రమంత్రులు వంగలపూడి అనిత, ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామి ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి ఎమ్మెల్యేలు బీఎన్.విజయకుమార్, దామచర్ల జనార్దన్, అశోక్‌రెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ తదితరులు అస్పత్రికి వచ్చారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన అమ్మనబ్రోలు తరలించారు. తొలుత ఎంపీ మాగుంట కార్యాలయంలో వారు భేటీ అయ్యి వీరయ్య హత్య, తదంతర పరిణామాలపై చర్చించారు. అలాగే బుధవారం జరగాల్సిన డీఆర్సీ సమావేశాన్ని రద్దు చేసుకొని అమ్మనబ్రోలు వెళ్లి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఇదిలాఉండగా మధ్యాహ్న సమయంలో అమ్మనబ్రోలుకు వీరయ్య చౌదరి భౌతికకాయం చేరగా వేలాదిగా టీడీపీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. గ్రామంతో పాటు మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన వారితో అమ్మనబ్రోలు గ్రామం జనసంద్రంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చిన సమయంలోనూ గ్రామం జనంతో కిటకిటలాడింది. ఆ ప్రాంతంలో సుపరిచితుడు, రాజకీయంగా బలమైన నాయకునిగా వీరయ్యచౌదరి ఉండటంతో కడసారి తమ నాయకుడిని చూసేందుకు ప్రజానీకం తరలిరావడంతో పాటు అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతిమయాత్రలో రాష్ట్రమంత్రులు, టిడిపి కీలక నేతలతో పాటు వీరయ్య చౌదరి సమీప బంధువైన పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందీశ్వరి ఈ ఘటనపై ఆరాతీశారు. మోహన్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవడంతోపాటు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నిలకడగా హరిబాబు ఆరోగ్యం

ఇదిలా ఉండగా తన మేనల్లుడు వీరయ్యచౌదరి దారుణహత్యతో షాక్ తిని గుండెపోటుకు గురైన జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉంది. గత రాత్రి రిమ్స్ వద్ద వీరయ్యచౌదరి మృతదేహాన్ని చూసి బోరున విలపించిన హరిబాబుకు ఆ వెంటనే అనారోగ్యం పాలయ్యారు. గుండెపోటుగా ప్రైవేటు వైద్యశాల వైద్యులు గుర్తించి తక్షణ చికిత్స చేయడంతో కొంతమేరకు ఉపశమనం లభించింది. అనంతరం మరోసారి కూడా గుండెపోటు రావడంతో ఆందోళన నెలకొంది. వైద్యులు సీపీఆర్ చేసి ఐసీయూలో వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉంది. ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్సపొందుతున్నారు. దీంతో ఆయన వీరయ్య చౌదరి అంత్యక్రియలకు హాజరు కాలేకపోయారు.

వీరయ్య హత్య కేసుపై సీఎం సమీక్ష

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత వీరయ్యచౌదరి భౌతిక కాయాన్ని సందర్శించేందుకు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు విచ్చేశారు. ఈ సందర్భంగా చదలవాడ హెలిప్యాడ్ వద్ద ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. కేసు దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను పట్టుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా ఇప్పటివరకు కేసు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సీఎంవో చీఫ్ సెక్రటరీ ప్రద్యుమ్న, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్‌చంద్ర లడ్హా, లాఅండ్ ఆర్డర్ డీజీ మోహన్‌రెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్.దామోదర్ పాల్గొన్నారు.



చినకొత్తపల్లి రోడ్డు వెంబడి తాటి చెట్లను ఆనుకొని వేసిన స్తంభాలు, విద్యుత్ లైన్‌లు

ఇలా అయితే ప్రమాదాలు జరగవా

చెట్లు తొలగించకుండానే

కొత్త కరెంట్ స్తంభాలు, లైన్‌ల ఏర్పాటు

అద్దంకి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోవడం అనే సామెత విద్యుత్ శాఖకు అక్షరాల వర్తిస్తుంది. పట్టణాలు, గ్రామాలు, వ్యవసాయం, పరి శ్రమలకు నాణ్యమైన విద్యుత్‌ను వేరు వేరుగా అందించేందుకు పెద్ద ఎత్తున కొత్తగా విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అయితే కొత్త విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేసే సమయంలో చిన్న పాటి శ్రద్ధ చూపితే భవిష్యత్‌లో పెద్ద ప్రమాదాలు జరగకుండా ఉండే అవకాశం ఉంది. అయితే నిర్మాణ పనులు చేసే కాంట్రాక్టర్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరించటం, పర్యవేక్షణ అధికారులు పట్టించుకోవకపోవడంతో కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్‌లతో పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అత్యధిక శాతం విద్యుత్ స్తంభాలు ఆయా రోడ్ల అంచునే ఏర్పాటు చేయటం జరిగింది. అదే సమయంలో చినకొత్తపల్లి నుండి కొత్తరెడ్డిపాలెం వైపు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్ తాటిచెట్ల అంచునే ఏర్పాటు చేయడంతో విద్యుత్ తీగలు తాటి చెట్ల ఆకులలో కలిసి పోయాయి. ఇలా ఉండటం వల్ల ఒక లైన్ నుండి మరొక లైన్‌కు విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా పనులు జరిగే సమయంలో అధికారులు ఖచ్చితంగా పర్యవేక్షణ చేసే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సర్పంచ్, పూర్వ పంచాయతీ కార్యదర్శిపై క్రిమినల్ కేసులు

- కలెక్టర్ ఆదేశం
- 7 రోజులలో అపరాధ వడ్డీతో జమ చేయాలని సూచన
- ఆ ఇద్దరిపై బిగిసిన ఉచ్చు



చినకొత్తపల్లి గ్రామ సచివాలయం భవనం

అద్దంకి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన అద్దంకి మండలం చినకొత్తపల్లి సర్పంచ్ గుజ్జుల మల్లిక, అప్పటి పంచాయతీ కార్యదర్శి కె. ఈశ్వరరెడ్డిపై ఉచ్చు బిగిచింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చినకొత్తపల్లి పంచాయతీ పరిధిలో సుమారు రూ.40లక్షలతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌ల నిర్మాణ పనులు జరిగాయి. ఇందుకు సంబంధించి మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.15,74,283 విలువైన మెటీరియల్‌ను టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్ సమకూర్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిధులు విడుదల కాగా, ఆ మొత్తాన్ని మురళీమోహన్‌దాస్‌కు కాకుండా పంచాయతీ సర్పంచ్ మల్లిక సోదరుడు అయిన చంద్రగిరి వీరారెడ్డికి చెల్లించేందుకు బ్యాంక్ నుంచి పంచాయతీ సర్పంచ్, అప్పటి పంచాయతీ కార్యదర్శి (ప్రస్తుతం సంతమాగులూరు మండలం పాతమాగులూరు పంచాయతీ కార్యదర్శి) డబ్బులు డ్రా చేశారు. ఈ నేపథ్యంలో మానం మురళీమోహన్‌దాస్ అప్పటి నుంచి పోరాటం చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మరలా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు కదలి విచారణ చేపట్టారు. వివిధ స్థాయిలలో జరిగిన విచారణ లో నిబంధనలకు విరుద్ధంగా బ్యాంక్ నుంచి డబ్బులు డ్రా చేసి చంద్రగిరి వీరారెడ్డికి చెల్లించినట్లు నిర్ధారణ అయింది. ఇప్పటికే సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయగా, పునరుద్ధరించాలని సర్పంచ్ మల్లిక కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసుకోగా నిరాకరించారు.

వారం రోజుల్లో అపరాధ వడ్డీతో చెల్లించాలని ఆదేశాలు

క్రిమినల్ కేసు నమోదుకు చర్యలు

మెటీరియల్ కాంపోనెంట్ కింద చెల్లించాల్సిన రూ.15,74,283తో పాటు అపరాధ వడ్డీతో సహా వారంరోజులలో పంచాయతీ ఖాతాకు జమచేయాలని కలెక్టర్ వెంటమురళి ఉత్తర్వులు ఇచ్చినట్లు ఎంపీడీవో శింగయ్య తెలిపారు. నిధులు దుర్వినియోగం రుజువు అయిన నేపథ్యంలో సర్పంచ్ మల్లిక, అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిపై క్రిమినల్ కేసుల నమోదుకు చర్యలు చేపట్టాలని చీరాల డీఎల్‌పీవోను కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిని సస్పెండ్ చేస్తూ గతంలో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు ఇచ్చారు. అయితే సస్పెండ్ చేసే అధికారం జిల్లా పంచాయతీ అధికారికి లేదని పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈనేపథ్యంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు రుజువు అయినందున ఎందుకు చర్యలు తీసుకోకూడదో 10 రోజులలోపు సంజాయిషీ ఇవ్వాలని కలెక్టర్ అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డికి నోటీసులు ఇచ్చారు. అటు క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశాలు, ఇటు అపరాధ వడ్డీతో మొత్తం డబ్బులు పంచాయతీ ఖాతాకు జమచేయాలని కలెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చిన నేపథ్యంలో సర్పంచ్, అప్పటి పంచాయతీ కార్యదర్శిపై పూర్తిస్థాయిలో ఉచ్చు బిగిసినట్లు అయింది.

తేజ స్కూల్ జయకేతనం

చీరాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్షల్లో ఈపూరుపాలెంకు చెందిన తేజ స్కూల్ విద్యార్థి కూరపాటి మనీష్ సత్తా చాటాడు. ఏకంగా 593 మార్కులతో విజయ దుందుభి మోగించాడు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్, డైరక్టర్ జశ్వంత్ ప్రత్యేకంగా అబినందించారు.



కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్

టీడీపీ నేత హత్య దుర్మార్గ చర్య

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యంలో కొందరు మానవత్వాన్ని మరిచి, దుర్మార్గాలకు ఒడిగడుతూ పాశవిక దాడులకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. చీరాల నియోజకవర్గ మాజీ ఎన్నికల పరిశీలకుడు, సంతనూతల పాడు నియోజకవర్గం టీడీపీ నేత, పార్టీ అధికార ప్రతినిధి ముప్పవరపు వీరయ్య చౌదరిపై గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడిచేసి హత్య చేయడాన్ని ఎమ్మెల్యే కొండయ్య ఖండించారు. దీనిపై ఆయన స్పందిస్తూ వీరయ్య చౌదరి మృతి పార్టీకి, ప్రజలకు తీరని లోటని అన్నారు. వీరయ్య చౌదరితో అనుబంధం ఉందని, స్నేహభావం ఉన్న వ్యక్తి అని కొండయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈనేపథ్యంలో నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్‌తో కలిసి వీరయ్య అంతిమ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌లో అర్జీల స్వీకరణ

చీరాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : గతకొంత కాలంగా నియోజకవర్గం ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈసందర్భంగా ప్రజల నుంచి పెన్షన్‌లు 50 అర్జీదారులు, నివేశన స్థలాలకు 75, రేషన్ కార్డులకు 5, ఇతర సమస్యలపై ఒక అర్జీని స్వీకరించారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్దనరావు, నియోజకవర్గం నాయకురాలు కొమ్మనబోయిన రజని, రావినూతల నాగేశ్వరరావు తదితర టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

రామాంజనేయపురంలో ఘర్షణ

రెండు సామాజిక వర్గాలపై కౌంటర్ కేసులు

బల్లికురవ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాంజనేయపురం గ్రామంలో బుధవారం రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామంలో ఇళ్ల వద్ద గతంలో పైప్ లైన్ వేయగా పాడు చేశారని అలానే ఒక వర్గానికి చెందిన ఒక మహిళకు మరో సామాజిక వర్గానికి చెందిన ఒక యువకుడు ఫోను చేస్తున్నారని అనే కారణాలతో ఆ రెండు వర్గాల మధ్య వివాదం మొదలై కొట్లాటకు దారితీసింది. సంతమాగులూరు సీఐ, వెంకట్రావు, బల్లికురవ, సంతమాగులూరు ఎస్ఐలు నాగరాజు, పట్టాభిరామయ్య వెంటనే రామాంజనేయపురం వెళ్లి ఇరు వర్గాలవారిని చెదరగొట్టారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం గోరంట్ల వెంకటాద్రి, అంకసాల ఆశోక్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగరాజు కౌంటర్ కేసులు నమోదు చేసి వారిని ఆసుపత్రికి పంపించారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నేతలు ప్రసాద్, హనుమారెడ్డి

మేదరమెట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పొగాకు పండించిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం మేదరమెట్లలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లబర్లీ, వైట్ బర్లీ, వర్జీనియా పొగాకును సాగు చేసిన రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారన్నారు. నల్లబర్లీ పొగాకు ఇంత వరకు కొనుగోలు కాలేదన్నారు. గత రెండు సంవత్సరాల్లో పొగాకు ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు పొగాకు సాగును పెంచారన్నారు. ఈ సంవత్సరం ధరలు పూర్తిగా తగ్గించడంతో పాటు కొనుగోళ్లు మందగించాయన్నారు. గిట్టుబాటు ధరకు పొగాకు కొనుగోలు చేయ్యాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే మే 5న రైతులతో సీఎం కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతామన్నారు. ఆయనతో పాటు సంఘ ఉపాధ్యక్షుడు హనుమారెడ్డి తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రాధామాధవి

పాఠశాలల్లో పిల్లల సంఖ్య పెంచండి

వేటపాలెం (చీరాల), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య పెరిగేలా చూడాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరక్టర్ దొనకొండ రాధా మాధవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ప్రాజెక్టు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలు దాటిన చిన్నారులను అంగన్వాడీలకు, ఐదేళ్లు దాటిన పిల్లలను పాఠశాలల్లో చేర్పేలా పనిచేయాలని సూచించారు. మే 2 నుంచి జూన్ 10 వరకు జరిగే కిషోర బాలికలకు నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సీడీపీవో ఝాన్సీ, డీసీ సురేంద్ర, ఈవో సుజాత, సూపర్‌వైజర్స్ పుష్పవల్లి, కవిత, లీలావతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మేదరమెట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్ల తిమ్మనపాలెం మధ్య రియల్ ఎస్టేట్ వెంచర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. బుధవారం స్థానికులిచ్చిన సమాచారంతో ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహం పాక్షికంగా కుళ్లిన దశలో ఉండగా, చనిపోయి వారం రోజులు అయి ఉంటుందని చెప్పారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

26న వీరాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల

బల్లికురవ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద అంబడిపూడి గ్రామంలోని వీరాంజనేయస్వామి వారి వార్షిక తిరునాళ్ల ఈ నెల 26వ తేదీన జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా టీడీపీ పార్టీ తరపున విద్యుత్ ప్రభను ఏర్పాటు చేస్తున్నామని నాయకులు తెలిపారు.

సత్తాచాటిన మదర్‌థెరిస్సా, శ్రీసాయి

చీరాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ పరీక్షల్లో కొత్తపేట మదర్ థెరిస్సా ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు ఉత్తమంగా రాణించారు. స్కూల్ విద్యార్థిని అక్షయ 589 మార్కులతో విజయ కేతనం ఎగురవేయగా, నూటికి నూరు శాతం విజయం సాధించినట్లు స్కూల్ ప్రతినిధులు తెలిపారు. ఈక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి కిషోర్ కుమార్, డైరక్టర్ అపర్ణాదేవి, ప్రధానోపాధ్యాయిని కృపావరం విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. పది ఫలితాల్లో పేరాల శ్రీసాయి హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. దివ్యసాయి 590 మార్కులు సాధించగా, మరికొందరు 586, 579, 578, 578, 573 సాధించినట్లు తెలిపారు. అలాగే 500కు పైగా మార్కులను 27 మంది సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకటరావు, డైరక్టర్ పద్మజ తదితరులు అభినందించారు.

'పది'లో ప్రభుత్వ విద్యార్థుల విజయఢంకా



హేమలత పందిళ్లపల్లి | హిమబిందు ఈపురుపాలెం | సాయిసంతోష్ మోడల్ స్కూల్ | హర్షిణీ అద్దంకి | తేజయశ్వంత్ శంకవరప్పాడు | సూర్యతేజ తిమ్మయపాలెం

చీరాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన చిన్నారులు విజయఢంకా మోగించారు. వీరిలో అధిక శాతం బాలికలే ఉండడం విశేషం. ఈక్రమంలో పందిళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సజ్జా దివ్యశ్రీ 596, నవ్య సుధ 591 మార్కులు సాధించింది. ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాలకు చెందిన హిమబిందు 592, బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన శశాంక్ 591, ఏపీ మోడల్ స్కూల్ నాగసాయి సంతోష్ 591, కేజీఎం అమర దీపిక, శైలజ మాధురి 581 మార్కులతో రాణించారు. ఎస్ఆర్ అండ్‌పీఎం హైస్కూల్‌కు చెందిన సంతోష్ తేజ 575 సాధించారు. ఆయా పాఠశాల ప్రాంగణాలు బుధవారం సందడిగా మారాయి. ఇదిలావుంటే గురువారం నుంచి జూన్ 11 వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. అయితే జూన్ 4 నుంచే ఉపాధ్యాయులు పాఠశాలలకు రావాల్సి ఉంటుంది. చిన్నారులు వేసవి సెలవులతో బడి నుంచి ఇక ఇంటి బాట పట్టారు.

అద్దంకిటౌన్ : అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.హర్షిణి 593 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. శంఖవరప్పాడుకు చెందిన తేజ యశ్వంత్ 592తో తిమ్మయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అమర శ్రీరామసాయి సూర్యతేజ 590 మార్కులు సాధించి తృతీయ స్థానం సాధించారు.

పంగులూరు : మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలల విద్యార్థులు పదోతరగతి పరీక్షలలో 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆరు ఉన్నత పాఠశాలల నుంచి 392 మంది పరీక్షలకు హాజరు కాగా 318 మంది పాసయ్యారు. చందలూరు పాఠశాలకు చెందిన కట్టా హారిక 590 మార్కులు సాధించి మండలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా, జిర్రా మణిదీపక్ రెడ్డి 586 మార్కులతో ద్వితీయ స్థానం, దీపికారాణి 577 సాధించింది. బూదవాడ ఉన్నత పాఠశాలకు చెందిన దివ్య 585, మురళీకృష్ణసాయి 580, షమీర 574, కొండమంజులూరులో సుమన్‌శ్రీ 578, వీదాద్రి 578, పి.భవ్యశ్రీ 577, బి.పూజ 563, పంగులూరుకు చెందిన కార్తీక్ 565, భార్గవాంజలి 555, వైష్ణవి 555, అఖిల్ బాబు 554, అలవలపాడు ఉన్నత పాఠశాల విద్యార్థి వై.వెంకటేశ్వర్లు 534, ముప్పవరం ఉన్నత పాఠశాల విద్యార్థి చింతల పూజిత 534 మార్కులు సాధించారు.

మేదరమెట్ల : రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని హర్షిత 584 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలలో ప్రథమంగా నిలిచింది. పమిడిపాడు 56 మందికి 53, దైవాలరావూరులో 16కు 15, రావినూతలలో 33కు 28 మంది, తిమ్మనపాలెంలో 33కి 27, మేదరమెట్ల హైస్కూల్‌లో 80కి 52 మంది, కొరిశపాడు ఎయిడెడ్ పాఠశాలలో 9కి 8మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో పున్నయ్య తెలిపారు.

బల్లికురవ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఎంఈవో కె.రమేష్ తెలిపారు. 402 మంది పరీక్షలు రాయగా, 334 మంది ఉత్తీర్ణులు కాగా, 83 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. కొప్పెరపాడు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి చరణ్ తేజ 590 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. నాగ స్రవంతి 586, కేజీబీవీలో 34 మంది రాయగా 32 మంది ఉత్తీర్ణత సాధించి 94 శాతం ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ సరళకుమారి తెలిపారు.

పర్చూరు : పది ఫలితాల్లో పర్చూరు ప్రాంతంలో బాలికలు అత్యధిక మార్కులు సాధించారు. చెరుకూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన మహాలక్ష్మి 592 మార్కులతో నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో నిలిచింది. నాగులపాలెం గురుకుల పాఠశాల విద్యార్థిని జె.గ్రేసి కారుణ్య 586, బాలికల పాఠశాల విద్యార్థిని సమీరా 576, ఉప్పుటూరులో ఎస్.నాగలిఖిత 563 మార్కులతో సత్తాచాటారు.

కారంచేడు : కారంచేడు మండలం కొడవలివారిపాలెంకు జడ్పీ స్కూల్‌కు యహోషువా 557 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడు.

మార్టూరు : టెన్త్‌లో 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వస్రాంనాయక్ తెలిపారు. ద్రోణాదుల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని లక్కి శెట్టి భార్గవి 591 మార్కులతో మండలంలోనే టాపర్‌గా నిలవగా, వలపర్ల హైస్కూల్ విద్యార్థి షేక్ ఫోజియా తబస్సుమ్ 590తో రెండో స్థానం, యశ్విత నాగలక్ష్మి 587 మార్కులతో మూడోస్థానంలో నిలిచినట్లు చెప్పారు. కోలలపూడిలో 41 మందికి 40 మంది, ఇసుకదర్శిలో 32 మందికి 30, మార్టూరులో 170కి 129, బొబ్బేపల్లిలో 41కి 41 మంది పాసయ్యారు.

యద్దనపూడి మండలంలో గురుకుల విద్యార్థి శోభారాణి 582 మార్కులుతో మండలంలో మొదటి స్థానం సాధించింది. యద్దనపూడి హైస్కూల్‌కు విచ్చేసిన డీఈవో పురుషోత్తం, చీరాల ఉపవిద్యాశాఖాధికారి గంగాధర్‌రావు, ఎంఈవో గోపి విద్యార్థులను అభినందించారు.

ఇంకొల్లు : టెన్త్ ఫలితాల్లో మండలంలో 91 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు.

చినగంజాం : 414 మంది విద్యార్థులకు గాను 362 మంది విద్యార్థులు పాసై 87 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో అజయ్‌బాబు తెలిపారు. చినగంజాం జడ్పీ పాఠశాలకు చెందిన మాచవరపు సాహితీ 584, బాలజ్ఞానేశ్వరి 582 మార్కులతో మొదటి, రెండు స్థానాలు సాధించినట్లు తెలిపారు.



హర్షిత రావినూతల | హారిక చందులూరు | మహాలక్ష్మి చెరుకూరు | గ్రేసి కారుణ్య గురుకులం | భార్గవి ద్రోణాదుల | షేక్ ఫోజియా వలపర్ల | విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శింగరకొండ ముఖమండపానికి విరాళాలు

అద్దంకి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండప నిర్మాణానికి బుధవారం దాతలు విరాళాలను అందజేశారు. పట్టణంలో నివాసం ఉంటున్న పంగులూరు మండలం కశ్యాపురానికి చెందిన చల్లగుండ్ల రాఘవయ్యచౌదరి జ్ఞాపకార్థం భార్య విజయకుమారి, కుమారులు నరేంద్రకుమార్, కిషోర్‌బాబు ఈవో తిమ్మానాయుడు కు రూ.1,00,116 అందజేశారు. విజయవాడకు చెందిన మాలంపాటి రామకృష్ణ, సీతాలక్ష్మి దంపతులు రూ.1,00,116 విరాళాన్ని ఈవోకు అందజేశారు.



రూ.లక్ష విరాళాన్ని ఈవో తిమ్మానాయుడుకు అందజేస్తున్న నరేంద్రకుమార్



ఉపాధ్యాయుడు కృష్ణయ్యను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుడికి సన్మానం


బల్లికురవ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు కేఎస్ఆర్ కృష్ణయ్యను బుధవారం పాఠశాలలో తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. వేసవి సెలవుల్లో ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయుడు కృష్ణయ్యను ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం రవిసాగర్ మాట్లాడుతూ వృత్తిలో నిబద్ధత కలిగిన వ్యక్తి కృష్ణయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధూళిపాళ్ల శేషగిరి, శ్రీనివాసరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమంలో సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి, పక్కనే ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్

ఉగ్ర దాడిని ఖండిస్తూ నిరసన

పర్చూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదుల దాడి హేయమైన చర్యని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ అన్నారు. కశ్మీర్‌లోని బైసరన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ జనసేన పార్టీ పిలుపు మేరకు బుధవారం పర్చూరులో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి హాజరయ్యారు. ఈసందర్భంగా బొమ్మల సెంటర్‌లో జనసేనులు చేపడుతు న్న నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జనసేనులు కారంపూడి సందీప్‌తేజ, విన్నకోట అజేయ్, తులసి చంటి, ఆకుల వెంకటేశ్వరరావు, కందా సురేంద్ర బాబు, తులసి అప్పారావు, అచ్చుకోలు సతీష్, తులసి నాగు, రంగిసెట్టి మారుతి తదితరులు పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	39.4	27.4
కావలి	37	27
ఆత్మకూరు	42	26
ఉదయగిరి	41	26
కందుకూరు	37	27



టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు రావడంతో నగరంలోని కేఎన్ఆర్ మున్సిపల్ పాఠశాలలో విద్యార్థుల కోలాహలం

పదిలోనూ మెరిసి!

- ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లాకు 13వస్థానం
- 23,633 మంది విద్యార్థుల ఉత్తీర్ణత
- ఈసారీ బాలికలదే హవా!

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా 13వ స్థానంలో నిలిచింది. గత ఏడాది జిల్లాకు 15వ స్థానం దక్కగా, ఈ ఏడాది ఫలితాల ఉత్తీర్ణతలో రెండు స్థానాలు ఎగబాకింది. అయితే గతేడాది సాధించిన 88.17 శాతం కంటే కొంత తక్కువగా 83.58 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఎప్పటిలాగే ఈసారి కూడా బాలికలు తమ హవాను ప్రదర్శించారు. జిల్లాలో ఏపీ మోడల్ స్కూల్స్ 2, ఏపీఆర్ఈఐ సొసైటీ స్కూల్ 1, ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈఐ సొసైటీ స్కూల్ 1, కేజీబీవీలు 3, జిల్లా పరిషత్ 16, ప్రైవేట్ అన్ఎయిడెడ్ 83 కలిపి మొత్తం 106 పాఠశాలలు వందశాతం ఫలితాలు సాధించాయి.

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు 28,275 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షకు హాజరవగా 23,600 మంది ఉత్తీర్ణత (83.58 శాతం) సాధించారు. వీరిలో బాలురు 14,142 మందికి 11,150 మంది (81.39 శాతం), బాలికలు 14,133 మందికి 12,123 మంది (85.78 శాతం) ఉత్తీర్ణత పొందారు. బాలుర కంటే బాలికలే మెరుగైన ఫలితాలు దక్కించుకున్నారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి డీఈఓ బాలాజీరావు ఆదేశాలకు అనుగుణంగా కట్టుదిట్టం చేశారు. ఆయా యాజమాన్యాల విద్యార్థులు తమ శక్తి మేరకు విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో గతంలో కంటే ఈ ఏడాది అత్యధికంగా ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత పొందారు.

అత్యధిక మార్కులు వీరికే..

నెల్లూరు శివార్లలోని రామలింగాపురానికి చెందిన గొల్లా దీక్షితప్రియ 598 మార్కులతో అగ్రస్థానంలో నిలిచింది. అలాగే కాట్రగడ్డ కుందన వర్షిత 597, ఇన్నమూరి తన్వి 597, కంచిబొట్ల సాయి బిల్వేష్ 597, కాకులూరు భవ్యశ్రీ 597, కోవూరు విద్యార్థి పల్లంరెడ్డి ఇందుప్రియారెడ్డి 597, నెల్లూరు నగరంలోని బండ్ల రోహన్ వరుణ్ 597, సాయా చరణి 596, కొత్తపాటి జీతు 596, వాకా ప్రలేఖ్యరెడ్డి 596 అత్యధిక మార్కులు సాధించారు.

మేనేజ్‌మెంట్ల వారీగా ఫలితాలు

మేనేజ్‌మెంట్	విద్యార్థులు	ఉత్తీర్ణత	ఫెయిల్	శాతం
ఏపీ మోడల్	774	707	67	91.34
ఏపీబీసీ వెల్ఫేర్	110	106	4	96.36
ఏపీఆర్ఐఈ సొసైటీ	261	248	13	95.02
ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈఐ	642	590	52	91.09
ఏపీటీడబ్ల్యుఆర్ఈఐ	256	188	68	73.44
కేజీబీవీలు	428	394	34	92.06
మునిసిపాలిటీ	1708	1147	561	67.15
ఎయిడెడ్	405	230	175	56.79
ప్రభుత్వ	879	551	328	62.68
ట్రైబుల్ ఆశ్రమం	60	58	2	96.97
జడ్పీ	10,071	7,414	2,657	73.62
ప్రైవేట్అన్ఎయిడెడ్	12,681	2,000	681	94.63
మొత్తం	28,275	23,633	4,642	83.58

● ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో..

నెల్లూరులోని బీవీనగర్ మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సాయా చరణి 596, కృష్ణానగర్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన మల్లెల పూజిత 595, నవాబుపేట బీవీఎస్ఎం బాలికోన్నత పాఠశాలకు చెందిన దోనపర్తి సుచరిత 594, బీవీనగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన కీర్తిపాటి హిమవర్షిణి 594, నవలాకులతోట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మహ్మద్ జువేరియా 594, నవాబుపేట బీవీఎస్ మునిసిపల్ బాలికోన్నత పాఠశాలకు చెందిన పోతురాజు జస్సికాషారోన్ 593, బీవీనగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన దువ్వూరు స్నిగ్ధ 593, నవాబుపేట ఎంపీఎల్‌సీ ఉన్నత పాఠశాలకు చెందిన కండే సూర్య 593 మార్కులు సాధించారు.

● పదోతరగతి ఫలితాల్లో గత ఏడాది 20,201 మంది ప్రథమస్థానం సాధించగా ఈ ఏడాది 19,745 మంది ప్రథమ స్థానం దక్కించుకున్నారు. అలాగే 2,622 మంది ద్వితీయ, 1,266 మందికి తృతీయ స్థానాలు దక్కాయి. 500-550 మార్కులలోపు 5,047 మంది, 551-560 లోపు 1,085 మంది, 561-570 లోపు 1,098 మంది, 571-580 లోపు 1,058 మంది, 581-590 లోపు 858, 591-600 లోపు 260 మంది కలిపి 9,406 మంది ఉత్తమ మార్కులు సాధించారు. అలాగే ఏపీఎంఎస్‌లో 212 మంది, ఏపీబీఎస్ వెల్ఫేర్స్‌లో 58మంది, ఏపీఆర్ఈఐ సొసైటీలో 100మంది, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌లో 189 మంది, ఏపీటీడబ్ల్యూఆర్‌లో 18 మంది, ట్రైబుల్ ఆశ్రమంలలో ఆరుగురు, కేజీబీవీల్లో 96 మంది, జడ్పీలో 1,392 మంది, మున్సిపాలిటీల్లో 294 మంది, ఎయిడెడ్‌లో 21 మంది, ప్రభుత్వ పాఠశాలల్లో 87 మంది, ప్రైవేట్ అన్ఎయిడెడ్‌లో 6,933 మంది కలిపి మొత్తం 9,406 మంది విద్యార్థులు 500లకుపైగా మార్కులు సాధించారు.

● రీకౌంటింగ్-రీవెరిఫికేషన్‌కు సూచనలు

పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు తమ జవాబుపత్రాల రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకునేవారు ఈనెల 24 నుంచి మే 1వతేదీ రాత్రి 11 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. రీకౌంటింగ్ ఒక్కో సబ్జెక్టుకు రూ.500, జవాబు పత్రాల రీ వెరిఫికేషన్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.1000లను చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా పరీక్షల విభాగం కార్యాలయం, సంబంధిత పాఠశాలల్లో సంప్రదించాలని తెలిపారు.

● మే 19 నుంచి సప్లిమెంటరీ

పదోతరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను మే 19 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఓ బాలాజీరావు తెలిపారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఏప్రిల్ 24 నుంచి 30వతేదీలోగా ఎలాంటి అపరాధ రుసుం ఫీజులు చెల్లించాలన్నారు. అలాగే రూ.50 అపరాధ రుసుముతో మే 1 నుంచి 5వతేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. సప్లిమెంటరీ పరీక్షలకు మూడు సబ్జెక్ట్‌లకు రూ.110, మూడు సబ్జెక్ట్‌లకుపైన రూ.125 ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలు పాఠశాలల్లో హెచ్ఎంలను సంప్రదించాలని తెలిపారు.

హాస్టల్ విద్యార్థుల ఘనత

నెల్లూరు (హరనాథపురం) : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. బీసీ సంక్షేమ వసతి గృహాల్లో 551 మందికి 473 మంది ఉత్తీర్ణత సాధించారు. వింజమూరు బీసీ వసతి గృహ విద్యార్థిని పి.వైదిక్ 584, ఆత్మకూరులో షేక్.సల్మా 583, లింగసముద్రంలో సాయిమేఘన 581, కందుకూరులో యశస్విని 576, అనంతసాగరంలో ఈవీ.నిషాల్‌రెడ్డి 573 మార్కులు సాధించారు.

● సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మొత్తం 402 మందికి 322 మంది ఉత్తీర్ణులయ్యారు. వింజమూరులో ఏ.నందిని 574, లింగసముద్రంలో కె.పృథ్వి 571, ఉలవపాడులో ఎస్.కాజోల్ లక్ష్మి అగర్వాల్ 568, ఎం.సంధ్యారాణి 557, ఆత్మకూరులో ఎం.సాయిధనుష్ 565 మార్కులు సాధించారు.

● డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 642 మందికి 590 మంది ఉత్తీర్ణత సాధించారు. పెద్దపవనిలో ఎస్.కవిత 593 మార్కులు సాధించింది.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రాణిస్తా



నగరంలోని ఏసీ నగర్‌కు చెందిన తాను తల్లిదండ్రులు రాధ, గోపాల్ సహకారం, ఉపాధ్యాయులు అందించిన ఉత్తమ బోధనతోనే ఈ ఫలితాలను సాధించాను. అందరి ఆశయాలకు అనుగుణంగా భవిష్యత్‌లో విద్యలో మరింత ఉత్తమంగా రాణించి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రాణిస్తాను.

- ఓ.దీక్షిత, 598 మార్కులు

సివిల్స్ సాధించడమే లక్ష్యం



నగరంలోని బీవీనగర్‌లో నా తల్లిదండ్రులు వసంతకుమారి, శివకుమార్ అందించిన ప్రోత్సాహం, గురువులు అందించిన ఉత్తమ విద్యా ప్రమాణాలతోనే ఈ ఫలితాలు సాధించాను. భవిష్యత్‌లో సివిల్స్ సాధించేందుకు మరింత కష్టపడి చదువులో రాణిస్తాను.

- సాయా చరణి, 596 మార్కులు

ఐఐటీలో సీటు సాధిస్తా



గురువులు అందించిన విద్య, తల్లిదండ్రులు సుధా మాధురి, మాధవన్ అందించిన ప్రోత్సాహంతోనే టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాను. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో ఉత్తమ ప్రతిభతో రాణించి ఐఐటీలో సీటు సాధిస్తాను.

- ఎం.నారాయణ్, 595 మార్కులు

ప్రభుత్వ సెక్టార్‌లో ఉండేందుకే..



తల్లిదండ్రులు, గురువుల సహకారంతోనే 596 మార్కుల సాధించాను. భవిష్యత్తులోనూ ఉన్నత చదువులు పూర్తి చేసి, సివిల్స్‌కు ఎంపికవుతా. ప్రజలకు సేవలందించేందుకు ప్రభుత్వ సెక్టార్‌లో మంచి ఉద్యోగం సాధిస్తాను.

- ఎస్‌కే అఫ్రీన్‌తాజ్, 596 మార్కులు, చేజర్ల

ఇంజనీరింగ్ ధ్యేయం



మాది కొడవలూరు మండలం గుండాలమ్మపాలెం. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన నేను తల్లిదండ్రుల ఆకాంక్ష నెరవేరేలా ఉన్నత విద్యా సంస్థల్లో ఉన్నత విద్య చదివి ప్రయోజకురాలిని కావాలన్నదే నా లక్ష్యం. ఐఐటీలో ఇంజనీరింగ్ సీటు సాధించడమే ధ్యేయం. ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే ఈ మార్కులు సాధించాను.

- ఇందుప్రియారెడ్డి, 597 మార్కులు

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా..



ఐఐటీ బీటెక్ చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలన్నదే నా లక్ష్యం. ఇంటర్‌లో ఎంపీసీ చదివి ఆ తర్వాత ఐఐటీలో బీటెక్ చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా.

- మండలపు లిఖిత, 595 మార్కులు

కేజీబీవీలో ఉత్తమ ఫలితాలు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఎస్ఎస్ఏ ఏపీసీ వెంకటసుబ్బయ్య తెలిపారు. జిల్లాలోని 12 కేజీబీవీల్లో 428 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరవగా 394 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వలేటివారిపాలెంలో జి.వైష్ణవి 573, లింగసముద్రంలో ఎం.అమృతప్రియ 569, కలిగిరిలో పి.మహిమ 567 మార్కులు సాధించారన్నారు. 96 మంది 500లకుపైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. జీసీడీఓ టి.మమత, ప్రిన్సిపాళ్లతోపాటు విద్యార్థినులను ఆయన అభినందించారు.



'కన్నవారన్నా.. తోబుట్టువులన్నా ఆయనకు ప్రాణం. అందుకేనేమో వృద్ధాప్యంలో తల్లిదండ్రులను వీడలేక అమెరికాలో ఉన్నత కొలువును కూడా కాదనుకున్నాడు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా వారంలో మూడు రోజులు తల్లిదండ్రులతో ఉంటూ వారి బాగోగులు చూసుకోవడమే కాదు.. తండ్రి వ్యాపార లావాదేవీలు చూసేవారు. ఇక భార్య పిల్లలతోనూ ఎంతో ఆప్యాయంగా ఉండే ఆయన ఉగ్రదాడికి బలయ్యాడు. కశ్మీర్‌లో మంగళవారం ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో కావలికి చెందిన మధుసూదన్‌రావు మృతి చెందారు. ఈ విషయం బుధవారం వెలుగులోకి రావడంతో ఇరు కుటుంబాలు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయాయి. బిడ్డ మృతి విషయం తెలిస్తే ఆ వృద్ధ దంపతులు ఏమవుతారేమోనన్న భయంతో వారికి తెలియకుండా లోలోన కుమిలిపోతూ ఉబికి వస్తున్న కన్నీళ్లను దాచుకుంటూ గడుపుతున్నారు.



మధుసూదన్‌రావు (ఫైల్)

ఉగ్రతూటా కల్లోలం

- కశ్మీర్ ఘటనలో కావలివాసి దుర్మరణం
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న బంధువులు
- తల్లిదండ్రులకు తెలుపకుండా జాగ్రత్తలు
- వివరాలు సేకరించిన అధికారులు, పోలీసులు
- మధుసూదన్ మృతదేహం కోసం చెన్నై వెళ్లిన తహసీల్దారు

కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్





మధుసూదన్‌రావు ఇంటి వద్ద పోలీసుల బందోబస్తు

కావలి, కావలి రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మేదరబజార్‌లో అరటికాయల వ్యాపారం చేస్తున్న సోమిశెట్టి తిరుపాల్, పద్మావతి దంపతులకు ఓ కుమారుడు మధుసూదన్‌రావు, ఇద్దరు కుమార్తె విజయలక్ష్మి, మంజుల ఉండగా, అందరికీ పెళ్లి ళ్లు అయ్యాయి. బీటెక్ పూర్తి చేసిన మధుసూధన్‌రావు (42) బెంగళూరులోని ఐబీఎం కంపెనీలో సీనియర్ ఆర్కిటెక్‌గా పని చేస్తున్నారు. తల్లిదండ్రులతోపాటు తోబుట్టువులతోనూ ఎంతో ఆప్యాయంగా ఉండేవాడని బంధువులు తెలిపారు. టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నెల్లూరుకు చెందిన ప్రసన్నకామాక్షితో వివాహం కాగా వీరికి మేధశ్రీ (16), దత్తసాయి (11) పిల్లలు ఉన్నారు. బెంగళూరులోని రామ్మూర్తినగర్, కమ్మనహల్లిలో సొంతిల్లు నిర్మించుకుని స్థిరపడ్డారు. మధుసూదన్‌రావు తోబుట్టువులు కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా బెంగళూరులోనే ఉంటున్నారు.

● కన్నవారి కోసం అమెరికాకు వెళ్లకుండా..

ఉద్యోగ రీత్యా మధుసూదన్‌రావు కొంతకాలం అమెరికాలో ఉన్నారు. అయితే కరోనా సమయంలో భారత్‌కు వచ్చిన ఆయన తల్లిదండ్రుల బాగోగులు చూసేందుకు అమెరికాకు వెళ్లకుండా బెంగళూరులోనే స్థిరపడ్డారు. వారానికి మూడు రోజులు మాత్రమే బెంగళూరులో ఉంటూ మిగిలిన సమయంలో కావలిలో తల్లిదండ్రుల వద్ద ఉంటూ వారి యోగక్షేమాలు చూస్తుంటారు.

● కుటుంబానికి చేదోడుగా

తండ్రి తిరుపాల్‌కు గుండె శస్త్రచికిత్స, తల్లి పద్మావతికి అనారోగ్యం కారణంగా తరచూ మధుసూదన్‌రావు కావలికి వచ్చేవారు. తల్లిదండ్రుల యోగక్షేమాలతోపాటు అరటికాయల వ్యాపార లావాదేవీలు చూసేవారు. ఈ క్రమంలో తల్లిదండ్రులను వైద్యశాలలో చూపించి ఈ నెల 18వ తేదీన తిరిగి బెంగళూరుకు వెళ్లిన మధుసూదన్‌రావు 20వ తేదీ రాత్రి కుటుంబంతో కలసి కశ్మీర్ విహారయాత్రకు వెళ్లారు.

● అధికారులకు సహకారం

అన్న మృతి వార్త తెలిసిన చెల్లెళ్లు విజయలక్ష్మి, మంజుల హుటాహుటిన బుధవారం ఉదయానికల్లా కావలి చేరుకున్నారు. తల్లిదండ్రులు హృద్రోగులు కావడంతో అన్న మృతి వార్త తెలపకుండా గాయపడినట్లు చెబుతూ వచ్చారు. ఇంట్లో టీవీ, ఫోన్లు బంద్ చేసి తల్లిదండ్రులకు అనుమానం రాకుండా బాధను దిగమింగుతూ లోలోన కుమిలి పోయారు. ఇంటికి ఎవరినీ రానివ్వకుండా చూడాలని పోలీసులను కోరడంతో వీధికి అడ్డంగా బారికేడ్లు పెట్టారు. కావలి సీఐ ఫిరోజ్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్ కుమార్ మధుసూదన్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడారు. తహసీల్దారు శ్రావణ్ కుమార్ మృతుడి బంధువుల నుంచి వివరాలు సేకరించారు. కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీకృష్ణ సూచనలతో వైద్యుల ను ఏర్పాటు చేశారు. ప్రత్యేక విమానంలో చెన్నై వస్తున్న మధుసూదన్ రావు మృత దేహాన్ని కావలి చేర్చేందుకు తహసీల్దారు చెన్నై వెళ్లారు.

కాంగ్రెస్, జనసేన కొవ్వొత్తుల ప్రదర్శన



నెల్లూరు (వైద్యం) : జమ్మూ కశ్మీర్‌లోని ప్రహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల కాల్పులను నిరసిస్తూ బుధవారం సాయంత్రం నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలిలో కాంగ్రెస్, జనసేన పార్టీల నాయకులు వేర్వేరుగా కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఉగ్రవాదులను వెంటనే పట్టుకుని తుదముట్టించాలంటూ కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. ఈ నిరసనలో కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు సంజయ్‌కుమార్, నగర ప్రధాన కార్యదర్శి సుధీర్, నాయకులు ఇర్ఫాన్, అల్లాఉద్దీన్, మల్లికార్జునరెడ్డి, రెహమాన్, ధనుంజయ్, సుజాత, బక్షు, నదీమ్, ముస్తాక్, వెంకటేశ్వరరెడ్డి, హనీఫ్, అమీర్, లక్ష్మి, చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఆ పార్టీ జిల్లా, నగర కార్యాలయాల్లో జనసేన జెండాను అవనతం చేశారు. అనంతరం సాయంత్రం గాంధీబొమ్మ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపి ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన అమాయకులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, దుగ్గిశెట్టి సుజయ్‌బాబు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	106
స్కిన్ చికెన్	194
స్కిన్‌లెస్	214
కోడిగుడ్ల ధర (100):	420

కశ్మీర్‌లో ఉగ్ర దాడి హేయం : ఎమ్మెల్యే

కావలి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి హేయమైన చర్య అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో ఖండించారు. ఇటువంటి కిరాతక చర్యలు భారత ప్రజల సమైఖ్యతను, ధైర్యాన్ని ఎన్నటికీ దెబ్బతీయలేవని పేర్కొన్నారు. ఈ దాడికి బాధ్యత వహిస్తున్న ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ ఉగ్రవాద దాడిలో కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదన్‌రావు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని వ్యక్తం చేశారు. గురువారం కావలిలో జరిగే అంత్యక్రియల్లో తాను పాల్గొంటానని, కావలి ప్రజలు కూడా పాల్గొని ఆ కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని తెలిపారు.

న్యూస్ బాక్స్

అన్నపుగుంటలో పూడికతీత పనుల ప్రారంభం


పూడికతీతకు సిద్ధం చేసిన ఎక్స్‌కవేటర్, ఆయిల్ ఇంజన్లు

కావలి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైకుంఠపురంలో ఉన్న అన్నపుగుంటలో పూడికతీత పనులను బుధవారం కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. అన్నపుగుంటలో మురుగు నీరు నిల్వ ఉంటున్నందున ఆ ప్రాంతంలోని బావులు, బోర్లలో మంచినీరు కలుషితమవుతుందని ఇటీవల ఆ ప్రాంత ప్రజలు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయం జిల్లా కలెక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లి పూడికతీత పనులకు రూ.20 లక్షలు మంజూరు చేయించారు. దీంతో ఆ నిధులతో అన్నపుగుంటలో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. అక్కడ ఉన్న మురుగు నీరు బయటకు తోలేందుకు అవసరమైన ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసి పూడిక తీసేందుకు ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు డీఈ సాయికుమార్, టీడీపీ నాయకుడు దామా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే వ్యక్తి సమగ్ర వికాసం సాధ్యం

కావలిటౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వ్యక్తి సమగ్ర వికాసం పుస్తక పఠనంతోనే సాధ్యమని జేబీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు పేర్కొన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా బుధవారం జేబీ టాంపో గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రిన్సిపాల్ పాల్గొని మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా పుస్తక పఠన పరిజ్ఞానం మూలమన్నారు. వీఎస్‌యు కళాశాల గ్రంథాలయాధికారి పాపయ్య మాట్లాడుతూ మనో వికాసానికి వ్యక్తిత్వ వికాసానిని పుస్తకాన్ని మించిన ప్రత్యామ్నాయం మరొకటి లేదన్నారు. జూనియర్ కళాశాల గ్రంథాలయాధికారి కె బ్రహ్మానందం, నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట ఎరువులు

ఉలవపాడు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలంలో మట్టి నమూనా, పండ్ల తోటల్లో పచ్చి రొట్ట ఎరువుల వినియోగంపై బుధవారం మన్నేటికోట గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారిణి తిరుమల జ్యోతి తెలిపారు. జనుము, జీలుగా, పిల్లిపెసర 50 శాతం రాయితీతో ప్రస్తుతం రైతులకు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కావలసిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల వద్ద డబ్బు చెల్లించిన విత్తనాలు తెప్పించి పంపిణీ చేస్తామన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉలవపాడు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మండలానికి 29 యూనిట్స్ కేటాయించినట్లు ఎంపీడీవో ఎస్ విజయ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కులాలకు చెందిన 21 సంవత్సరాలు పైబడి 50 లోపు ఉన్న అర్హులైనవారు స్థానిక సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్‌ని సంప్రదించి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే నెల 10వ తేది దరఖాస్తు చేసుకొనుటకు చివరి రోజు అని తెలిపారు.

నేడు జువ్వలదిన్నెలో అవగాహన

బిట్రగుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీలో జాతీయ విపత్తుల నిర్వాహణలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించనున్నట్లు తహసీల్దారు సురేష్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, విద్యుత్, నీటిపారుదల, పంచాయతీరాజ్, రవాణా, ఆరోగ్య, రోడ్లు, భవనాలు, మత్స్యశాఖల అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులకు కావలి ఆర్డీవో సన్నివంశీకృష్ణ విపత్తులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియచేస్తారని తెలిపారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు


వలేటివారిపాలెం హైస్కూల్‌లో లక్ష్మీశ్రీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కందుకూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో మోడల్ స్కూళ్లు, గురుకులాలు, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. కందుకూరు మండలంలోని జీ.మేకపాడులోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు 34 మందికి 31మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ దాస్ తెలిపారు. పట్టణంలోని కేజీబీవీ విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ స్వాతి తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణత

వలేటివారిపాలెం : మండలంలోని చుండి మోడల్‌స్కూల్, కేజీబీవీ, పోకూరు, నలదలపూరు, శాఖవరం హైస్కూల్ తదితర పాఠశాలల విద్యార్థులు 10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో మల్లికార్జునరావు తెలిపారు. లో 17 మందికి గానూ 17 మంది విద్యార్థులు ఉతీర్ణులయినట్లు తెలిపారు. వలేటివారిపాలెం హైస్కూల్ విద్యార్థిని గొర్రెపాటి లక్ష్మీశ్రీ 592 మార్కులు, చుండి మోడల్‌స్కూల్ విద్యార్థిని బోడా నవ్యశ్రీ 592 మార్కులు సాధించింది. పోకూరు సాయిసిద్ధార్థ హైస్కూల్ విద్యార్థి రజిత 593 మార్కులు సాధించింది. వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

గుడ్లూరులో 98 శాతం..

గుడ్లూరు : మండలంలోని గుడ్లూరు, బసిరెడ్డిపాలెం, చినలాటరపి జడ్పీ ఉన్నత పాఠశాలలు, మొగళ్లూరు కేజీబీవీ విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 72 శాతం..

అల్లూరు : ఇస్కపల్లి, అల్లూ రు, నార్తుమోపూరు జడ్పీ పాఠశాలలు, రామకృష్ణ పాఠశాలకు సంబంధించి 72 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో రవీంద్రనాథ్ తెలిపారు.

కొండాపురంలో 81 శాతం..

కొండాపురం : మండలంలోని 10 జడ్పీ ఉన్నత పాఠశాలలతోపాటు, ఆదర్శ, కేజీబీవీ పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు 81 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖాధికారులు కె.రవికుమార్, ఆనందరావులు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

కలిగిరి మోడల్ స్కూల్ టాప్

కలిగిరి : ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చాటినట్లు ప్రిన్సిపాల్ ఏ శ్రీను తెలిపారు. జడ్పీ హైస్కూల్‌లో 78 మందికి 59మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

ఉలవపాడు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. రామాయపట్నం జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎందేటి మౌనిక 583 మార్కులతో మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించింది. మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 88.7 శా తం ఉత్తీర్ణత సాధించడం పట్ల ఎంఈవో-2 రమణయ్య విద్యార్థులకు అభినందనలు తెలిపారు. సెయిం ట్ జోసె ఫ్ స్కూల్ విద్యార్థి చేజర్ల వెంకట రామిరెడ్డి 592 మార్కులతో మండలం మొదటి స్థానంలో నిలిచాడు.

బోగోలులో 72 శాతం...

బిట్రగుంట : బోగోలు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో 72.35 శాతం ఉతీర్ణత సాధించినట్లు ఎంఈవోలు నరసింహారావు, జయమ్మలు తెలిపారు. అలాగే దగదర్తి మండలంలో 92 శాతం ఉతీర్ణత సాధించినట్లు ఎంఈవో భాస్కర్ తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు
- రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ


రైతులకు రోటావేటర్, గొర్రులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని అంకభూపాలపురం, అయ్యవారిపల్లె గ్రామాల్లో ఉపాధి నిధులు రూ.90 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాలను బుధవారం ఆయన ప్రారంభించారు. అలాగే అంకభూపాలపురంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును, గోకులం, గొర్రెల షెడ్డులను ప్రాంభించారు. ఐదుగురు రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ గ్రామాల్లో మౌలిక వసతులను పట్టించుకోలేదని తెలిపారు. డ్రైనేజీల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు పేదలకు సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తునట్లు తెలిపారు. అంకభూపాలపురంలో డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాదికారులకు పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనుమతులు రాగానే 15వ ఆర్థిక సంఘం నిధులతో డ్రైనేజీలు నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్, అగ్రికల్చరల్ ఏడీ అనసూయ, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసులు, ఏపీడీ బాబూరావు, ఏవో హేమంత్‌భరత్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు ప్రగడ నరసింహం, ప్రగడ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడులకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడులకు నిరసనగా బుధవారం రాత్రి కందుకూరు పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న ప్రకాశం పంతులు విగ్రహం దగ్గర నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ఉగ్రదాడిలో వీరమరణం పొందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దేశంలో ఉగ్రవాదం లేకుండా సమూలంగా నాశనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ సమన్వయ కర్త గట్టమనేని హరిబాబు, బీజేపీ అనుబంధ సంఘాల నాయకులు గంగవరపు రామారావు, మన్నేపల్లి వరప్రసాదరావు, జొన్నాదుల సురేష్, మురళీధర్, పొణ్యం గాంధీ, చల్లా వెంకటరాజా, కూచిపూడి డేవిడ్, డాక్టరు తన్నీరు మల్లికార్జున, మంచిరాజు మురళి, చెక్కా వెంకటకేశవరావు, సుబ్రహ్మణ్యం, కొత్త శ్రీనివాసులు, చిన్నిపాండు రంగయ్య, మాల్యాద్రినాయుడు, తానికొండ కోటయ్య, రామలింగేశ్వరరావు, సాధు మాల్యాద్రి, నవులూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కలుగోళ్లశాంభవి ఆలయ హుండీ లెక్కింపు


హుండీలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

కావలి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలుగోళ్ల శాంభవి ఆలయంను దేవాదాయశాఖలో విలీనం చేసిన తర్వాత తొలిసారిగా ఆశాఖ ఆధ్వర్యంలో బుధవారం హుండీ లెక్కింపు చేట్టారు. దేవదాయ శాఖ కోవూరు ఈవో కృష్ణప్రసాద్, బిట్రగుంట ఈవో కావలి ఇన్‌చార్జి రాధాకృష్ణ, దేవస్థాన దర్మకర్తలి మండలి సభ్యులు కసవరాజు కృష్ణమోహన్ పర్యవేక్షణలో భక్తులు హుండీ లెక్కింపు చేట్టారు. 18 నెలలకు హుండీ రాబడి రూ.5,10,190 వచ్చినట్లు తెలిపారు.

సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభకు సత్కారం



సీనియర్ సివిల్ న్యాయాధికారిని సత్కరిస్తున్న న్యాయాధికారులు, న్యాయవాదులు

కావలి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కావలి సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.శోభ కందుకూరుకు బదిలీ కావడంతో కావలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియన్ అధ్యక్షుడు కాటా సురేంద్రరెడ్డి మాట్లాడుతూ సివిల్ న్యాయాధికారి శోభ మూడేళ్లలో అనేక క్లిష్టమైన కేసులను పరిష్కరించి కక్ష్యదారులకు సత్వరన్యాయం అందించారన్నారు. న్యాయవాదులతో స్నేహపూర్వహక వాతావరణంలో ఉంటూ పెండింగ్‌లో ఉన్న పాత కేసులను కూడా పరిష్కరించటంలో చొరవ చూపారన్నారు. మండల న్యాయసేవాధికారిగా లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించారని కొనియాడారు. సన్మాన గ్రహీత సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.శోభ మాట్లాడుతూ న్యాయవాదులు సహకారం వలననే తాను కావలిలో క్లిష్టమైన కేసులు కూడా పరిష్కరించగలిగానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఈ.సుధాకర్, మెజిస్ట్రేట్ విక్రమసిన్హా, సీనియర్ న్యాయవాదులు దేవరపల్లి వేణుగోపాల్‌రెడ్డి, కలీంరోజ్‌దార్ అహ్మద్, కలికి శ్రీనివాసులురెడ్డి, జీ. రాజేంద్రవరప్రసాద్, కే. చక్రపాణి, కెన్నడీ, పువ్వాడ ప్రసాద్, పీవీ శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి ఘన సన్మానం


భీమేశ్వరరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో బుధవారం జరిగిన హెచ్‌ఎం శిరోభూషణం భీమేశ్వర ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైపుణ్యం పెంపొందించడానికి కృషి చేశారని కొనియాడారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితంలో ఒక భాగమని, విశ్రాంత సమయంలో ఆరోగ్యంగా జీవించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు


ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ప్రాంతీయ రవాణాశాఖ అధికారి టీవీఎస్ లక్ష్మి

కందుకూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే వాహన చోదకులపై కఠిన చర్యలు తప్పవని కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టీవీఎస్ లక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని పామూరురోడ్డు సర్కిల్‌లో బుధవారం సాయంత్రం ఆమె ప్రత్యేక వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించిన ఆమె ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే వారు విధిగా సీటుబెల్టు ధరించాలని సూచించారు. సీటు బెల్టు లేకుండా నడుపుతున్న రెండు కార్లు, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించిన రెండు ఆటోలు, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా నడుపుతున్న ఓ ట్రక్కుపైన ఆమె కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా రహదారి భద్రతపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు.

రైతులు మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలి


మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారి సైదా

కొండాపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తమ భూముల్లో మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి చంద్రభాను తెలిపారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పార్లపల్లి, సత్యవోలు పంచాయతీల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 1014 మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయడం లక్ష్యంగా నిర్ణయించామన్నారు. మట్టి పరీక్షలతో భూమిలోని లోపం గుర్తించి నివారించుకునేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు లక్ష్మీప్రసన్న, సుమతి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరాలి


లింగసముద్రం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

లింగసముద్రం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు తెలిపారు. బుధవారం లింగసముద్రంలోని ప్రాథమిక పాఠశాలలో జరిగిన వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇటీవల స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో కాంప్లెక్స్ స్థాయిలో జరిగిన టాలెంట్ టెస్ట్‌లో ఆ పాఠశాల నుంచి విజేతలుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు ఎంఈవో-2 శివకుమార్, కాంప్లెక్స్ చెర్మన్ యుమాధవరావు, హెచ్‌ఎం ఎం సుధాకర్, ఉపాధ్యాయులు కె వెంకటేశ్వర్లు, ఇన్నాసమ్మ, షాహిద్దీన్, సుజాత తదితరులతో కలసి ఎంపీడీవో బహుమతులు అందజేశారు.

వేగంగా కావలి కాలువ పూడికతీత పనులు


వేములపాడు వద్ద కావలి కాలువలో పూడిక తీస్తున్న భారీ ఎక్స్‌కవేటర్

జలదంకి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సాగునీటి వనరుల మరమ్మతులను గాలికొదిలేసింది. చెరువులు, సోమశిల ప్రాజెక్టు కింద ఉన్న కాలువలపై ఉన్న తూములకు ఏర్పాటు చేసిన గేట్లు రిపేర్లు చేయకుండా సాగునీటిరంగాన్ని పూర్తిగా విస్మరించింది. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ సోమశిల రిజర్వాయరు పరిధిలోని కావలి కాలువ. ఈ కాలువ కింద లక్ష ఎకరాల ఆయకట్టు ఉండగా, ఐదేళ్ల వైసీపీ పాలనలో తట్టమట్టి పూడిక తీసిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సాగునీటి రంగంపై దృష్టి పెట్టి ఎక్కడికక్కడ పంటకాలువలు, చెరువలు మరమ్మతులు చేయాలో గుర్తించి పనులు చేయిస్తోంది. ఇందులో భాగంగా కావలి కాలువకు రూ.4కోట్లను పూడికతీత పనులకు కేటాయించి యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించింది. మే5వతేదీలోపు ఈ పనులు పూర్తి చేసి ఐఏబీలో నిర్ణయించిన ప్రకారం రెండోపంటకు కావలికాలువకు సాగునీరు ఇచ్చే లక్ష్యంతో పనులను ఇంజనీర్లు చేయిస్తున్నారు. కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు కావ్య క్రిష్ణారెడ్డి, కాకర్ల సురేష్‌లు పనులు జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తయ్యేలా ఇంజనీర్లను పురమాయిస్తున్నారు. ఈ పూడికతీత పూర్తయితే చివరిఆయకట్టు భూములకు కూడా సోమశిల జలాలు పుష్కలంగా అందుతాయి.

తోకజాడిస్తే పీడీ యాక్ట్

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

నగరంలో రోజూ రాత్రి వాహనాల తనిఖీలు

సమయానికి దుకాణాలు మూసేయాలి

అదనపు ఎస్పీ సౌజన్య వెల్లడి



ఇంటర్వ్యూ...

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసు శాఖ ముందుకు అడుగులు వేస్తోందని అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య తెలిపారు. తోకజాడించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని చెప్పారు. నగరంలో వరుసగా జరుగుతున్న హత్యలు, హత్యాయత్నాలు, దాడుల నేపథ్యంలో నగర ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ క్రమంలో శాంతి భద్రతలను గాడిన పెట్టేందుకు ప్రత్యేకంగా తీసుకుంటున్న చర్యలపై ఏఎస్పీ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

? నగరంలో శాంతిభద్రతలకు ఎలాంటి చర్యలు తీసుకుం టున్నారు.

! నగరంలో శాంతిభద్రతలు గాడిన పెట్టేందుకు ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నాం. ప్రతీ రోజూ రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి వరకు వాహన తనిఖీలు చేపడుతున్నాము. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచడం తోపాటు వారంలో ఆదివారం ఒక్కరోజే కాకుండా ప్రతీ రోజు రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపిస్తున్నాము. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాము. నిర్దిష్ట సమయానికి మించి దుకాణాలు, హోటల్స్, షాపింగ్ మాల్స్ తెరచి ఉంటే అటువంటి వాటిపై చర్యలు తీసుకుంటున్నాము.

? వాహన తనిఖీలతో ఫలితాలు ఉన్నాయా.

! నగరంలోని ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి నుంచి నగరంలోకి వచ్చే ప్రదేశాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నాం. నాతోపాటు నగర డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది, ప్రత్యేక బృందాలుగా వాహన తనిఖీల్లో పాల్గొంటున్నారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నాము. అనవసరంగా రాత్రి పూట రోడ్లపైకి వస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాము. నేరాలకు పాల్పడే వారిపై బ్యాడ్‌క్యారెక్టర్‌తో షీట్స్ ఓపెన్ చేసేందుకు వెనుకాడము.

? రౌడీషీటర్లపై ఎలాంటి నిఘా ఉంచారు.

! రౌడీషీటర్లు, పదే పదే నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచా ము. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, శాంతిభద్రతలకు విఘా తం కలిగించే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తాం. రౌడీషీటర్లకు తరచూ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాము. కత్తులు, మారణాయుధాలు పెట్టుకొని తిరుగుతున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తాము. నేర నియంత్రణకు ప్రజల సహకారం అవసరం. గంజాయి విక్రయాలు, సేవించడం, బహిరంగ మద్యపానం, మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటం, దొంగతనాలు, అల్లరు, ఇతర నేరాలు జరుగుతుంటే ప్రజలు 112 నెంబరుకుగానీ, స్థానిక పోలీసులకుగానీ సమాచారమివ్వాలి. అలాంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

ఉగ్రదాడి విషాదం

● మంత్రులు నారాయణ, ఆనం, ప్రజా ప్రతినిధుల ఆగ్రహం

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కశ్మీరులో పర్యాటకులపై మంగళవారం జరిగిన ఉగ్రవాదుల దాడి యావత్ భారతావనిని కలచి వేసింది. మతోన్మాదంతో అమాయకులను అమానుషంగా పొట్టనపొట్టుకోవడం అందరినీ వేదనకు గురిచేసింది. ముష్కరుల దమనకాండ బాధాకరమని, వారికి తగిన గుణపాఠం తప్పదని జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు.

● పిరికిపంద చర్య

పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి పిరికిపంద చర్య. ట్రెక్కింగ్‌కు వెళ్లిన టూరిస్టులను చంపడం తీవ్రంగా కలిచివేసింది. మృతులకు నివాళి అర్పిస్తున్నా, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా.

- నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

● వణికేలా సమాధానం ఉండాలి

పట్టపగలు ఉగ్రవాదులు జరిపిన మారణకాండ దుర్మార్గం. మరోసారి ఇలాంటిది జరగకుండా ఉగ్రవాదులకు, వారికి వెన్నుదన్నుగా నిలిచేవారికి వెన్నులో వణుకుపుట్టేలా సమాధానం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా.

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

● ముష్కరులను ఉరితీయాలి

అమాయకుల ప్రాణాలు బలిగొన్న ముష్కర మూకలను ఉరి తీయాలి. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి. మారణ హోమానికి పాల్పడ్డ ఉగ్రవాదులకు భద్రతాదళాలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతాయి.

- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

● మృతుల ఆత్మకు శాంతి కలగాలి

కాశ్మీర్ ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మశాంతి కోసం భగవంతుని ప్రార్థిస్తున్నా. ఆ కుటుంబాలకు నా సంతాపం తెలియజేస్తున్నాను. ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో దేశం మొత్తం ఒక్కటిగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాను.

- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

● తీవ్రంగా కలిచివేసింది

కశ్మీర్‌లో ఉగ్రదాడి తీవ్రంగా కలిచివేసింది. ఆ ఘటనలో కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదన్‌రావు మృతి చాలా బాధ కలిగించింది. ఆయన కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది. ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తున్నాం.

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ

● తీరని విషాదం

కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదన్‌రావు ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోవడం తీరని విషాదం. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. అన్యంపుణ్యమెరుగని అమాయకుల ప్రాణాలు పొట్టన పెట్టుకోవడం అమానుషం.

- రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

● మృగాల్లా దాడి

కాశ్మీర్ అందాలను తిలకించేందుకు వచ్చిన అమాయక పర్యాటకులపై ముష్కరుల దాడి మృగాలను తలపించింది. ప్రాణాలు కోల్పోయిన వారిలో కావలి వాసి ఉన్నారన్న వార్తతో దిగ్భ్రాంతికి గురయ్యాను. వారి కుటుంబా నికి మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

- ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

ఉద్యానం ఉసూరు!

కందుకూరు డివిజన్‌లో ఉద్యాన పంటల విస్తీర్ణం అధికంగా ఉంది. ఇప్పటికే 20 వేలకుపైగా ఎకరాల్లో పంటలు సాగవుతుండగా ఏడాదికేడాదికి ఆ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగు తోంది. ఇలాంటి తరుణంలో కందుకూ రులోని ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) కార్యాలయం రద్దవడం ఆ ప్రాంత రైతులకు శాపంగా మారే ప్రమాదం ఉంది. ఇక్కడి ఏడీ పోస్టును కుప్పంకు బదలాయించటంతోపాటు కార్యాలయ సిబ్బందిని కూడా ఒంగోలు, పల్నాడు డివిజన్లకు కేటాయిస్తూ ఉద్యానశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ చర్యలతో తాము నష్టపోతామని రైతులు వాపోతున్నారు.





కందుకూరులో రద్దయిన ఉద్యానశాఖ ఏడీ కార్యాలయం

- ● కందుకూరు ఏడీ కార్యాలయం రద్దు
- ● ఏడాది కాలంగా హెచ్‌వో పోస్టు ఖాళీ
- ● 20వేల ఎకరాలకుపైగా ఉద్యాన పంటలు
- ● కానీ ఒక్కరే అధికారి
- ● యంత్రాంగం కొరతతో రైతులకు అందని సేవలు

కందుకూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలో గతంలో ఉలవపాడు ఉద్యానవన శాఖాధికారి, కందుకూరు ఉద్యానవన శాఖాధికారితోపాటు ఏడీ కార్యాలయంలో ఒక టెక్నికల్ హెచ్‌వో పనిచేసే వారు. అయితే ఏడీ కార్యాలయ టెక్నికల్ హెచ్‌వో పోస్టును మూడేళ్ల క్రితమే ప్రభుత్వం రద్దుచేయగా ప్రస్తుతం ఏకంగా ఏడీ కార్యాలయాన్నే రద్దు చేసింది. జిల్లా ఉద్యానవన శాఖాధికారి డివిజన్‌లోని ఉద్యాన శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రాంత రైతులకు అన్నిరకాల సేవలు అందేలా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే జిల్లాలోనే అత్యధికంగా పండ్లతోటలు, ఇతర ఉద్యాన పంటల సాగయ్యే కందుకూరు ప్రాంతంలో ప్రస్తుతం ఉలవపాడు ఉద్యానశాఖాధికారి ఒక్కరి మాత్రమే అందుబాటులో ఉండటం గమనార్హం.

● వేలాది ఎకరాల్లో పంటలు

కందుకూరు పరిధిలోని ఉలవపాడులో అంతర్జాతీయ గుర్తింపు కలిగిన మామిడి తోటలు వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. అలాగే నిమ్మ, బత్తాయి, సపోట, జామ, బొప్పాయి తదితర పండ్లతోటలు కూడా వేలాది ఎకరాల్లో సాగవుతున్నాయి. ఉలవపాడు మండలం కరేడులో సామాజిక అటవీశాఖ అభివృద్ధి చేసిన జీడిమామిడి తోటలు కూడా ఉన్నాయి. కందుకూరు ప్రాంతం లో వేలాది ఎకరాల్లో మిరప సాగవుతోంది. ఉద్యాన శాఖ అంచనాల ప్రకారం 9200 ఎకరాల్లో మామిడితోటలు విస్తరించి ఉండ గా వాస్తవానికి ఈ విస్తీర్ణం 11వేల ఎకరాలకుపైనే ఉంటుందని అంచనా. అలాగే 1365 ఎకరాల్లో మిరప సాగవుతున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతుండగా గత కొన్నేళ్లగా నియోజకవర్గంలో ఏటా 4వేల ఎకరాల్లో మిరప సాగవుతున్నట్లు అంచనా. ఇవికాక నిమ్మ 370 ఎకరాలు, జామ 72 ఎకరాలు, సపోటా 1170 ఎకరాలు, జీడి మామిడి 850 ఎకరాల్లో సాగవుతున్నాయి. అలాగే కూరగాయల తోటలు, మునగ, ఆవాలు తదితర ఉద్యాన పంటలూ చెప్పుకోదగిన విస్తీర్ణంలోనే ఉన్నాయి.

ప్రభుత్వ పథకాలు అందవని ఆందోళన

ఉద్యాన శాఖాధికారులు తగినంతమంది లేకపోవటంతో ప్రభుత్వ పథకా లపై అవగాహన కల్పించే పరిస్థితి ఉండదని, ఫలితంగా తాము తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం రైతులకు డ్రిప్, స్ప్రింక్లింగ్‌తోపాటు ఆధునిక యంత్ర పరికరాలు, ఇతర ప్రోత్సాహకాలు అందజేస్తున్నది. ఇప్పటికే సాగులో ఉన్న పండ్ల తోటల నిర్వహణకు వివిధ రూపాలలో ప్రోత్సాహకాల తోపాటు నూతనంగా పండ్లతోటలు సాగుచేసే రైతులకు ఉపాధి హామీ పథకం అనుసంధానంతో పలురకాల రాయితీలు కల్పిస్తున్నది. అలాగే పండ్లతోటల్లో నీటికుంటల ఏర్పాటునూ ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా పథకాల ఫలాలు తమకు సకాలంలో అందాలన్నా, ఫైళ్లు త్వరిత గతిన కదలాలన్నా ఉద్యాన అధికారుల కొరత ఉంటే కష్టమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిగా కందు కూరు హెచ్‌వో పోస్టు ఖాళీగా ఉంది. ఉలవపాడు ఉద్యాన అధికారి జ్యోతి ఇన్‌చార్జి కావటంతో ఆమెపై పనిభారం పెరుగుతోంది. పండ్లతోటలకు సోకే వివిధ రకాల తెగుళ్ల, వ్యాధుల నివారణకు రైతులకు సకాలంలో తగిన సూచనలు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండాపోయింది. ఏడీ పోస్టు రద్దుచేసిన ప్రభుత్వం కనీసం పంటల విస్తీర్ణానికి అనుగుణంగా కందుకూరుకు ఉద్యాన అధికారిని తక్షణం నియమించటంతోపాటు గతంలో ఉన్న టెక్నికల్ హెచ్‌వో పోస్టును కూడా మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.



హౌసింగ్ అధికారులతో చర్చిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

అర్హులందరికీ పక్కా ఇళ్లు

● నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన ప్రతి పేదవాడికి సొంత ఇంటికలను నెరవేర్చటమే ప్రభుత్వ లక్ష్యమని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నుడా పరిధిలో పక్కా ఇళ్ల నిర్మాణాలు, మంజూరుపై బుధవారం హౌసింగ్ పీడీ వేణుగోపాల్‌తో ఆయన తన చాంబర్‌లో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదవాడి ఇంటి నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వంలో రూ.2.50లక్షలు ఇస్తే, వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ మొత్తాన్ని రూ.1.80లక్షలకు కుదించిందన్నారు. ఆ నిధులు ఇంటి నిర్మాణానికి చాలకపోవటంతో పేదలు ఎవరూ ఇళ్ల నిర్మాణాలను ముందుకు రాలేదన్నారు. దీంతో టీడీపీ అధికారంలోకి రాగానే ఎస్టీ,ఎస్సీలకు రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు, బీసీలకు రూ.50 వేలు చొప్పున అదనంగా నగదు అందిస్తున్నదని పేర్కొన్నారు. దీంతో జిల్లాలోని 6,020 ఇళ్లకు రూ.16.38కోట్లు అదనంగా నిధులు మంజూరు చేశారని ఆయన వివరించారు. నుడా పరిధిలో నూతన గృహాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ గృహాలు మంజూరు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోకుంటే వెంటనే స్థానిక సచివాలయాల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నుడా కార్యదర్శి పెంచలరెడ్డి కూడా పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు ఒకరి గైర్హాజరు

వెంకటాచలం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో బుధవారం జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలలో ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 13 మంది విద్యార్థులకుగాను 12 మంది హాజరయ్యారు.

పోక్సో కేసులపై దృష్టి పెట్టండి

● ఏపీఎస్పీ బెటాలియన్ ఐజీ రాజాకుమారి

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నపిల్లలు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై అలసత్వం ప్రదర్శించవద్దని, పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏపీఎస్పీ బెటాలియన్ ఐజీ రాజాకుమారి జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. బుధ వారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ జి కృష్ణకాంత్ నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశాన్ని జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఐజీ రాజకుమారి పర్యవేక్షించారు. జిల్లాలో చోటుచేసుకున్న గ్రేవ్, నాన్ గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాలలో రికవరీల గురించి స్టేషన్ల వారీగా అధికారులతో ఐజీ సమీక్షించారు. నేరాల ఛేదనకు సాంకేతికతను అందిపుచ్చుకొనేందుకు పలు సూచనలు చేశారు. స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను క్షుణ్ణంగా సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు. విలేజ్ విజిట్ తప్పకుండా చేయడం ద్వారా రాబోయే సమస్యలను అరికట్టవచ్చని సూచించారు. వేసవిలో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, విజిబుల్ పోలీసింగ్, డ్రోన్ సర్వైలెన్స్ విరివిగా చేయాలని ఆదేశించారు. రౌడీషీటర్ల కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ ఈగల్ టీమ్ ప్లకార్డులను ఆవిష్కరించారు. సమీక్షలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

మత్స్యశాఖ ఎఫ్‌డీవోపై విచారణ

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మత్స్యశాఖ ఎఫ్‌డీవో పొట్టియ్యపై మత్స్యకార సంఘం అధ్యక్షుడు కామాక్షయ్య ఫిర్యాదుతో జిల్లా కలెక్టర్ ఆనంద్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆ శాఖ ఏడీ శ్రీనివాసులు కనిగిరి రిజర్వాయర్ వద్ద మత్స్యకారులతో విచారణ చేపట్టారు. మత్స్యకార సంఘం సభ్యుల వద్ద వసూళ్లకు పాల్పడడంతో పాటు రసీదులో తక్కువ రాసి ఎక్కువ మొత్తం తీసుకునేవారని పలువురు మత్స్యకారులు ఆరోపించారు. అధ్యక్షుడి ఎన్నిక ఆ అధికారి కనుసన్నల్లో ఓ ఫొటో స్టూడియోలో నిర్వహించారని పలువురు డైరెక్టర్లు వివరించారు. పాలకమండలి సమక్షంలో జరగాల్సిన ప్రెసిడెంట్ ఎన్నిక ఫొటో స్టూడియోలో పెట్టడం, ఇంత జరిగితే నోటీసులు ఇవ్వకపోవడంపై విచారణాధికారి ఎఫ్‌డీవోని నిలదీయడంతో ఆయన ఖంగుతిన్నారు. విచారణ మేరకు సమగ్ర నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్టు విచారణాధికారి చెప్పారు.

4.82లక్షల మందికి బీమా : డ్వామా పీడీ

పొదలకూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 4.82లక్షల మందికి బీమా సౌకర్యం కల్పించడమే లక్ష్యం అని డ్వామా పీడీ గంగాభవానీ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం రాపూరు, పొదలకూరు, సైదాపురం, కలువాయి మండలాల ఉపాధి ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంక్షేమం కోసం ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలను ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. కమిషనర్ ఆదేశాల మేరకు రెండు బీమా యోజనాలను కూలీలకు వర్తింపచేసేందుకు క్షేత్రస్థాయిలో ఎస్ఏలు, టీఏలు, ఏపీఓలు కృషి చేయాల్సిందిగా ఆదేశించారు. మొదటి బీమా సౌకర్యంకు సంబంధించి రూ.20 చెల్లించాలని, రెండో బీమాకు రూ.436 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కూలీల బ్యాంకు ఖాతాల నుంచి బ్యాంకర్లు మినహాయించుకునే విధంగా ఏర్పాట్లు చేయాల్సిందిగా సూచించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో రూ.20 చెల్లిస్తే ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.2లక్షలు, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజనలో రూ.436 చెల్లిస్తే ప్రమాదవశాత్తు మరణించినా లేదా సహజ మరణం అయినా రూ.2లక్షలు అందజేయడం జరుగుతుందన్నారు.

పీజీ సెట్ అర్హత పరీక్షలకు దరఖాస్తు చేసుకోండి

వెంకటాచలం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీ సెట్ అర్హత పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఏడాదికిగాను పోస్ట్ గ్రాడ్యుయేట్ (ఎంఏ, ఎంకామ్, ఎంఎస్‌సీ, ఎంఎస్‌డబ్ల్యూ తదితర) కోర్సులలో ప్రవేశార్థం ఏపీ పీజీ సెట్ అర్హత పరీక్షలను జూన్ 9 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నారన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఏపీ ఆన్‌లైన్ గేట్‌వే ద్వారా దరఖాస్తు ఫీజు చెల్లించి దరఖాస్తును సమర్పించాలన్నారు. అర్హత ప్రమాణాలు, సీట్లు, సిలబస్, ఇతర సూచనలు, ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారం వెబ్‌సైట్‌లో లభిస్తుందన్నారు. వీఎస్‌యూ కళాశాల, కావలి పీజీ సెంటర్, అనుబంధ కళాశాలలో అందించబడుతున్న కోర్సుల వివరాలు జతచేయబడుతుందన్నారు. జిల్లాలోని విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీలోని డీవోఏ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

హాయ్.. నెల్లూర్..!

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రేక్షకులను 'హాయ్.. నెల్లూర్... అంటూ పలకరించి కోర్టు సినీ హీరోయిన్ శ్రీదేవి నగరంలో సందడి చేశారు. మాగుంట లేఅవుట్‌లో సీఎంఆర్ జ్యూవెలరీలో సోమా ఎక్స్‌క్లూజివ్ వెండి ఆభరణాలను షోరూమ్‌ను బుధవారం ఆమె రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీడీ నేత గిరిధర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె షోరూమ్ అంతా కలియతిరిగి, వెండి ఆభరణాలను అలంకరించుకుని ప్రదర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సోమా ఎక్స్‌క్లూజివ్ వెండి ఆభరణాలను నెల్లూరు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఆభరణాలు ఎంతో అందంగా ఉన్నాయని, అందరికీ అందుబాటులో ఫ్యాక్టరీ అవుట్‌లెట్ ధరలకే విక్రయించడం గొప్ప విషయమని పేర్కొంటూ సీఎంఆర్ యాజమాన్యాన్ని అభినందించారు. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎంఆర్ అధినేతలు వెండి ఆభరణాల్లో అద్భుత కలెక్షన్స్‌తోపాటు 92.5 క్వాలిటీ కలిగిన జ్యూవెలరీ తయారీ ధరలకే విక్రయిస్తున్నారని, వినియోగదారులంతా వినియోగించుకోవాలని తెలిపారు. సీఎంఆర్ జ్యూవెలరీ అధినేతలు మావూరి శ్రీనివాసరావు, సంతోష్, గణేష్ మాట్లాడుతూ వెండి జ్యూవెలరీ డిజైన్ల ప్రత్యేకతలు, డిస్కౌంట్స్ తదితర విషయాలను వివరించారు. హీరోయిన్ శ్రీదేవిని చూసేందుకు భారీగా అభిమానులు తరలిరావడంతో షోరూమ్ బయట రోడ్డు కిక్కిరిసింది.



నగరంలో సందడి చేసిన హీరోయిన్ శ్రీదేవి

పొగాకు మద్దతు ధరకు కృషి చేస్తా

● వేలం కేంద్రం సందర్శనలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు మద్దతు ధర అందించడానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పెరగని ధరలు-పొగాకు రైతుల ఆందోళన' కథనంతో పాటు నియోజకవర్గంలోని పలువురు రైతులు పొగాకు మద్దతు ధర పెరగకపోవడం, లోగ్రేడు పొగాకు బేళ్లను కొనుగోలు చేయకపోవడం తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన బుధవారం వేలం కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పొగాకు ధరలు పెరగకపోవడానికి, లోగ్రేడు పొగాకును కొనుగోలు చేయకపోవడానికి గల కారణాలను బోర్డు అధికారులతోపాటు, పొగాకు కొనుగోలు కంపెనీల ప్రతినిధులను ప్రశ్నించారు. అంతర్జాతీయ మార్కెట్‌నుబట్టి పొగాకు ధర ఉంటుందని, మార్కెట్ డిమాండ్‌ను బట్టి పొగాకు కొనుగోలు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. దీంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ల దృష్టికి తీసుకెళ్లి రైతుకు మద్దతు ధర అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు రైతు సంఘం నాయకులు రావూరి శ్రీకాంత్, లక్ష్మీనరసింహ, రావులకొల్లు సర్పంచు పూసాల వెంగపనాయుడు, బోర్డు అధికారులు, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పొగాకు వేలం కేంద్రంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఎన్ఎంసీ కమిషనర్‌గా నందన్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎంసీ కమిషనర్‌గా వైవో. నందన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్పొరేషన్‌లోని కమిషనర్ చాంబరులో ఈ మేరకు ఆయన దస్త్రాలపై సంతకం చేశారు. అనంతరం ఆయన్ను కార్పొరేషన్‌లోని విభాగాధిపతులు, ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అందరి సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రజల నుంచి వచ్చే వినతులపై తక్షణం స్పందించాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచించారు. అనంతరం నగరంలో దోమల నివారణపై పారిశుధ్య విభాగంతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన పారిశుధ్య కార్మికులకు టోపీలు అందచేశారు.